జూన్, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 5 పేజీలు: 64 వెల: రూ. 20/-



# ఖరీఫ్‌కి సన్నద్ధమవుదాం!

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సరికొత్త ప్రయోగం 'పురా'




## గ్రామీణాభివృద్ధి మోడల్

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 5

జూన్, 2010



ఎడిటర్

**డా॥ ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)

**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఏ.ఎస్. (రిటైర్డ్)

**బ్రిగేడియర్ డి.వి. రావు**

**మహమ్మద్ తకీయుద్దీన్**

**ఎమ్.ఎ. కుమార రాజా**

**హెచ్. కూర్మారావు**

**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**

**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**

**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**

**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**

**డాక్టర్ వి.ఎస్.వి.కె.శాస్త్రి**



కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్



రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005

E-mail ID : phanikumar@ap.gov.in
phaniapard@gmail.com


# విషయ సూచిక


సంపాదకీయం ..... 2
ఖరీఫ్‌కి సిద్ధంగా ఉందాం ..... 3
గూగుల్ మెచ్చిన గిరిజన గ్రామం కొండాపూర్ ..... 7
రెవెన్యూ పదాలు - అర్థాలు ..... 10
యాతన (కథ) ..... 14
ప్రజోపయోగ నిర్ణయాలు తీసుకున్న మంత్రివర్గం ..... 16
స్థానిక ప్రభుత్వాల బలోపేతమే సి.ఎల్.జి.ఎఫ్. లక్ష్యం ..... 18
మన టి.వి. (సాప్‌నెట్) ఛానల్-3 కార్యక్రమాలు ..... 24
వార్తల్లో 'అపార్డ్' ..... 25
పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తిని పెంపొందించే ఆహారం ..... 27
జీవరాశులు 10 కోట్లు... భూమి ఒక్కటే... భవిష్యత్తూ ఒక్కటే ..... 28
కొలువు తీరిన పూల ఉత్సవం ..... 32
గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి 'పురా' ..... 36
పంచాయతీల్లో మహిళల పురోగమనం ..... 41
అనితరసాధ్యం శ్రీశ్రీ కవితా మార్గం ..... 43
కుంభ (జన) మేళా ..... 45
రహస్యం బదులు 'పారదర్శకత' ..... 47
కవి జనాశ్రయుడు మల్లియ రేచన ..... 49
వికలత్వ నిర్ధారణ కోసం సరికొత్త సాఫ్ట్‌వేర్ ఆధారితా విధానం ..... 51
మురికి మూర్ఖులు (కథ) ..... 54
బ్రిటన్ ఎన్నికల కథా... కమామిషు ..... 57
ఫుట్‌బాల్ ఆటకు ఆ కాలం నిజంగా స్వర్ణయుగం ..... 61

# సంపాదకీయం..

## రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోంది. రైతన్నలు అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకుంటూ ఏరువాకకి సై అంటూ కదులుతున్నారు. నాణ్యమైన విత్తనాలు, నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడి ధనం లేక రుణాలు మొదలైనవి ఈ అస్త్రశస్త్రాలు. వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ప్రధానంగా వీటికి సంబంధించినవే కాబట్టి, రాష్ట్ర ప్రభుత్వం కూడా వీరికి వీలనయినంత సహాయం చేసేందుకు బృహత్తర కార్యక్రమాలను చేపట్టింది.

రైతుల్లో అవగాహన పెంపొందించి, వ్యవసాయోత్పత్తిని ఇనుమడింప చేయాలన్న సదాశయంతో మే నెల 17 నుంచి జూన్ 2 వరకు రాష్ట్ర ప్రభుత్వం రైతు చైతన్యయాత్రలు నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ సదస్సుల్లో అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను రైతులకు అందించటం, పెట్టుబడి ఖర్చులను తగ్గించి సేద్యాన్ని లభసాటిగా మార్చటమే ప్రధానోద్దేశ్యంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ రైతు చైతన్యయాత్రల్లో రాష్ట్ర ప్రభుత్వంలోని 22 వ్యవసాయ అనుబంధశాఖలు పాల్గొన్నాయి. దాదాపు 22 లక్షల మంది రైతుల్ని కలుసుకుని వారిలో సేద్యం పట్ల అవగాహన కల్పించే లక్ష్యంతో చేపట్టిన ఈ యాత్రలు విజయవంతమయ్యాయి. గత కొన్నేళ్లుగా రైతు చైతన్యయాత్రలు జరుగుతున్నప్పటికీ, ఇంత పెద్దఎత్తున చేపట్టడం ఇదే ప్రధమం. రాష్ట్రంలోని 51,000 గ్రామాల్లో ఈ యాత్రలు జరిగాయి.

దాదాపు 15 రోజులపాటు జరిగిన ఈ యాత్రల్లో విత్తనోత్పత్తి పథకం ద్వారా నాణ్యమైన విత్తనాలు సేకరణ, వ్యవసాయ యాంత్రీకరణ, సేంద్రీయ వ్యవసాయం, విత్తనశుద్ధి, పంటలు బీమా, భూసార పరీక్షలు, ఎరువులు, పురుగుమందులు, తదితర విషయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగించారు. అంతేకాక గత ఏడాది నుంచి రైతు చైతన్యయాత్రల్లో భాగంగా గ్రామీణ విత్తనోత్పత్తి పథకం అమలుపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది.

అయినప్పటికీ, రాష్ట్రంలో రైతులు నాణ్యమైన విత్తనాలు పొందటంలో సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నారు. నిజానికి విత్తన వ్యాపారంలో దేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, దురాశాపరులైన విత్తన వ్యాపారుల వల్ల రైతులు విలువైన పంటలను నష్టపోతున్నారు. అందుకే, నకిలీ విత్తన వ్యాపారుల భరతం పట్టటానికి దాదాపు 40 తనిఖీ బృందాలు నాసిరకం విత్తనాలను 'సీజ్' చేసే పనిలో ఉంటున్నాయి. లక్షల క్వింటాళ్ల విత్తనాలను 'సీజ్' చేస్తున్నాయి. వాటి విలువ కోట్ల రూపాయల్లో ఉంటున్నది.

వ్యవసాయం విజయవంతం కావాలంటే, భూసారానికి సంబంధించిన సమాచారం రైతులవద్ద ఉండటం అవసరం. అందువల్లనే రైతు చైతన్య యాత్రల్లో భాగంగా అధికారులు భూసారానికి సంబంధించిన నమూనాలను లక్షల సంఖ్యలో సేకరించారు. నేల భౌతిక లక్షణాలు, పోషక లోపాలు, నేలలకు అనువైన పంటల వివరాల వంటివి ఈ పరీక్షల్లో తెలుస్తాయి. వీటి ఆధారంగా భూమిలోకి పోషకలోపాలను సరిదిద్దుకుని అనువైన పంటలను ఎంపిక చేసుకోవటం ద్వారా రైతులు మంచి దిగుబడులను అందుకునే వీలుంది.

ఇన్నాళ్లు తమ వ్యవసాయ అనుభవంతో సంపాందించిన ఆచరణాత్మక పరిజ్ఞానం సహాయంతో, ప్రభుత్వం తన వంతు చేయూతగా అందిస్తున్న సహకారాన్ని, సాధన సంపత్తిని కూడా ఉపయోగించుకుని రైతన్నలు ఖరీఫ్ సీజన్‌ను లాభసాటిగా ముగిస్తారని ఆశిస్తున్నాం.





# ఖరీఫ్‌కి సిద్ధంగా వుందాం

**మృగశిరకార్తె ప్రవేశించగానే రైతు ఆశగా ఆకాశంవైపు చూస్తాడు. రైతు ఆశను వమ్ము చేయకుండా తొలకరి జల్లులు పడగానే పుడమితల్లి పులకరిస్తుంది. రైతు కూడా ప్రకృతికి ప్రణమిల్లి పంటలు విత్తుకోవటానికి తయారౌతాడు. ఈ సంవత్సరం ఏప్రిల్ 24వ తేదీన భారత వాతావరణశాఖ వారు విడుదల చేసిన ముందస్తు అంచనాల ప్రకారం 2010వ సంవత్సరం జూన్ నుండి సెప్టెంబరు వరకు మన దేశంలో సాధారణ వర్షపాతంలో 98% వరకు నమోదయ్యే అవకాశముంది.**

1941వ సంవత్సరం నుండి 1990వ సంవత్సరం వరకు నమోదైన సాధారణ వర్షపాతం సగటు 89 సెం.మీ. అంటే ఖరీఫ్ కాలానికి మన దేశంలో నమోదయ్యే సాధారణ వర్షపాతం 89 సెం.మీ. ఈ సంవత్సరం సాధారణ వర్షపాతంలో 98 శాతం వరకు నమోదయ్యే అవకాశం వుందని భారత వాతావరణ శాఖ వారి అంచనా. గత సంవత్సరం 97% వరకు వర్షపాతం వుండవచ్చని అంచనా వేయగా, కేవలం 77% మాత్రమే నమోదయ్యింది. అయితే ఈ సంవత్సరం ఎలినినో ప్రభావం తగ్గటం వలన వర్షాలు పెరిగే అవకాశం వుంది.

మరి మనం ఖరీఫ్ పంటలకు సిద్ధంగా వుండాలంటే ఎరువులు, విత్తనాలు, సస్యరక్షణ మందులు. వీటిని కొనుగోలు చేసేందుకు అవసరమైన బ్యాంకు రుణాలు - వీటితో సిద్ధంగా వుండాలి.

## నూతన ఎరువుల విధానం

ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలి అన్న ఉద్దేశ్యంతో మన ప్రభుత్వం గతకొద్ది దశాబ్దాలుగా ఎరువులపై రాయితీ ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తూ వుంది. ప్రభుత్వం ఎరువుల పై రాయితీ ఇవ్వడంలో ప్రధాన ఉద్దేశ్యం ప్రతి ఎకరాకు ఎక్కువ దిగుబడులు సాధించటం, తద్వారా రైతులకు సరిపడ ఆదాయం వచ్చేలా చూడటం, వినియోగదారులకు, అంటే ప్రజలందరికీ ఆహారధాన్యాలు అందుబాటులోకి రావటం.



అయితే ఈ ఎరువుల వాడకంలో సమతుల్యత లోపించి దానివల్ల ఇతర సమస్యలు గుర్తించటం జరిగింది. ముఖ్యంగా నత్రజని ఎరువులు అవసరమైన వాటికన్నా ఎక్కువ వాడటం, ఇతర పోషకాలైన భాస్వరం, పోటాషియం, గంధకం తక్కువగా వాడటం - వీటి వలన వివిధ నేలల్లో పోషకాల లభ్యతలో తేడాలు రావటం, చీడ పీడలను తట్టుకునే శక్తిని పంటలు కోల్పోవటం - ఇలాంటి సమస్యలు గుర్తించటం జరిగింది.

వీటిని సరిదిద్దాలి అన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఇటీవల నూతన ఎరువుల విధానాన్ని ప్రకటించింది. ఏప్రిల్ 1వ తేదీ నుండి పోషకాల ఆధారిత రాయితీ (Nutrient Based Subsidy) విధానం అమలులోకి వచ్చింది. ఈ విధానం వలన యూరియా ధర 10 శాతం పెరుగుతుంది. టన్నుకి రూ. 4830 వున్న యూరియా ధర ఏప్రిల్ నుండి రూ. 5310 అయింది. మన దేశంలో యూరియా వాడకం చాలా ఎక్కువగా వుంది. ఇతర పోషకాల వాడకం కావలసిన దాని కన్నా తక్కువగా వుంది.

నూతన ఎరువుల విధానంలో నత్రజని, భాస్వరం, పొటాషియం, గంధకం, ఇతర పోషక పదార్థాలపై రాయితీని పోషకాల ఆధారంగా నిర్ణయించటం జరుగుతుంది. ఈ విధానం వలన పంటలకు ఏ పోషకాలు అవసరమో వాటినే ప్రోత్సహించటం జరుగుతుంది. కేంద్ర ఎరువుల మంత్రిత్వ విభాగం కార్యదర్శి అధ్యక్షతన ఒక కమిటీని నియమించటం జరిగింది.

ఈ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా ఏ పోషకానికి ఎంత రాయితీ ఇవ్వాలో నిర్ణయిస్తారు. ఎరువుల తయారీదారులు ఈ రాయితీని దృష్టిలో పెట్టుకొని రైతులకు అమ్మే ధరను నిర్ణయిస్తారు. ఎరువుల ధరలు పెరగకుండా ప్రస్తుతం వున్న స్థాయిలోనే వుంటాయని ఎరువుల కంపెనీలు హామీ ఇచ్చాయి.

రైతులు ఈ విషయాలను దృష్టిలో వుంచుకొని సమగ్ర ఎరువుల యాజమాన్యం ఆచరించాలి. అంటే మన పొలాల్లో సుస్థిరమైన దిగుబడులు సాధించటానికి సేంద్రీయ, జీవన రసాయన ఎరువులను సమన్వయంతో సమగ్రంగా వాడాలి. వీలున్న చోట్ల పచ్చిరొట్ట పైర్లను పెంచి సేంద్రీయ ఎరువుల లభ్యతను పెంచాలి.



రైజోబియం, అజటి బ్యాక్టర్, అజోస్పైరిల్లిమ్, నీలి ఆకు పచ్చనాచు, అజొల్లా, ఫాస్ఫోబ్యాక్టీరియా - ఇలాంటి జీవన ఎరువులను వాడాలి. జింక్, ఇనుము లాంటి సూక్ష్మపోషక లోపాలు వున్నట్లయితే వాటిని సరిదిద్దుకోవాలి.

నేలలో చేడు లేదా మురుగునీరు సమస్యలు వున్నట్లయితే వాటిని సరిదిద్దాలి. అప్పుడే మనం వేసిన ఎరువులు సక్రమంగా వినియోగింపబడతాయి.



## విత్తనాలు

వివిధ పంటలలో సిఫార్సు చేసిన అధిక దిగుబడినిచ్చే వంగడాలు / హైబ్రీడ్స్ ఎంపిక చేసుకోవాలి. రకాలు ఎంపిక చేసుకునేటపుడు ఆయా ప్రాంతాలలో వచ్చే కీటకాలు, తెగుళ్ళను తట్టుకునే శక్తి వున్న రకాలను ఎంపిక చేసుకుంటే మంచిది. ఖరీఫ్ కాలానికి వివిధ పంటలలో సిఫారసు చేసిన రకాలు.

### వరి

*వరినాట్లు ముందుగా వేయటానికి*

| | | |
|---|---|---|
| ఉత్తర కోస్తా మండలానికి | : | పుష్కల, రాశి |
| దక్షిణ కోస్తా మండలానికి | : | భరణి, నిధి, శ్రావణి, సోమశిల |
| ఉత్తర తెలంగాణా మండలం | : | ఓరుగల్లు, సాంబామసూరి |

*ఖరీఫ్‌లో సాధారణ పరిస్థితులలో నాట్లు వేయటానికి*

| | | |
|---|---|---|
| కృష్ణా గోదావరి మండలం | : | స్వర్ణ, చైతన్య, కృష్ణవేణి, వజ్రం, ప్రతిభ, గోదావరి, బాపట్ల సన్నాలు |
| ప్రకాశం జిల్లాకు | : | పెన్నా, పినాకిని |
| ఉత్తర కోస్తా మండలానికి | : | శ్రీకాకుళం సన్నాలు, స్వర్ణ, చైతన్య, సోనామసూరి, వసుంధర |
| దక్షిణ కోస్తా | : | యన్‌యల్ఆర్ 9674, వేదగిరి, పినాకిని, తిక్కన, సింహపురి |



| | | |
|---|---|---|
| ఉత్తర తెలంగాణా మండలం | : | జగిత్యాల సన్నాలు, పొలాసప్రభ, ఇందూర్ సాంబ, పోతన, తెల్లహంస, శివ, కేశవ |
| దక్షిణ తెలంగాణా మండలం | : | సాంబా మసూరి, సాగర్ సాంబ, ఎర్లీసాంబ, ఎర్రమల్లెలు, తెల్లహంస |
| అల్ప వర్షపాత మండలం | : | సాంబ మసూరి, సోనా మసూరి, నంద్యాల సన్నాలు |
| ఉన్నత శ్రేణి పర్వత ప్రాంతం | : | శ్రీకాకుళం సన్నాలు, చైతన్య, స్వర్ణ, ఫల్గుణ, సురక్ష |

### *వరినారు మడిలో మెళుకువలు*

* ప్రతి సెంటు విస్తీర్ణానికి 5 కిలోల మొలక కట్టిన విత్తనాన్ని వాడుకోవాలి.
* నారు మడిని 10-12 రోజుల ముందే దమ్ము చేసి చదును చేయాలి. బాగా చిలికిన పశువుల ఎరువు వాడాలి.
* నారు 2-3 ఆకులు తొడిగే వరకు ఆరుతడి మీద వుంచి ఆ తర్వాత పలుచగా నీరు నిలకట్టాలి.
* 5 సెంట్ల నారు మడికి 2 కిలోల నత్రజని (1 కిలో విత్తనం చల్లే ముందు, 1 కిలో విత్తిన 12-14 రోజులకు) 1 కిలో భాస్వరం, 1 కిలో పొటాష్ ఇచ్చే ఎరువులు దుక్కిలో వేయాలి.

## జొన్న

సిఎస్‌హెచ్1, సిఎస్‌వి-15, ఐసిఎస్‌వి-745, పివికె-801, ఎన్‌టిజె-2, సిఎస్‌హెచ్ 5, సిఎస్‌హెచ్ 9, సియస్‌హెచ్ 13, సిఎస్‌హెచ్ 16, విత్తనం మోతాదు ఎకరాకు 8-10 కిలోలు.

## సజ్జ

ఐసిటిపి-8203, డబ్యుసిసి-75, ఐ.సి.యమ్.వి. 221, ఐసియంహెచ్ 356, పి.హెచ్.బి 65, మల్లికార్జున, ఐసియంహెచ్ 451, జె.కె.బి.హెచ్ 598 విత్తనం మోతాదు ఎకరాకు 1.6 కిలోలు.

## మొక్కజొన్న

డిహెచ్‌యం 103, డిహెచ్‌యం. 105, డిహెచ్‌యం 1, త్రిశూలత, బి.హెచ్ 2187, డిహెచ్‌యం 107 డిహెచ్‌యం. 109, మాధురి.

## సోయాచిక్కుడు

జె.ఎస్ 35, ఎమ్.ఎ.సి.యస్ 450, పి.కె 1029, ఎల్.ఎల్.బి 1, పి.కె 472, ఎమ్.ఎ.సి.ఎస్ 58. విత్తనం మోతాదు ఎకరాకు 20-26 కిలోలు.

## మినుము

ఎల్‌బిజి20 (తేజ), టి-9, లాం 623, వరంగల్ 26, పి.బి.జి. 1. విత్తనం మోతాదు - ఎకరాకు 6.4 నుండి 7.2 కిలోలు.

## పెసర

ఎల్.జి.జి 407, ఎల్.జి.జి 450, యం.ఎల్. 267 పూసా 105, డబ్ల్యు.జి.జి 37 (ఏకశిల) డబ్ల్యు.జి.జి 2, ఎమ్.జి.జి 295. విత్తనం మోతాదు ఎకరాకు 6-6.4 కిలోలు

ఏ పంటలోనైనా హైబ్రిడ్ రకాలు సాగు చేసేట్లయితే తప్పనిసరిగా ప్రతి సంవత్సరం విత్తనాన్ని మార్చుకోవాలి.అధిక దిగుబడి రకాలైతే కనీసం 2-3 పంటల కొకసారైనా విత్తనాన్ని మార్చుకోవాలి. ధృవీకరింపబడిన విత్తనాలు కొనుగోలు చేయాలి. అలాంటి విత్తనాలు విత్తనశుద్ధి చేయబడి వుంటాయి. మొలకశాతం బాగుంటుంది.

విత్తనాలను అధీకృత డీలర్ల నుండి మాత్రమే కొనుగోలు చేయాలి. విత్తన ప్యాకెట్ మీద సీలు సరిగా వున్నదా లేదా గమనించాలి. గడువు తేది, లాటు నెంబరు, మొలకశాతం మొదలైన వివరాలు గమనించాలి. డీలరు నుండి తప్పనిసరిగా రశీదు అడిగి తీసుకోవాలి. రశీదులో కంపెనీ పేరు, విత్తనం రకం, లాటు నెంబరు, తేదీ, మొదలైన వివరాలు తప్పనిసరిగా పొందుపరచాలి. పంట చేతికొచ్చే వరకు విత్తన సంచి, రశీదు భద్రపరచి వుంచాలి.

## విత్తనశుద్ధి

ధృవీకరింపబడని విత్తనాలు కొనుగోలు చేయకుండా రైతు తన పంట నుంచి విత్తనాన్ని సేకరించినా, తోటి రైతుల నుండి విత్తనాలు తీసుకున్నా తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. వివిధ పంటలలో విత్తనశుద్ధికి వాడవలసిన మందులు.

***వరి :*** కిలో విత్తనానికి 2.5 గ్రాముల కార్బండిజిమ్ మందుతో విత్తనశుద్ధి చేసినట్టయితే అగ్గితెగులు, ఆకుపచ్చ తెగులు నుండి రక్షణ లభిస్తుంది.

***జొన్న :*** కిలో విత్తనానికి 3గ్రా. థైరమ్ లేదా కాప్టాన్‌తో శుద్ధి చేయాలి. కాటుక తెగులు నుండి కాపాడుకోవచ్చు.

***సజ్జ :*** కిలో విత్తనానికి 3గ్రా. థైరమ్ లేదా కాప్టాన్‌తో శుద్ధి చేయాలి. పచ్చకంకి తెగులు నుండి రక్షణ వస్తుంది.

***మొక్కజొన్న :*** కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకో జెబ్‌తో శుద్ధి చేయాలి.

***సోయాచిక్కుడు :*** కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్‌తో శుద్ధి చేయాలి.

***మినుము :*** కిలో విత్తనానికి 30 గ్రా. కార్బోసల్ఫాన్, 2.5 గ్రా థైరమ్ లేదా క్యాప్టాన్‌తో శుద్ధి చేయాలి.

విత్తనశుద్ధి మందులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్ని ఇస్తాయి. రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి.

## వర్షబీమా పథకం

మన దేశంలో వ్యవసాయం ఎక్కువగా వర్షాధారం. వర్షపాతాలలో తేడాల వలన పంట దిగుబడిలో 50% తేడా వస్తుంది. ఈ దిగుబడి అంచనాలకు అందకుండా మారుతుంది. ప్రకృతిపైన రైతు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుంది. ఈ అనిశ్చిత పరిస్థితి నుండి రైతులను కొంతవరకు ఆదుకోవాలి అనే ఆశయంతో మనదేశంలో 2005వ సంవత్సరం నుండి వర్ష బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు.

వర్షబీమా అనేది వర్షాభావం వల్ల పంట దిగుబడిలో తగ్గుదలను కవర్ చేస్తుంది. వర్షబీమా పథకం జూన్ నుంచి సెప్టెంబరు వరకు తక్కువ వ్యవధి పంటలకు, జూన్ నుంచి అక్టోబరు వరకు మధ్యకాలిక వ్యవధి పంటలకు, జూన్ నుంచి నవంబరు వరకు దీర్ఘకాలిక వ్యవధి పంటలకు వర్తిస్తుంది.

ఆయా రాష్ట్రాలను బట్టి ఈ కాలవ్యవధి మారుతుంటుంది. వర్షబీమా పొందాలనుకునే రైతులు, విత్తనాలు వేయటం విఫలమైతే పరిహారం పొందాలనుకుంటే జూన్ 15లోగా, మిగిలిన వాటికి జూన్ 30లోగా బీమా చేయించాలి. పంట రుణాలు తీసుకునే బ్యాంకులు, సహకార సంఘాలలో ప్రీమియం, తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

## పంట మార్పిడి

రైతు తన భూమిలో ప్రతిసంవత్సరం ఒకే పంటను పండించకుండా వివిధ పంటలను మారుస్తూ పండించటాన్ని పంట మార్పిడి అంటారు. రైతులు సాధారణంగా తన భూమికి అనుకూలంగా వుండే పంటను ఎంపిక చేసుకొని ప్రతి సంవత్సరం అదే పంటను సాగు చేయటం అలవాటు. అయితే ఒక భూమిలో ఒకే తరహా పంటను క్రమం తప్పకుండా కొన్ని సంవత్సరాలు సాగు చేయటం వలన లాభం కన్నా నష్టం ఎక్కువగా ఉంటుంది. పంట మార్పిడి వలన లాభాలను తెలుసుకుంటే రైతులు తప్పకుండా ఈ పద్ధతి అవలంబిస్తారు.

పంట మార్పిడి వలన నేలలో వివిధ పొరల్లో వుండే పోషకాలు సక్రమంగా సద్వినియోగం అవుతాయి. కంది, ప్రత్తి ఇలాంటి పంటల వేర్లు నేలలో చాలా లోతుకుపోతాయి. కాబట్టి ఈ తరహా పంటలు నేలలో లోపలి పొరల్లోని పోషకాలను మాత్రమే తీసుకుంటాయి.

ఈ తరహా పంటలను ఎక్కువ సంవత్సరాలు సాగు చేయటం వలన నేల పైపొరల్లోని పోషకాలు అలానే వుండిపోతాయి. లోపలి పొరల్లో పోషకాలు ఎక్కువగా తీసుకోవటం వలన అక్కడ పోషకాల కొరతవచ్చి ఆ పైర్లు సరిగా ఎదగవు. కొన్ని పంటల వేర్లు నేలలోని పై పొరల్లోనే వుండి ఎక్కువలోతుకు పోవు. ఉదాహరణకు జొన్న, మొక్కజొన్న, గోధుమ మొదలైనవి. కాబట్టి ఇలాంటి పంటలతో పంట మార్పిడి చేయటం వలన నేలలోని అన్నిపొరల్లో వుండే పోషకాలు వినియోగింపబడతాయి.

పంట మార్పిడి పాటించేటప్పుడు పప్పుధాన్యపు పంటలు అంటే కంది, పెసర, మినుము లాంటి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి. వీటిని లెగ్యూమ్ జాతి పంటలు అని కూడా అంటాము. ఈ పంటలు నేలలో నత్రజనిని స్థిరీకరింప చేస్తాయి. నేల భౌతిక గుణాలు కూడా బాగుపడతాయి. ఎక్కువ పంట దిగుబడులు కూడా పొందవచ్చు.

పంట మార్పిడి పాటించటం వలన చీడ పీడల ఉధృతిని కూడా కొంతమేరకు తగ్గించవచ్చు. ఒకే పంటను క్రమం తప్పకుండా ఒకే భూమిలో సాగుచేయటం వలన చీడ పురుగుల ఉధృతి ఎక్కువ అవుతుంది. ఒకే పంటను ప్రతి సంవత్సరం సాగుచేయటం వలన ఆ పంటను ఆశించే పురుగుల జీవితచక్రం ఏవిధమైన ఆటంకం లేకుండా సాఫీగా సాగుతుంది.



సాధారణంగా పంట కాలంలో పురుగుల పంటను నష్టపరచి, తమ సంతతిని అభివృద్ధి చేసుకొని, పంట పూర్తయ్యే సమయానికి అవి కోసస్థ దశలో నేలలోకి చేరతాయి. ఆ తరువాత అదే పంటను వేసినపుడు ఆ కోసస్థ దశలోని పురుగుల రెక్కల పురుగులుగా మారి, పంటపై గుడ్లు పెట్టి తమ సంతతిని వృద్ధిపరచుకొని పంటను నష్టపరుస్తాయి. కాని వేరే పంటను వేసినట్లయితే రెక్కల పురుగు గ్రుడ్లు పెట్టలేదు, పెట్టినా అవి పంటను నష్టపరచలేవు. క్రమేణా ఆ పురుగుల ఉత్పత్తి తగ్గుతుంది.

ఈ ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని రైతులు విధిగా పంట మార్పిడి పద్ధతి పాటించాలి.

*- జి. విజయకుమార్*
*ఆకాశవాణి*

# గూగుల్ మెచ్చిన గిరిజన గ్రామం కొండాపూర్

**కొం**డాపురం ఒక గిరిజన అటవీ గ్రామం. అక్షరాస్యతలో ఆదర్శం... మద్యనిషేదంలో ముందంజ... పన్నుల చెల్లింపులో ప్రథమం... వెరసి ఆదర్శ గ్రామం. వరంగల్ జిల్లా కేంద్రానికి 67 కి.మీ., నల్లబెల్లి మండల కేంద్రానికి 18 కి.మీ. దూరంలో చుట్టూరా అడవితో ఆవరించి వున్న గ్రామం 1995లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది. ఒక చిన్న ఆసరా దొరికితే గిరిజనులు సైతం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకు పోతారనటానికి ఈ గ్రామ పంచాయతీని ఒక ఉదాహరణగా చెప్పుకోవచ్చు. గిరిజన ప్రజలకు గ్రామ పంచాయతీ అందిస్తున్న సేవలను గుర్తిస్తూ రూ. 5.00 లక్షల ప్రతిభా పురస్కారాన్ని 'గూగుల్' అందచేసింది. ఈ గ్రామ విజయగాథను, అభివృద్ధిని స్థానిక పాలన పాఠకులకు అందిస్తున్నాము.



### ముందడుగు ఆలోచన

2007 వ సంవత్సరంలో అప్పటి జిల్లా కలెక్టర్ ఒక్కో ప్రభుత్వ ఉద్యోగి ఒక్క గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేయాలనే పిలుపుతో మండల ఇ.ఓ.పి.ఆర్. అండ్ ఆర్.డి.గా పనిచేస్తున్న చందర్ అదే గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కందుల గోవర్ధన్, లోడి సాంఘిక సేవా సంస్థ ఇంచార్జి శ్రీనివాస్ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దటానికి ముందుకు వచ్చారు. తేది.05.12.2007 నాడు గ్రామ



సర్పంచ్ శ్రీ వాసం కన్నయ్య అధ్యక్షతన గ్రామ సభను ఏర్పాటు చేసుకొని గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను సమీకరించి గ్రామ సమస్యలు వాటి పరిష్కారంపై సమాలోచనలు జరిపారు. అంతే కాక జాతీయ స్థాయిలో ఉత్తమ గ్రామంగా నిలుస్తున్న గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లిని స్ఫూర్తిగా తీసుకొని తదనుగుణంగానే సర్పంచ్ గౌరవ అధ్యక్షుడిగా ఎనిమిది కమిటీలను ఏర్పాటు చేశారు. అవి:

1. మద్యపాన నిషేధ కమిటి
2. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కమిటి
3. నిరక్షరాస్యత నిర్మూలన కమిటి
4. మంచినీటి సరఫరా కమిటి
5. పర్యావరణ పరిరక్షణ కమిటి
6. ఆరోగ్య పరిరక్షణ కమిటి
7. మహిళా సమస్యల పరిష్కార కమిటి
8. అటవీ హక్కుల పరిరక్షణ కమిటి

గ్రామ సర్పంచ్ సారధ్యంలో గ్రామ పంచాయతీ మార్గదర్శకత్వంలో ఉప కమిటీలు పని చేస్తూ వుంటాయి. ఒక్కొక్క కమిటిలో 5గురు సభ్యులు, వారికి నాయకులుగా వార్డుమెంబర్లు ఉంటారు. 5×8 = 40 మందితో కూడిన ఈ ఉప కమిటీలకు సలహాదారులుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు శ్రీ కందుల గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శి శ్రీ జగదీశ్, లోడి సేవా సంస్థ మండల ఇంచార్జి శ్రీనివాస్‌లు వున్నారు.

### మద్యపాన నిషేధం

సర్వసాధారణంగా గిరిజన గ్రామాలలో మద్యం సేవించడం, తయారు చేయడం అనేది ఒక అలవాటు - సంప్రదాయకంగా ఉంటుంది. చాలా వరకు ప్రతి ఇంట్లో కనీసం ఇంటి అవసరం వరకైనా సారా బట్టీలు పెట్టి సారాయి తయారు చేసుకొని తాగుతుంటారు. చాలా సమస్యలకు ప్రధాన కారణం మద్యం సేవించడం కావున, మొదట మద్యనిషేధాన్ని అమలు చేస్తే గ్రామాభివృద్ధిని సాధించుకోవచ్చు అని గ్రహించి గ్రామంలో ఎవ్వరూ మద్యాన్ని తయారు చేయకూడదు - త్రాగకూడదు అని మద్యనిషేధానికి నాందిపలికారు. గ్రామంలో అందరికీ కౌన్సిలింగ్ నిర్వహించి మద్యం

సేవించడం వలన కలిగే అనర్థాలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. మద్యం మహమ్మారిని రూపు మాపుకోవడమే ప్రధాన లక్ష్యంగా ముదురుకోళ్ల స్వరూప అనే మహిళ అధ్యక్షతన నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసుకొని మండల పోలీసు, ఎక్సైజ్ అధికారుల సహకారంతో రెండేళ్ళుగా సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని గ్రామంలో అమలు పరుస్తున్నారు.

## అక్షరాస్యత

**అక్షర దక్షిణ** :

చదువుకుంటున్న, చదువుకున్న విద్యార్థులు తమ తల్లి దండ్రులకు అక్షరాలను - చదువును నేర్పాలని, అవే తమ తల్లిదండ్రులకు అక్షరాలను దక్షిణగా ఇచ్చినట్లు అని తెలియజేయగా పిల్లలందరు తమ తల్లిదండ్రులందరికీ చదువు నేర్పించారు. ఈ సమిష్టి కృషి ఫలితంగా 100% అక్షరాస్యతను సాధించుకున్నారు.

ఈ శిక్షణ వలన కమిటీల సభ్యులలో నాయకత్వ లక్షణాలు, సమిష్టి కృషి, ముందుచూపు, అంకిత భావం అలవడి చురుగ్గా పనిచేయడం ప్రారంభించారు. దీని వలన గ్రామంలో సమస్యలను సత్వరంగా పరిష్కరించుకుని కొత్త మార్పులను సాధించుకోగలిగే స్థితికి చేరుకున్నారు. గ్రామ సభలలో ప్రజలందరినీ సమావేశపరిచి కమిటీలకు సహకరించే విధంగా తీర్చిదిద్దుకున్నారు. ఫలితంగా ఈ క్రింది మార్పులను పొందగలిగారు.

1) 2008, 2009 సంవత్సరాలకు సంబంధించిన ఇంటి పన్నుల వసూలు 100% పూర్తి చేసుకున్నారు.

## ప్రజా ఆరోగ్యం

ఆరోగ్య కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులను గ్రామానికి ఆహ్వానించి ఫ్రీ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసుకున్నారు. డాక్టర్లచే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఆహారంలో తీసుకోవలసిన జాగ్రత్తలను, పరిసరాల పరిశుభ్రతను, మంచినీటి అవశ్యకతను, పోషక విలువలను వివరించడం ద్వారా ప్రజలను సీజనల్ వ్యాధుల భారి నుండి రక్షించుకున్నారు. 2007 సంవత్సరానికి పూర్వం విషజ్వరాలతో అంటు వ్యాధులతో బాధపడే ప్రజలు ప్రస్తుతము సంపూర్ణ ఆరోగ్యవంతులుగా, సంతోషంగా జీవించగలుగుతున్నారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి అవసరమైన పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పాటించే విధంగా ప్రతి శుక్రవారాన్ని "పరిసరాల పరిశుభ్రతా దినంగా" పాటిస్తూ ఆరోగ్య కమిటీ వాడ వాడల తిరుగుతూ, ప్రతి ఇంటిని పరిశీలిస్తూ ఆరోగ్య స్థిరీకరణకై నిరంతరం కృషి చేస్తూ ఉన్నారు.





## మంచి నీటి సరఫరా

గ్రామంలోని 672 మంచి జనాభాకు సరిపడా రక్షిత మంచినీరు అందుబాటులో లేదు, మంచినీటి ( త్రాగు నీరు) కోసం ఒక కిలోమీటర్ దూరం వరకు వెళ్ళవలసిన దుస్థితి ఇంతకు ముందు ఉండేది.

రెండు వాటర్ ట్యాంకులు నిర్మించబడినప్పటికీ పైపులైన్లు లేక అవి నిరుపయోగంగా ఉండేవి. గ్రామ సభలో తీసుకున్న నిర్ణయం మేరకు మంచినీటి కమిటీ ఆధ్వర్యంలో ప్రజలంతా కలిసి పైపులైన్ వేయటానికి శ్రమదానం చేశారు. లోడి సంస్థ అందించిన పైపులతో మంచినీటి సరఫరాను ప్రతి ఇంటికి అందించటం జరిగింది. తద్వారా నిరుపయోగంగా ఉన్న ట్యాంకులను ఉపయోగంలోనికి తీసుకొనిరావటం జరిగింది. గ్రామ పంచాయితీ తీర్మానానికి అనుగుణంగా గ్రామ సర్పంచ్ మంచి నీటి కమిటీ సభ్యులతో కలసి స్థానిక యం.యల్.ఎ. గౌ. శ్రీ కంభం పాటి లక్ష్మారెడ్డిని గ్రామానికి రక్షిత మంచినీటి వసతి కల్పించమని అభ్యర్థించారు. ప్రజల సమైక్యత, సమిష్టి కృషిని చూసి సంతోషించిన యం.యల్.ఎ. రూ. 4లక్షల 50 వేల విలువగలిగిన మినరల్ వాటర్ ప్లాంటును మంజూరు చేసి ఇప్పించారు. అక్టోబర్ 2, 2008 గాంధీ జయంతి సందర్భంగా ఊరు ప్రజలంతా కలిసి వాటర్ ప్లాంటును ప్రారంభించుకున్నారు. ఘనంగా పండుగను చేసుకున్నారు. ఊరిలోని ప్రజలంతా ఈ మంచినీటిని



సద్వినియోగం చేసుకునేటందుకు నిబంధనలతో కూడిన కార్డులను ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి పంపిణీ చేశారు. దీని వలన గ్రామ ప్రజలందరికి రక్షిత మంచినీరు అందుబాటులోకి వచ్చింది. అనేక అనారోగ్య సమస్యల నుండి రక్షణ దొరికింది.

## రోడ్డు నిర్మించటం

గ్రామం చుట్టూ వాగులు ఉండడంతో రవాణాకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యేవి. గ్రామానికి 3 కి.మీ. దూరంలో ప్రధాన రహదారికి అడ్డంకిగా నున్న మేడివాగు వలన ప్రజల రాకపోకలు తరచూ స్థంభించేవి. ప్రజలు తమ బట్టలు విప్పి నెత్తిన పెట్టుకొని నడుము



వరకు నీళ్ళు రాగా వాగు దాటుటకు కష్టపడే వారు. గ్రామ ప్రజలంతా కలిసి గ్రామ సభలో ఈ సమస్య పరిష్కారానికై కంకణం కట్టారు.

యం.యల్.ఎ. వద్ద నుండి మోరి (కాలువ) సాధించుకొని ప్రజలంతా గ్రామంలోని ట్రాక్టర్ యజమానులను ఒప్పించి ఉచితంగా మట్టి రవాణా చేసే విధంగా చేశారు. యువకులు, మహిళలు, రైతులు మూడు రోజులు శ్రమదానం చేసి మేడివాగుపై పక్కా రోడ్డును నిర్మించుకున్నారు. దీనితో తరతలుగా వున్న సమస్యను పరిష్కరించుకున్నారు. ఫలితంగా ఆర్.టి.సి. వారు ఈ ఊరికి బస్సును నడుపుతున్నారు. ఆటోలు, జీపులు కూడ నడుపబడుతున్నాయి. ప్రభుత్వ అధికారులు కూడ ఈ గ్రామాన్ని తరచుగా సందర్శిస్తున్నారు. ఇది వారిలో నూతన ఉత్సాహాన్ని నింపింది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

పూరి గుడిసెలతో ఉన్న ఊరి ప్రజలకు ఇందిరమ్మ పథకంలో 158 ఇండ్లు మంజూరు అయ్యాయి. ఇందులో 43 ఇండ్లు నిర్మాణ దశను పూర్తిచేసుకోబోతున్నాయి. గ్రామంలోని వృద్దులందరికీ, వితంతులందరికీ, వికలాంగులందరికీ పూర్తి స్థాయిలో పెన్షన్లు అందుతున్నాయి.

జిల్లా కలెక్టర్ దృష్టికి గ్రామంలోని రేషన్ సమస్యను తీసుకొని వెళ్లగా (ఇంతకు ముందు 6 కి.మీ. దూరంలో వున్న గోవిందాపురం వెళ్ళి రేషన్ తీసుకొని రావలసి వచ్చేది) 12.04.2008 రోజున కలెక్టర్ గారు రేషన్ షాపును మంజూరు చేశారు. దీనితో ప్రజల అందుబాటులోకి రేషన్‌షాపు రావటం జరిగింది.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన అటవీ హక్కుల చట్టాన్ని గ్రామ అభివృద్ధి కమిటి సద్వినియోగం చేసుకొని భూమిలేని నిరుపేదలు 148 మందికి 698 ఎకరాలను సాధించి పెట్టింది. దీని వలన గ్రామ ప్రజలందరిలో ఆనందం వెల్లివిరిసింది. ప్రజల ఐకమత్యానికి దోహదం చేసింది.

## బాల కార్మికులు

మధ్యలో బడి మానేసిన 15 మంది బాల కార్మికులను ఆర్.బి.సి. లోనూ, ప్రభుత్వ హాస్టల్‌లో, కస్తూరిబా పాఠశాలలో చేర్పించి గ్రామాన్ని బాల కార్మికులు లేని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకొనడం జరిగింది.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకుంటూ, అధికారుల సహకారంతో, ప్రజలందరూ గ్రామ సభలో తీసుకొన్న నిర్ణయానికి అనుగుణంగా పరిపాలన కొనసాగిస్తూ అభివృద్ధి పథంలో పురోగమిస్తున్న 'కొండాపూర్' గ్రామపంచాయతీ ఎన్నో పంచాయతీలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. పరిపాలనలో ప్రజలు పాలుపంచుకొన్నట్లయితే పారదర్శకత, జవాబుదారీతనం మెరుగుపడి ప్రజలకు సక్రమంగా సేవలు అందచేయగలుగుతామనటానికి కొండాపూర్ ఒక చక్కని ఉదాహరణ. అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్న పలు వెనుకబడిన గ్రామలకు కొండాపూర్ ఒక మార్గదర్శి కావాలి. మరెన్నో కొండాపూర్‌లు రూపుదిద్దుకోవలసిన అవసరం ఎంతైనా వున్నది.

**- కరుణాకర్**

డి.ఆర్.పి. (జిల్లా పరిషత్ ట్రైనింగ్ సెల్) వరంగల్ జిల్లా.



# రెవెన్యూ పదాలు - అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 1. | ఫసలి | = | జూలై 1వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు ఉన్న కాలం లేదా రెవిన్యూ సంవత్సరం |
| 2. | ఆర్.ఎస్.ఆర్ | = | రీసెటిల్‌మెంట్ రిజిష్టర్ లేదా శాశ్వత ఎ - రిజిష్టరు |
| 3. | డైగ్లాటు | = | ఇంగ్లీషు, తెలుగు భాషలో అచ్చు వేసిన శాశ్వత ఎ రిజిష్టరు |
| 4. | ఫెయిర్ అడంగల్ | = | ఎస్టేటు గ్రామాలకు చేతితో రాసిన శాశ్వత ఎ - రిజిష్టరు |
| 5. | అడంగల్ / పహాణి | = | గ్రామ లెక్క నెం.3 |
| 6. | ఫసిలీ జాస్తి | = | రిజిస్టరు పల్లం భూమిలో ఆరునెలలకు మించి నీరు తీసుకుని పండించే చెరకు,అరటి, పసుపు / తమల పాకులు పంటలకు విధించే అధిక ఛార్జి. |
| 7. | తీర్వాయి జాస్తి | = | మెరక భూములలో సర్కారు జలాధారం నుండి నీటిని పెట్టుకున్నందుకు విధించే నీటి ఛార్జీ |
| 8. | శివాయ జమ సాగు | = | పట్టా పొందని ఆక్రమణ భూమి సాగు చేయటం. |
| 9. | బంజరు | = | బీడు భూమి |
| 10. | రెమిషన్ | = | అతివృష్టి, అనావృష్టి వల్ల పంట నష్టానికి గురైతే ప్రభుత్వం ఇచ్చే పన్ను మినహాయింపు. |
| 11. | హాలు సాలు | = | ప్రస్తుత ఫసలీ |
| 12. | సాలుగు జస్తా | = | గడచిన ఫసలీ |
| 13. | ఖరీఫ్ లేదా పునాస | = | జూలై - సెప్టెంబర్‌ల మధ్య విత్తే పంటలు |
| 14. | రబీ | = | అక్టోబర్ - డిసెంబర్ మధ్య విత్తే పంటలు |
| 15. | సార్వా | = | మొదటి దఫా పండించే వరి |
| 16. | దాళ్వా లేదా తాబీ | = | రెండో దఫా పండించే వరి |
| 17. | జమాబందీ | = | గ్రామ లెక్కల తనిఖీ లేదా ఆడిట్ |
| 18. | గయాళు | = | పట్టా ఇవ్వదగిన భూమి |
| 19. | పోరంబోకు | = | ప్రజోపయోగం నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకించిన భూమి |
| 20. | బి.మెమో | = | సర్కారు భూముల ఆక్రమణ దార్ల నుంచి శిస్తు, పెనాల్టీ వసూలు నిమిత్తం జారీ చేసే నమూనా |
| 21. | కిస్తీ | = | భూమి శిస్తు చెల్లింపునకు ప్రభుత్వం నిర్ణయించే వాయిదాలు (జనవరి, ఫిబ్రవరి మార్చి నెలలు) |
| 22. | సెస్సులు | = | భూమి శిస్తుపై అదనంగా వసూలు చేసే ప్రత్యేక రుసుం (విద్యా సెస్సు, పంచాయితీ సెస్సు. ప్రస్తుతం నీటి తీరువాపై సెస్సులు విధించడం లేదు. మెట్ట భూమి శిస్తు పై విద్యా సెస్సు విధించడం లేదు) |
| 23. | పోతీ లెక్క | = | పట్టాదారులు ఎవరైనా చనిపోయిన యెడల హక్కుదారునిగా వారసుని పేరు గ్రామ లెక్కలలో చేర్పునకు గ్రామ రెవిన్యూ అధికారి పంపే లెక్క |
| 24. | పుంజ లేదా ఖుష్కి | = | మెరక భూమి |
| 25. | నంజ లేదా తరి | = | పల్లం భూమి |
| 26. | అచ్చుకట్టు | = | మెరక భూమిలో గట్లు వేసి నీరు నిల్వ చేసి వరి సాగు చేయటం |
| 27. | శిస్తు కట్టిన గయాళు | = | పట్టా ఇచ్చుటకు ఉద్దేశింపబడి శిస్తు నిర్ణయించిన ఖాళీ భూమి |
| 28. | శిస్తు కట్టన గయాళు | = | శిస్తు నిర్ణయించని ఖాళీ భూమి |
| 29. | ప్రావిజనల్ డిమాండ్ | = | ఉజ్జాయింపు డిమాండ్ |
| 30. | బకాయి | = | గత ఫసలీల బాకీ |
| 31. | బేవార్సు | = | ఒక సొత్తుకు హక్కుదారు ఎవరో తెలియకపోతే ఆ సొత్తు బేవార్సు ఆస్తి |
| 32. | మొదటి భోగము | = | మొదటి సాగు పంట |
| 33. | రెండో భోగము | = | రెండో సాగు పంట |
| 34. | రాళ్ళ డిపో | = | సర్వే రాళ్ళు నిల్వచేసే చోటు |
| 35. | పెరటి సాగు | = | గ్రామ కంఠంలో ఇంటికి చేరువలో ఉన్న స్థలంలో చేసే సాగు |
| 36. | గుడికట్టు | = | గ్రామ హద్దులలో ఉండే మొత్తం భూమి |
| 37. | కాటకము | = | కరువు |
| 38. | బకీరు | = | ప్రాథమిక నివేదిక లేదా ఎఫ్.ఐ.ఆర్. |
| 39. | బందోబస్తు | = | కట్టుదిట్టం లేదా జాగ్రత్త చేయటం |

| | | | |
|---|---|---|---|
| 40. | అజమాయిషీ | = | సరిగా ఉన్నదీ లేనిదీ తనిఖీ చేయటం |
| 41. | అడ్జస్ట్‌మెంట్ | = | సర్దుబాటు |
| 42. | అనాదీనం | = | పూర్వం నుంచి |
| 43. | అధీనం | = | హక్కు లేదా స్వాధీనం |
| 44. | ఫాజలు | = | చెల్లించాల్సిన దానికన్నా ఎక్కువ చెల్లించటం |
| 45. | గ్రామ నత్తం | = | గ్రామ కంఠం |
| 46. | జిరాయితీ | = | రైత్వారీ భూమి |
| 47. | ఇర్సాలు | = | వసూలు చేసిన శిస్తు లేదా సొమ్మును ట్రెజరీలో జమ చేయటం |
| 48. | నదార్తు | = | ఏమీలేదు |
| 49. | బేరీజు మినహాలు | = | వసూలులో నుంచి మత లేదా ధర్మ సంబంధ కార్యాలకు తహసీల్దార్ ఆర్డర్ పై బట్వాడా చేయగా, ఇచ్చే మినహాలు |
| 50. | ముదరా | = | రాయితీ |
| 51. | దస్తు వసూలు | = | గ్రామ చావడి లేదా కూడలిలో శిస్తు వసూలు చేయటం |
| 52. | బాకీ | = | ఫసలీకి చివర ఇవ్వాల్సిన సొమ్ము |
| 53. | మామూల పల్లం | = | ఒక జలాధారం ఏర్పాటుకు ముందే పల్లంగా సాగయ్యే భూమి |
| 54. | ఖాయపు పల్లం | = | గ్రామ లెక్కలలో పల్లంగా చేర్చి శిస్తు కట్టే పల్లంగా ఖాయం చేసిన భూములు |
| 55. | బాపతు పల్లం | = | పుంజ భూమి నంజగా మార్చిన, అట్టి దానిని |

# తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలలో ఉపయోగించే రెవెన్యూ పర్యాయ పదాలు

| | తెలంగాణ ప్రాంతం | | ఆంధ్ర ప్రాతం |
|---|---|---|---|
| 1. | పహాణీ | = | ఆడంగల్ |
| 2. | రఖ్ఖం | = | శిస్తు |
| 3. | పట్వారీ | = | కరణం |
| 4. | పోలీసు పటేల్ | = | మున్సబు |
| 5. | సేతుసిందీ / కావలి కారు | = | గ్రామనౌకరు / ఇన్‌స్పెక్టర్ |
| 6. | కారుగూ జారీ | = | చేసినవి |
| 7. | దపుర | = | క్యాంపు |
| 8. | కబ్జా | = | ఆక్రమణ |
| 9. | పడావ | = | బీడు |
| 10. | ఫైనల్ పట్టీ | = | బదిలీ రిజిష్టర్ |
| 11. | వసూల్ బాకీ రిజిష్టర్ | = | పట్టా వారి శిస్తు చెల్లింపు జాబితా |
| 12. | అబీ పంట | = | మొదటి పంట, ఖరీఫ్ |
| 13. | తాబీ పంట | = | రెండో పంట, రబీ |
| 14. | మింజుమిలె | = | మొత్తం |
| 15. | నల్ల చల్క | = | నల్లరేగడి భూమి |
| 16. | ఎర్ర చల్క | = | ఎర్ర రేగడి భూమి |
| 17. | ధారా బందీ | = | నీటి తీరువా |
| 18. | చల్కా భూములు | = | మెట్ట భూములు |
| 19. | షామిల్ నెంబర్ | = | నెంబర్ కలుపుట |
| 20. | మెకామోయినా | = | స్పాట్ ఇన్‌స్పెక్షన్ |

| | తెలంగాణ ప్రాంతం | | ఆంధ్ర ప్రాతం |
|---|---|---|---|
| 21. | ప్రధి రిజిష్టర్ | = | భూమి వర్గీకరణ వివరాలు నమోదు చేసే పుస్తకం |
| 22. | మాగాణి భూమి | = | పల్లం భూమి |
| 23. | బాగాత్ భూమి | = | తోట భూములు |
| 24. | పని భూమి | = | మాగాణి, భాగత్ భూముల్లోని మొదటి తరగతి |
| 25. | దరి భూమి | = | మాగాణి, భాగత్ భూముల్లోని మొదటి తరగతి |
| 26. | ఖాస్తాలు | = | విభాగాలు (సర్వే క్షేత్ర విభాగం) |
| 27. | అనవారీ | = | అణాల రూపంలోని మృత్తిగ సగటు విలువ |
| 28. | మైల్ వార్ | = | రాయితీ |
| 29. | పోట్ ఖారాబ్ | = | వ్యవసాయోగ్యత లేని భూమి |
| 30. | పానీ క్లాస్ | = | జల వర్గీకరణ లేదా నీటి తరగతి |
| 31. | పహాణి ప్లాట్ | = | సర్వేయర్ తయార్ చేసే మోజిని ప్లాట్ (డి.స్కెచ్) |

| తెలంగాణ ప్రాంతం | | ఆంధ్ర ప్రాతం |
|---|---|---|
| 32. భగణా | = | అణా వారీ (నగటు విలువ) |
| 33. క్లాసర్ ఆకర్ | = | విరామ కృషి |
| 34. ఉదార పుస్తకం | = | ఒక్కో సర్వే నెంబర్ విస్తీర్ణం లెక్కించి రాసే రిజిష్టర్ |
| 35. నక్షా | = | విలేజ్ మ్యాప్ (గ్రామ స్థాయి మ్యాప్) |
| 36. తక్ధా దెహసాల్ | = | 10 సంవత్సరాల సాగు వివరణలు |
| 37. క్లాసర్ రిజిష్టర్ | = | సర్వే నెంబర్ వారీ గ్రామంలో అన్ని భూముల వివరాలు తెలిపే రిజిష్టర్ |
| 38. కౌలునామా | = | ఒప్పంద పత్రం |
| 39. సనద్ | = | ఉత్తర్వు లేదా ధృవ పత్రం |
| 40.తాలూకాదార్ లేదా నాయబ్ | = | శిస్తు వసూలు అధికారి |
| 41. జమీందారులు లేదా దేవ్ ముఖ లేదా దేశపాండే | = | ఉప కౌలు దార్లు |
| 42. యెఖ్‌రార్‌నామా | = | ఇరు గ్రామాల పార్టీల నుంచి సర్వేయర్ తీసుకునే సరిహద్దు గ్రామాల ఒప్పందం |
| 43. గట్ భూములు | = | బీడు భూములు |
| 44. గైరాన్ | = | సామాజిక పోరంబోకు |
| 45. ఆధార్ | = | ఆధార రేఖ |
| 46. కాటకూన్ | = | ఆధారకు ఇరువైపులా గ్రామ సరిహద్దును కలుసుకునే వరకు గీసే రేఖ (సహాయ రేఖ) |
| 47. కరన్ | = | సమకోణ త్రిభుజ రేఖ |
| 48. రేకబందీ రిజిష్టర్ | = | గ్రామ సరిహద్దుల ప్రకారం సర్వే నెంబరు, వాటి విస్తీర్ణాలు తెలిపే పుస్తకం లేదా చిత్తు వసూలు బాకీ రిజిష్టర్ |
| 49. ధెకె | = | గ్రామ సర్వే పనికై సర్వేయర్‌కు కేటాయించిన సర్వే విభాగం |
| 50. ఛల్తా నెంబర్ | = | సర్వేలో పనిలో సర్వేయర్‌కు కేటాయించిన సర్వే విభాగం |

| తెలంగాణ ప్రాంతం | | ఆంధ్ర ప్రాతం |
|---|---|---|
| 51. తిప్పన్ పుస్తకం | = | క్షేత్ర సరిహద్దు రేఖలు, ఆధార రేఖ, అంతర్ లంబాల కొలతలు తెలిపే పుస్తకం (ఎఫ్.యం.బి) లేదా క్షేత్ర స్థాయి కొలతలు స్కెచ్ |
| 52. దర్వారీ రిజిష్టర్ | = | ఒకే మృత్తిగా వర్గ విలువ ఉన్న సర్వే నెంబర్ల భూముల విస్తీర్ణాన్ని ఒకదాని కింద ఒకటిగా ఒకే చోట నమోదు చేసే పుస్తకం |
| 53. పక్కానక్షా | = | గ్రామ పటం |
| 54. అలిఫ్ నమూనా | = | జమాబందీ విభాగం తయారు చేసే 'ఎ' స్టేట్‌మెంట్ |
| 55. జరియావారి | = | నీటి వనరుల కింద ఉన్న విస్తీర్ణపు వివరాలను తెలిపే రిజిష్టర్ |
| 56. సతీ జామాలి | = | మాగాణీ, తోట, మెట్ట భూములకు పూర్వపు విస్తీర్ణం, ధార బందీలను తెలిపే స్టేట్ మెంట్ |
| 57. జంత్రీ | = | సెడిండ్ స్కేల్ |
| 58. సేత్వార్ | = | రీసెటిల్‌మెంట్ రిజిష్టర్ లేదా డిగ్లట్ రిజిష్టర్ |
| 59. పక్కపుస్తకం | = | క్షేత్ర వైశ్యాలం గణించి ఎడమ వైపు పుటలో నమోదు చేసే పుస్తకం |
| 60. నాలా | = | కలవ, బోదు |
| 61. లాంబీ | = | ఆధార రేఖ |
| 62. వస్లాలు | = | సగం రూండీ |
| 63. సగం రూండి | = | అంతర్లంబం |
| 64. సర్‌నక్షా | = | గ్రామస్థాయి మాన చిత్రం |
| 65. మాజీ నంబర్ జడ్తి | = | తాజా రెవిన్యూ పద్దుల ప్రకారం సర్వే నెంబర్ వారీ పట్వారీ తయారు చేసే వివరణ పుస్తకం. |
| 66. బంజరు | = | ప్రభుత్వ భూమి |
| 67. షికమ్ | = | ముంపు ప్రభుత్వ భూములు |
| 68. ఛాలెపథర్ | = | క్షేత్ర త్రిసంగమ స్థానాల దగ్గర దిశలను చూపించే |

| తెలంగాణ ప్రాంతం | | ఆంధ్ర ప్రాతం |
|---|---|---|
| | | సర్వే సరాళ్ళు |
| 69. టిప్పన్ పుస్తకం | = | కొలత రికార్డు లేదా రఫ్ స్కెచ్, ఎఫ్.ఎం.బి. |
| 70. ఫోడి | = | సబ్ డివిజన్ |
| 71. దఫ్తర్ బంద్ | = | రికార్డు గుమాస్తా |
| 72. పోట్ నంబర్ | = | సర్వే గుమస్తా |
| 73. పోడిపని | = | మార్పుల వల్ల ఏర్పడే ఉప విభాగం |
| 74. గట్ నెంబర్ | = | బంజరు భూములు |
| 75. పోడి రిజిష్టర్ | = | ల్యాండ్ దరఖాస్తు రిజిష్టర్ లేదా అసైన్‌మెంట్ రిజిష్టర్ |
| 76. కాయంటోక్ | = | జి. రేఖ కై ఏర్పాటయ్యే కొత్త బిందువు |
| 77. కమ్మి జాస్తి పత్రిక (కె.జి.పి) | = | సర్వే నెంబరు వివరాలు, కొత్త విభాగాలతో 19 కాలమ్‌ల ప్రోఫార్మా రిజిష్టర్ |
| 78. చౌఫస్లా | = | చిట్టీ లేదా ప్రతి ఖాతాలో వర్గీకరణ, విస్తీర్ణం, పట్టదారు పేరు నమోదు చేసే రిజిష్టర్ లేదా పట్టదారు భూముల పూర్తి వివరాలు తెలిపే రిజిష్టర్ |
| 79. ధర్ | = | తరం వర్గీకరణ లేదా తరం రేటు |
| 80. పరత్ బుక్కు | = | ప్రభుత్వ పోరంబోకు భూములను తెలిపే రిజిష్టర్ |
| 81. ఖారిజ్ ఖాతా | = | పట్టెదారు వదిలివేసిన భూమి |
| 82. టేంచ్‌ప్లాట్ | = | కొత్త ఉప విభాగాలను కొలిచి స్థలాలను స్కేలుకు చూపే రేఖా పటం |
| 83. అనుబంధ సేత్వార్ | = | బదిలీ మార్పులు లేదా కొత్త విభాగాలు నమోదు చేసే రిజిష్టరు |
| 84. బందోబస్తు రిజిష్టర్ | = | ఆర్.ఎస్.ఆర్. |
| 85. గూటం గుర్తు | = | బయటి హద్దులు |

| తెలంగాణ ప్రాంతం | | ఆంధ్ర ప్రాతం |
|---|---|---|
| 86. ధారాబందీ | = | శిస్తు |
| 87. నాజీం | = | సంచాలకుడు |
| 88. అవ్వల్ తాలూకా దార్ | = | కలెక్టర్ |
| 89. ఖాల్సె విలేజ్ | = | ప్రభుత్వ గ్రామం |
| 90. దువ్వం తాలూకాదార్ | = | ఆర్.డి.ఓ. |
| 91. ఖాల్సేతర ప్రాంతం | = | జాగీర్దార్ గ్రామం |
| 92. మాజీ నెంబర్ | = | పాత సర్వే నెంబరు |
| 93. రుజువత్ | = | సర్వే వైశాల్యాన్ని టిప్పన్, పక్కా ఉతార పుస్తకాలతో సరిపోల్చి తయారు చేసే తనిఖీ నివేదిక |
| 94. నాయబ్ తహసిల్ దార్ | = | డిప్యూటీ తహసీల్‌దార్ |
| 95. గిర్దావారు | = | రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ |
| 96. ముంతజీమ్ | = | ఆఫీస్ సూపరింటిండెంట్ |
| 97. తైబందీ | = | ఆయకట్ట సాగు స్థిరీకరణ |
| 98. జమాబందీ | = | జమాబందీ |
| 99. ఖిస్తు బందీ | = | భూమి శిస్తు జమ చేయవలసిన కాలం |
| 100. హస్తుమహీ | = | మొదటి పంట క్షేత్ర తనిఖీ |
| 101. ఛార్‌మహీ | = | రెండో పంట క్షేత్ర తనిఖీ |
| 102. అతిష్ జదిగి | = | అగ్ని ప్రమాదం |
| 103. రూద్‌ఘాట్ | = | బల్లకట్టు |
| 104. రోజ్‌నాంచా | = | డైరీ (దినచర్య) |
| 105. బరాపర్ట్ | = | పే బిల్లు |
| 106. హాజరీ వసూలు | = | ఎల్.పి.సి |
| 107. గిరాని అలవెన్సు | = | డి.ఎ. |

**- బి. వెంకటేశ్వరరావు**
కన్‌సల్టెంట్, ల్యాండ్‌సెల్, అపార్డ్



[redacted]



[redacted]

**"జా నో... ఎటు బయిలెల్లిపోతున్నావు? వూష్టమని మంచం దిగకుండ తొంగున్నావు గావాల? కసింత తగ్గనివ్వరాదా. కాయలు ముదిరి పోనాయట గదా! మరింకేల గాబర? రెండ్రోజులు తొంగుంటే వూష్టం తగ్గదా?" ఇంటి ముందు రాయి మీద కత్తిని సానపడుతున్న భర్తను చూసి గాబరా పడింది తవిటమ్మ.**

"జరిగొత్తే జొరమొచ్చినంత సుకం లేదంతారు. అది జరిగినోల సంగతి. మనలాటోలు తొంగుండిపోతే పూటగడుత్తాదేటి? నీకూ.. నాకంతే కడుపెండగట్టుకోడం అలవాటైపోనాది మరి మనవరాలో? దానికైనా రెండుముద్దలు పెట్టాలి కదా? నువ్వూ ఎటెల్లక పోతే, నానూ ఇంట్లోనే ఉండిపోతే దాన్నెవులు సూత్తారు. వుండు.. గబీనెల్లి నాలుగు కమ్మలు కొట్టుకోని వొత్తాను" అని తాటి పెండె బయలు దేరబోయాడు నూకయ్య.

"ఆ సెయ్యి సూడు.. ఎలాగ వొనుకుతందో. యిప్పుడేటి మించిపోతందని కమ్మకొట్టీడానికి తయారైపోతన్నావు? తరవాత కొట్టొచ్చులే రా... రా..."

"అయ్యొచ్చీదాక ఆమాస ఆగుతాదేటి? యిప్పుడెల్లక పోతే మడికమ్మ కొట్టక్కర్లేదు. ఎలుగెట్టెత్తానని మొన్నే ఆ నాయుడు కత్తాయించి మరీ సెప్పాడు. వొస్తున్నది వర్సాకాలం. అడుపులు, దమ్ములు టయానికి గిడుగులు అల్లుకోమా?"

"కమ్మకొట్టేసి ఏటి సెయ్యిడానికి? గిడుగులు అల్లీసి ఏటి సేసుకుంతాము? అసలు ఉడుపు గిడుగులూ. . దమ్ము గిడుగులూ. . ఎవులుకొంతన్నారు? ఉడుపులూ. . దమ్ములూ. . యీ పనులు యిప్పుడు మనుసులు సేత్తంద్రేటి? టాక్టర్లు తోటి దున్నించీడమూ.. దమ్ము పట్టీడమూ.. యిచ్చింతరం కాకపోతే యీమద్దిన ఉడుపులకీ, కోతలకీ... నూర్పులకీ.. మిసన్లు వొచ్చీసినాయట. ఆ పన్లూ మనుసులు సెయ్యక్కర్లేదు. యిలగ అన్ని పన్లూ మిసన్లే సెసిత్తే మనుసులేటి సేత్తారు?" మారుతున్న పరిస్థితులు తవిటమ్మకు ఆందోళన కలిగిస్తున్నాయి.

'యీ ముసిలిదాయి వొకర్తి.. ఎప్పుడూ యిలగే. ఏదో వొకటి అనుకోనే వుంతాది. దీనూసేల' అని అనుకుంటూ నూకయ్య తలకు గుడ్డ చుట్టి, మొలకు చుట్టిన చిరుగుల పంచెను ఎగ్గట్టాడు. తాడుతీసి భుజానికి తగిలించుకున్నాడు. కత్తిని ఒక చేత్తో పట్టు కొని టైరు చెప్పులు కాలికి తొడిగి యుద్ధానికి తయారైన సైనికుడిలా బయలుదేరాడు.

నూకయ్యకు అలవాటైన పనే అయినప్పటికీ , తవిటమ్మకు భయం వేసింది.

* * * * *

**నూ**కయ్య అడుగులు నెమ్మదిగా ఊరు దాటి పెండెదారిలో పడ్డాయి. ఊరికి దూరంగా తూర్పు దిక్కున ఉందా తాటిపెండె. దాని మధ్యలోంచి తాటి చెట్టుపైకి కొద్దికొద్దిగా ఎగ బ్రాకుతూ అలసిపోయి మధ్యలోనే ఆగిపోయినట్లు ఎర్రటి సూర్యుడు లేత ఎండపడి పసుపు తెలుపు కలగలిసిన రంగులో మెరిసిపోతున్నాయి తాటి మట్టలు. మట్టల మధ్య గెలలు గెలలుగా తాటి కాయలు, దూరం నుండి పెండెను చూస్తుంటే నూకయ్యకు గతం గుర్తుకొచ్చింది.

'వొకప్పుడు ముంజులేసుకోని ఏవూరెల్లినా ఎలాగుందీది? "తాటి ముంజులో.." అని కేకేస్సరికి సెటల్తోని బియ్యం పట్టుకోని కావిడి సుట్టూ జనం సేరిపోయోలు. రెండీదులు తిరిగేసరికి కావిడి కాలీ ఐపోయి,

**గ్రామీణ కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

బుట్టలు బియ్యంతోని నిండిపోయేవి. నాయుడోరి పిల్లలు ముంజులు కావాలని గోల పెట్టేసోలు. కొందరు నాయిరామ్మలైతే ముంజులు పట్టుకోని ఎప్పుడోస్తాడా.. అని ఎదురు సూసోలు. ఎల్లిన పెతీసారి కడుపునిండ తిండిపెట్టి ఆదరించోలు, ఏ రోజూ ఆకలితో వున్నామన్నది లేదు. అలాంటి రోజులు యిప్పుడే టైపోనాయో? అలాంటి మనుసులు ఏటైపోనారో? అప్పుడికీ, యిప్పుడికీ ఎందుకింత తేడా?'

గతం చెట్టు నుండి జ్ఞాపకాల కమ్మలు ఒక్కొక్కటిగా జారి పడుతున్నాయి. ఆ జ్ఞాపకాల కమ్మలే రేపటి ఆశల గిడుగులని అతని నమ్మకం.

'గొడుగై తనకు నీడనివ్వాల్సిన కొడుకు. . . ప్చ్. . .?' ఒక్కసారి కొడుకు గుర్తుకొచ్చేడు. గుర్తుకొచ్చి చిదిగిన తాటి ముంజెల్లోంచి నీరు కారినట్టుగా కళ్ళలోంచి నీళ్ళు చెంపల మీదకు జారాయి నూకయ్యకు.

'కొడుకు.. చెట్టంత కొడుకు.' తనలా కష్టపడకూడదని వాడిని తాటి పెండెవైపైనా రానీయలేదు. తాటి గెలల్నీ నరకనివ్వలేదు. తాటి కాయల్నుండి ముంజెల్ని తియ్యనివ్వలేదు. తాటికమ్మను మడిచి 'గిడుగు' ఎలా తయారు చెయ్యాలో కూడా చెప్పలేదు. ఎండ తగిలితే కొడుకు తట్టుకోలేడని తాటి ముంజెలు అమ్మడానికీ తీసుకుపోలేదు. చదువుకొని బాగుపడాలని, ఏ కష్టమూ తెలియనివ్వలేదు. వాడికి ఉద్యోగం వస్తాదంటే తన బతుకు మారి పోతాదని కూతురు పెళ్ళి చేయగా మిగిలిన అరెకరా పొలం తగలబెట్టేసాడు. కొడుకుది పట్నంలో ఉద్యోగం. మొదట్లో నెలనెలా వందో రెండొందలో పంపించే వాడు. రాను రాను అదీ పంపించడం మానేశాడు. రావడమూ మానేశాడు.

'ఆడు రాకపోతే ఏటి? కూతురు వొచ్చీపోతంది కదా' అని సర్దిచెప్పుకున్నాడు. కానీ కూతురు బతుకూ తొందరలోనే తెల్లారిపోయింది. దాని మొగుడు తాగుబోతోడై దాన్ని కాటికి పంపించేసాడు. యిప్పుడు మనవరాల్లోనే కూతుర్ని చూసుకుంటున్నాడు.

తాటిపెండె. తాటికాయలు... తాటికమ్మ... గిడుగులు... ఇవే నూకయ్య ప్రపంచమయ్యాయి.

ఆలోచనల్లోనే పెండె చేరుకున్నాడు. చెట్లను ఒకసారి పరిశీలనగా చూసి ఏయే చెట్ల కమ్మకొట్టాలో మనసులోనే నిర్ణయించుకున్నాడు. ఒకటి రెండు చెట్లకు ముదిరిన తాటి గెలలు ఉన్నాయి. అతని దృష్టి పెండె మధ్యలో ఉన్న చెట్టు దగ్గర ఆగింది. మొదట ఆ చెట్టు కమ్మనే కొట్టాలని అనుకొని అటు వైపు నడిచాడు. కాలికి ఉన్న చెప్పులు తీసి ఒక ప్రక్కన పెట్టాడు. పంచెను సిలకట్టు లాగా బిగించి కట్టాడు. కత్తిని మొలకు దోపుకొని చెట్టు మొదలకు దండం పెట్టాడు. భుజానికి వున్న తాడును తీసి చెట్టుకు చుట్టాడు. దానిని తన వీపుకు ఆనించి కట్టుకున్నాడు.

అంచినీలు పెట్టకుండా పాము ప్రాకినట్టు ఎలాంటి తాటి చెట్టు మీదికైనా అవలీలగా ఎక్కిపోయే నూకయ్య ఈ రోజు అడుగడుక్కీ అంచినీలు పెట్టి చెట్టు ఎక్కలేక జాపోసి పోతున్నాడు. కాళ్ళు చేతులూ విలవిల్లాడేసి పట్టు కుదరడం లేదు. అతి కష్టమీద చెట్టు' 'మోవు' పైకి ఎక్కి మట్టలపై కూర్చున్నాడు. కొంచెం సేపు అలాగే కూర్చుని అలుపు తీర్చుకున్నాడు.

చిన్నగా వీస్తున్న గాలికి తాటికమ్మల చివర్లు రెపరెపలాడుతూ రూపాయి నోట్లులాగా కనిపించాయి నూకయ్యకు. కాంతి నిండిన కళ్ళతో వాటినే చూస్తున్నాడు.

'ముసిలిదానికి టానిక్కుకొనాల. బడి సెలవులు ఐపోతున్నాయి. మనవరాలికి పుస్తకాలు, బట్టలు కొనాల. టీ దుకాణంల బాకీ ఎంతుందో సూసి, ఆయమ్మ మొకాన కొట్టీయాల. రేసను కార్డు యిడిపించీయాల... ' అవసరాలు ఒక్కొక్కటిగా కళ్ళముందు కదలాడాయి. నూకయ్య మొలనున్న కత్తిని తీసి గబగబా కమ్మలు నరికాడు. కొన్ని కమ్మలు కింద పడ్డాయి. మరి చేతిని పైకి ఎత్తలేకపోతున్నాడు. ఒళ్ళంతా చెమట పట్టి నీరసంగా ఉంది అతనికి. కింద పడ్డ కమ్మను చూసి ఉడుపు గిడుగుకి ఏబై, దమ్ము గిడుగుకి ముప్పై చెప్పున లెక్కబెట్టాడు. లెక్క తక్కువొచ్చింది. యింకో పది గిడుగులకైనా కమ్మకొట్టాలనుకున్నాడు. శక్తినంతా కూడగట్టుకొని కత్తిని పైకెత్తాడు. రెండు కమ్మలు కొట్టాడు. చెయ్యి వణికింది. గుండె వేగంగా కొట్టుకుంది. అతనికి ఎప్పుడూ లేని భయం కలిగింది.



భార్య గుర్తుకొచ్చింది. మనవరాలు గుర్తుకొచ్చింది. కొడుకూ కోడలూ గుర్తుకొచ్చారు. నాకేమీ కాదుకదా అనుకున్నాడు. అనుకుని....

రెండు కాళ్ళు తాటి మట్టలకు మలవేసేడు. అతనిలో చివరి ఆశ ఆవిరైపోయింది. చేతులు పట్టుతప్పి శరీరం వెనుకకు జారింది. చేతిలోని కత్తి జారి పడింది. తుప్పలోంచి ఒక పిట్ట రివ్వున ఎగిరి పోయింది.

నిస్తేజమై వేలాడే అతని రెండు చేతుల మధ్య... తన అసహాయతకు చింతిస్తున్నట్టు తెల్ల మబ్బుల తెరల్లో వెలవెల బోతున్నాడు సూర్యుడు.

తెగిన 'తాటికమ్మ' చెట్టుకు వేలాడుతున్నట్టు అతని నల్లని శరీరం భూమ్యాకాశాల మధ్య తల క్రిందుల ఎగా వేలాడుతోంది. ప్రపంచాన్ని ప్రశ్నిస్తున్నట్టు.

☆

# ప్రజోపయోగ నిర్ణయాలు తీసుకున్న మంత్రి వర్గం

## ఏప్రిల్ 22వ తేదీన జరిగిన మంత్రి వర్గ సమావేశపు నిర్ణయాలు

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమానికి, ప్రజా ప్రయోజనానికి ఉపకరించే పలు నిర్ణయాలను ఏప్రిల్ 22, 2010న డాక్టర్ కొణిజేటి రోశయ్య అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రి వర్గం తీసుకున్నది. వాటిలో కొన్ని ముఖ్య నిర్ణయాలు.

### గిరిజన సాధికారిత విధానం - 2010 -2015

- 2010 - 2015 గిరిజన సాధికారిత విధానాన్ని (Tribal Empowerment Policy) మంత్రి వర్గ సమావేశం ఆమోదించింది.
- ఆరోగ్యం, విద్య, ఆర్థికాభివృద్ధి, స్వయం సహాయక బృందాలు వంటి వాటిపై ప్రభుత్వం గిరిజన సాధికారత విధానాన్ని రూపొందించింది.
- ముసాయిదాను ముఖ్యమంత్రి 26.11.2009న విశాఖపట్నంలో విడుదల చేశారు.
- వివిధ NGOs, ప్రజాప్రతినిధులతో జిల్లాల్లో, ITDAs, NGOs తో రాష్ట్రస్థాయి సదస్సులు చర్చలు జరిగాయి.
- ముసాయిదా సాధికారిత విధానంలో కొన్ని ముఖ్యాంశాలు:
- సాగునీటి సౌకర్యాలను కల్పించి, ఉద్యానవనాలు, వాణిజ్య మొక్కల వంటి వాటిని పెంచడం ద్వారా ప్రత్యేక భూమి అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టడం, మహిళా SHG లను పటిష్ట పరిచి, 2015 నాటికి గిరిజనుల్లో పేదరికాన్ని 61 శాతం నుండి 30 శాతానికి తగ్గించడం.
- ప్రస్తుతమున్న ఆశ్రమ, నైవాసిక పాఠశాలలను పటిష్ట పరచడం, అదనపు నైవాసిక పాఠశాలలు, హాస్టళ్ళు తెరవడం, గిరిజన పిల్లల నమోదు 100 శాతం ఉండేట్టు చూడడం, అక్షరాస్యత రేటును 37.04 నుండి 60.47%కి పెంచడం.
- ప్రస్తుతమున్న ప్రజారోగ్య సంరక్షణ కార్యక్రమాలు కొనసాగించడం. పునరుత్పాదక, శిశు సంరక్షణ కార్యక్రమాలు మెరుగు పరచడం.
- యువతకు శిక్షణ. ITDAలలో మైక్రో ఇండస్ట్రియల్ క్లస్టర్ల ఏర్పాటు. కెరీర్ గైడెన్స్, ఉపాధి శాఖలను పటిష్ట పరచి, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం.
- 1092 గ్రామాలకు రోడ్డు సౌకర్యం, 818 జనావాసాలకు విద్యుత్ సౌకర్యం, 1475 జనావాసాలకు త్రాగునీటి సౌకర్యం కల్పించడం.
- ప్రతి లో ITDA లో భూమి విభాగం ఏర్పాటు, కంప్యూటరీకరణ, భూమి గ్రంథాలయం ఏర్పాటు ద్వారా గిరిజనుల భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడం.
- వివిధ అటవీ నేరాల క్రింద ఎస్.టి.లపై నమోదైన కేసులు ఉపసంహరించుకోవడం.
- రూ. 10 వేల కోట్ల పెట్టుబడితో కీలక శాఖల ద్వారా గిరిజన ప్రాంతాల్లో 6.6 శాతం ప్రణాళికా బడ్జెట్ ఖర్చు అయ్యేలా చూడటం.
- సంబంధిత నిపుణులు, ప్రముఖులతో సామాజిక ప్రభావ సర్వే నిర్వహించి, ప్రాజెక్టుల క్రింద నిర్వాసితులైన గిరిజన కుటుంబాలకు సహాయ, పునరావాసాలు కల్పించడం.
- గిరిజన సంస్కృతి, భాష, పరిజ్ఞానాన్ని పటిష్ఠ పరిచేందుకు చర్యలు తీసుకోవడం.
- 500 జనాభా కంటే ఎక్కువ ఉన్న గిరిజన వాసాలను గ్రామపంచాయితీలుగా ప్రకటించడం. ప్రతి ITDA కు IAS అధికారులను పోస్టు చేయడం, సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్‌ను పటిష్టపరచడం, గ్రామసభకు అధికారమిస్తూ, సుపరిపాలన అందేలా చూడటం.

### విద్యుత్ బాండ్లు

- A.P Power Finance Corporation Private Placement ద్వారా A.P. Powder Bonds తో రూ. 2000 కోట్ల నిధులను సమీకరించడానికి అనుమతి మంజూరు ప్రతిపాదనలు ఆమోదం.
- 28.10.2006 అనుమతించిన రూ. 500 కోట్లు కూడా ఈ మొత్తంలో కలిపివుంటుంది.
- మొత్తం రూ. 2వేల కోట్లకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది.

### డాక్టర్ల ఖాళీల భర్తీ

- రాష్ట్రంలో డాక్టర్ల కొరత తీర్చడానికి వీలుగా 2423 ప్రాథమిక స్థాయి డాక్టర్‌ల ఖాళీలను భర్తీ చేయడానికి ప్రతిపాదనల ఆమోదం.
- బోధనా విభాగంలో సీనియర్ స్థాయి ప్రమోషన్లు ఇచ్చినందువల్ల ప్రవేశ స్థాయిలోని మూడు శాఖల్లో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి.
- వైద్య విద్యా డైరక్టరేట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు/ట్యూటర్లు, ఎపి వైద్య విద్యావిధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, ఆరోగ్యశాఖ డైరక్టరేట్‌లో మెడికల్ ఆఫీసర్ ఖాళీలను భర్తీ చేస్తారు.

### మునిసిపల్ చట్టానికి సవరణ

- ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు గల వ్యక్తి ఎన్నిక అగుటకు, లేదా సభ్యుడిగా కొనసాగుటకు అనర్హుడు అనే అంశానికి సంబంధించి రాష్ట్ర మునిసిపల్ చట్టాల్లో 'సవరణ' ప్రతిపాదనలు ఆమోదం.
- ఒక కేసులో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పునకు అనుగుణంగా
- మొదటి కాన్పులో ఒక శిశువు, తదుపరి కాన్పులో ఇద్దరు లేదా ముగ్గురు శిశువులు పుట్టిన వ్యక్తులను అనర్హత నుంచి మినహాయించే Section 21 - B of the greater Hyderabad

Municipal Act, 1955; Section 13 - B of A.P. Municipalities Act, 1965కి ఈ సవరణలు ప్రతిపాదించారు.

### ప్రత్యేక సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు

- DSC - 1989 లో రెగ్యులర్ సెకండరీ గ్రేడ్ టీచర్లుగా నియమితులైన 681 స్పెషల్ టీచర్లకు 21.4.1998న జారీ చేసిన G.O.Ms.No.119 విస్తరింపజేసే ప్రతిపాదన ఆమోదం.
- ఎటువంటి అలవెన్సులు, ఎటువంటి సెలవు అర్హత లేకుండా నెలకు రూ. 398/- వేతనంతో నియమితులైన స్పెషల్ టీచర్లకు పై G.O. అన్వయింప జేయాలని JACTO చేసిన డిమాండ్‌ను అప్పటి ముఖ్యమంత్రి అంగీకరించారు. ఆ మేరకు ఈ ప్రతిపాదనలను ఆమోదించారు.

### వివిధ శాఖల్లో ఉద్యోగాలు

- మెదక్ జిల్లా సంగారెడ్డిలో కొత్తగా ఏర్పాటయిన ఇరిగేషన్ సర్కిల్‌లో S.E., D.E. వంటి ఐదు కొత్త ఉద్యోగాల భర్తీకి ప్రతిపాదనల మంజూరు.
- 2009 -10 లో ప్రారంభించిన వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 48 ఉద్యోగాల కల్పన, భర్తీ ప్రతిపాదనలు ఆమోదం.
- వీటిలో ప్రిన్సిపాల్స్ - 16
- హెడ్స్ ఆఫ్ సెక్షన్స్- 32
- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వాటర్ షెడ్లు, ఇతర సంబంధిత పథకాల కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిఘా విభాగాల ఏర్పాటు కోసం 88 పదవుల కల్పనకు ఆమోదం.
- వీటిలో నిఘా అధికారి, సహాయ నిఘా అధికారి, కంప్యూటర్ అసిస్టెంట్ ఉంటారు.

### ప్రజా ప్రయోజనాలకు భూములు

- ఆదిలాబాద్ జిల్లా జైనాథ్ మండలం కన్నమేడిగూడ గ్రామం వద్ద 33/11 కె.వి. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఒక ఎకరా ప్రభుత్వ భూమి కేటాయింపు ప్రతిపాదన ఆమోదం.
- ఎకరాకు రూ. 25 వేలు చెల్లిస్తారు.
- ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండల గ్రామంలో త్రిపురాంతకం ఆలయ అభివృద్ధి కోసం శ్రీశైల దేవస్థానానికి 4.90 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు ఆమోదం.
- ఎకరాకు రూ. 50 వేల వంతున మార్కెట్ విలువ చెల్లిస్తారు.

## మే 6వ తేదీన జరిగిన మంత్రి వర్గ సమావేశపు నిర్ణయాలు

మే 6వ తేదీన సచివాలయంలో ముఖ్యమంత్రి డాక్టర్ కె. రోశయ్య అధ్యక్షతన జరిగిన రాష్ట్రమంత్రి వర్గ సమావేశంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి దోహదపడే పలు నిర్ణయాలు తీసుకున్నారు.

మహిళా సంక్షేమం శిశు అభివృద్ధి మూడవ దశ విస్తరణ, రంగారెడ్డి జిల్లా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్ ను నెలకొల్పడం వంటి పలు ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు.

- రాష్ట్రంలో ఐ.సి.డి.ఎస్. పథకాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తున్నందున, సేవలు అర్హులకు అందడానికి వీలుగా నాణ్యత, అమలు తీరు, జవాబుదారీతనం, పనితీరు మెరుగుదల కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియామించాలని నిర్ణంచారు.
- రాష్ట్రంలో మహిళా, శిశు సంక్షేమంలో భాగంగా మూడవ దశ ఐసిడిఎస్ విస్తరణ పథకం ప్రతిపాదనల ఆమోదం.
- ఈ మూడవ దశ క్రింద రెండు అదనపు సమగ్ర శిశు అభివృద్ధి పథకాలు (ఐ.సి.డి.ఎస్), 6537 అంగన్‌వాడీ కేంద్రాలు, 3206 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తారు.
- ఇద్దరు సి.డి.పి.ఓ. లను, 261 మంది సూపర్‌వైజర్లను రెగ్యులర్ ప్రాతిపదికన, ఆరుగురు ఆఫీస్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ ద్వారా నియమిస్తారు.
- 6537 అంగన్‌వాడీ వర్కర్లకు, 9743 AWH, Mini AWC లకు అమలులో ఉన్న గౌరవ వేతనం చెల్లిస్తారు.

### నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్

- రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనెజ్‌మెంట్‌ను నెలకొల్పడానికి 20 ఎకరాల భూమి కేటాయింపు ప్రతిపాదనలు ఆమోదం.
- హైదరాబాద్ మున్సిపల్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన ఈ భూమిని ఉచితంగా కేటాయిస్తారు.
- పట్టణీకరణ సవాళ్ళను ఎదుర్కోవడానికి, పట్టణ మేనేజర్ల సామర్థ్యాలు పెంపొందించడానికి ఈ సంస్థను ఏర్పాటు చేస్తున్నారు.
- మొదటి ఏడాది శిక్షణా వ్యయంతో సహా ఈ సంస్థ ఏర్పాటుకు అంచనా వ్యయం రూ.65కోట్లు.
- అధునాతన తరగతి గదులు, హాస్టలు వసతి, ఆధునిక కంప్యూటర్ ల్యాబ్స్, గ్రంథాలయాలు, అత్యంత ప్రతిభగల సిబ్బందితో ప్రపంచస్థాయి విద్య, శిక్షణ, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రతిపాదించారు.

### భూమి

- కడప జిల్లా పుట్లంపల్లి గ్రామంలో సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ నిర్మాణం కోసం 2.51 ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయింపు ప్రతిపాదన ఆమోదం.
- సికింద్రాబాద్‌లోని పుష్పగిరి ఐ ఇన్‌స్టిట్యూట్ వారు ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తారు.
- ఎకరాకు రూ.12 లక్షల వంతున ఎమ్‌పవర్‌మెంట్ కమిటీ నిర్ణయించిన ధర చెల్లిస్తారు.

*- అదపాక సత్యారావు*
అదనపు సంచాలకులు

# స్థానిక ప్రభుత్వాల బలోపేతమే సి.ఎల్.జి.ఎఫ్ లక్ష్యం

కేంద్రీకృత పరిపాలనా విధానం నుంచి వికేంద్రీకృత పరిపాలనా దిశగా 1990 దశకంలో పలు కామన్‌వెల్త్ దేశాలలో ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ప్రజాస్వామ్య భావనలను, ప్రజాస్వామ్య విధానాలను అట్టడుగు స్థాయివరకూ తీసుకొని వెళ్ళటానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రయత్నాలు ఈ సమయంలోనే ముమ్మరయ్యాయి, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయటానికి కామన్‌వెల్త్ సభ్య దేశాలలో పనిచేస్తున్న వివిధ సంఘాలు, వివిధ స్థాయిలలోని స్థానిక ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, స్థానిక ప్రభుత్వాల సామర్థ్యాల పెంపుదలకు కృషిచేస్తున్న పరిశోధనా, శిక్షణా సంస్థలు మొదలగు వాటినన్నిటినీ ఒకే వేదికపైకి తీసుకొనిరావాలనే ఉద్దేశ్యంతో 1994 సం.లో కామన్‌వెల్త్ లోకల్ గవర్నమెంటు ఫోరం (సి.ఎల్.జి.ఎఫ్) ఆవిర్భవించింది.

స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి సి.ఎల్.జి.ఎఫ్ చేస్తున్న విశేషమయిన కృషిలో భాగంగా 2005లో అబర్డీన్‌లో, 2007లో ఆక్ల్యాండ్‌లో, 2009లో ఫ్రీపోర్టులో జరిగిగన సి.ఎల్.జి.ఎఫ్ సర్వసభ్య సమావేశాలు తీసుకొన్న నిర్ణయాలు కామన్‌వెల్త్ దేశాలలో స్థానిక ప్రభుత్వాల పటిష్టతకు దోహదం చేసాయి. ఈ సమావేశాలలో తీసుకొన్న ముఖ్య నిర్ణయాల గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.

### అబర్డీన్ అజెండా

ప్రజాస్వామాన్ని బలోపేతం చేయటం అన్న అంశం పై 2005 మార్చి 15-18 వరకూ స్కాట్‌లాండ్‌లోని అబర్డీన్‌లో సి.ఎల్.జి.ఎఫ్. సమావేశం జరిగింది.

కామన్‌వెల్త్ దేశాలలో ప్రజాస్వామ్య విలువలను పెంపొందించటానికి, ఆరోగ్యవంతమైన స్థానిక ప్రభుత్వాలను ఏర్పాటు చేయటానికి, స్థానిక ప్రభుత్వాల సుపరిపాలనను అందచేయటానికి ఎన్నికయిన స్థానిక ప్రభుత్వాలను ప్రోత్సహించటానికి గాను 2005 మార్చి 18న అబర్డీన్‌లో జరిగిన సి.ఎల్.జి.ఎఫ్ సమావేశం ఒక అజెండాను రూపొందించింది. దీనినే అబర్డీన్ అజెండాగా పిలుస్తారు. ఈ అబర్డీన్ అజెండాను 2005 సం.లో జరిగిన కామన్‌వెల్త్ దేశాధినేతల సమావేశంలో ఆమోదించారు. ఈ అబర్డీన్ అజెండా ప్రకారం సభ్య దేశాలు ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై దృష్టిని సారించాలి.

- స్థానిక ప్రజాస్వామ్యానికి రాజ్యాంగ పరమైన, చట్ట పరమైన గుర్తింపునివ్వటం
- స్థానిక ప్రభుత్వాలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకొనే రాజకీయ స్వేచ్ఛ అందుకు తగ్గ సామర్థ్యాలను స్థానిక ప్రజలకు కల్పించటం
- వివిధ స్థాయిలలోని ప్రభుత్వాల మధ్య అంటే స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మధ్య భాగస్వామ్యం సాధించటం
- వివిధ స్థాయిలలోని ప్రభుత్వాల మధ్య స్పష్టమైన విధుల విభజన, అధికార వికేంద్రీకరణకు అనువైన శాసన నిర్మితిని కల్పించటం
- నిర్ణయీకరణలో స్థానిక ప్రజలకు భాగస్వామ్యం కల్పించటం
- స్థానిక ప్రభుత్వాలలో జవాబుదారీ తనాన్ని పెంపొందించటం
- స్థానిక ప్రభుత్వాలలో పారదర్శకత పెంపొందించటం
- స్థానిక ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటానికి గాను స్థానిక ప్రభుత్వాలకు, పౌరసమాజానికి మధ్య బలమైన సంబంధాలు నెలకొల్పటం ద్వారా సుస్థిరత సాధన
- పౌరసమాజం, ప్రజాప్రతినిధులు, ఇతరులు ఎప్పుడు అవసరమైతే అప్పుడు స్థానిక ప్రభుత్వాల పనితీరుని పరిశీలించేందుకు అవకాశాలు కల్పించటం
- సమ్మిళిత అభివృద్ధి (ఇంక్లూజివ్ డెవలప్‌మెంట్) సాధనకు అన్ని వర్గాలను కలుపుకొని పోవటం
- సముచిత రీతిలో వనరుల కేటాయింపు
- సముచిత రీతిలో సౌకర్యాలు, సేవల కల్పన
- ధృఢమైన స్థానిక ప్రజాస్వామ్యం, సుపరిపాలన అందించటం

### ఆక్ల్యాండ్ ఒప్పందం

స్థానిక నాయకత్వం ద్వారా అభివృద్ధిని అందచేయటం అన్న ప్రధానాంశంగా, 29 మార్చి 2007 సం.లో న్యూజిలాండ్‌లోని ఆక్ల్యాండ్‌లో సి.ఎల్.జి.ఎఫ్. సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 40 సభ్య దేశాలనుండి సుమారు 600 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అబర్డీన్ ఎజెండా అమలుని సమీక్షించటంతో పాటు, స్థానిక ప్రాంతాలలో ప్రజాస్వామ్యాన్ని పటిష్ట పరచటానికి అవసరమయిన నాయకత్వాన్ని పెంపొందించుకోవటానికి సభ్యదేశాలు తీసుకోవలసిన చర్యలపై ఒక ఒప్పందాన్ని రూపొందించారు. ఈ ఒప్పందాన్ని ఆక్ల్యాండ్ ఒప్పందం అంటారు. ఆక్ల్యాండ్ ఒప్పందం ప్రకారం సభ్యదేశాలు ముఖ్యంగా ఈ క్రింది అంశాలపై దృష్టిసారించాలి.

- స్థానిక ప్రభుత్వాలను మరింత సమర్ధవంతంగా పనిచేసేందుకు అనువైన పరిస్థితులను ఆయా దేశాలలో కల్పించటం
- ప్రజల ప్రాధాన్యతావసారలపై దృష్టి సారించటానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రాధాన్యతల కనుగుణంగా స్థానిక ప్రభుత్వాలు ఒక వ్యూహాత్మక భవిష్యత్ ప్రణాళికను రూపొందించుకోవాలి.
- స్థానిక ప్రాంతాల అభివృద్ధి కోసం సేవలను స్థానిక ప్రభుత్వాలు మెరుగైన రీతిలో అందచేయటం
- జాతీయ, అంతర్జాతీయ అంశాలపై దృష్టి సారించటం, స్థానిక ప్రాంతాలలో ఆయా అంశాల ప్రభావాన్ని తగ్గించటం. ఉదా. హెచ్ఐవి / ఎయిడ్స్ వ్యాప్తిని నివారించటం, వాతావరణ మార్పును తట్టుకొనేందుకు వ్యూహాలు / చర్యలు చేపట్టటం.
- స్థానిక నాయకత్వం పెంపొందించటానికి సామర్థ్యాలను పెంపొందించటం
- నాయకత్వం, అభివృద్ధి ధ్యేయంగా స్థానిక ప్రభుత్వాల మధ్య సంబంధాలు పెంపొందించటం.

# ఫ్రీపోర్ట్ డిక్లరేషన్ - మెరుగైన స్థానిక ప్రభుత్వం ఏర్పాటుకు ఎజెండా

బహమాస్ దీవుల్లోని ఫ్రీపోర్టులో గత ఏడాది మే 11-14 తేదీల్లో జరిగిన 5వ కామన్ వెల్త్ లోకల్ గవర్నమెంట్ ఫోరమ్, కామన్‌వెల్త్ లోకల్ గవర్నమెంట్ సాధారణ సమావేశాల్లో 48 దేశాలకు చెందిన 550 ప్రతినిధులు పాల్గొన్నారు. బహమాస్ ప్రభుత్వం ఆతిథ్యం ఇచ్చిన ఈ సమావేశాలలో కింద పేర్కొన్న తీర్మానాలను చేశారు.

కామన్‌వెల్త్ పాథమిక రాజకీయ సిద్ధాంతాలలో భాగంగా బర్టీ అజెండాను ఆమోదిస్తూ 2005, 2007 సంవత్సరాలలో జరిగిన కామన్‌వెల్త్ ప్రభుత్వాధినేతల సమావేశంలో చేసిన తీర్మానాన్ని, ఆ తరువాత అక్‌లాండ్ ఒప్పందంలో దానికి లభించిన మద్దతును, సిద్ధాంతాలు అమలు జరుగుతున్న తీరును ఫ్రీపోర్టు సమావేశంలో పునరుద్ఘాటించారు.

ఈ సమావేశం కరేబియన్ దీవుల్లో మొట్టమొదటిసారి జరుగుతోందంటే, స్థానిక పాలనను పటిష్టపరచటానికి, సంస్కరణలను ప్రవేశపెట్టటానికి ఆ ప్రాంతంలోని దేశాలు ఎంత కృత నిశ్చయంతో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించేందుకు స్థానిక ప్రభుత్వ పనితీరును, సేవలను మెరుగుపరచడం కామన్‌వెల్త్ విజన్ ప్రధాన లక్ష్యం. స్థానిక అభివృద్ధి ప్రయోజనాల దృష్ట్యా స్థానిక ప్రభుత్వం ప్రజలకు నాయకత్వం వహిస్తూ, ఇతర సంస్థలతో కలిసి వనరులను అభివృద్ధిచేసే అధికారం దానికి ఉంది.

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక పరిస్థితి స్థానిక ప్రజలపైనా, స్థానిక ప్రభుత్వ కార్యకలాపాలపైనా ఉంటుందన్న వాస్తవాన్ని ఈ సదస్సు గుర్తించింది.

బర్టీ, అక్‌లాండ్ తీర్మానాలను పటిష్టం చేస్తూ, కామన్‌వెల్త్ దేశాలలో స్థానిక ప్రభుత్వాలను మెరుగుపరిచే దిశగా వెళ్తుందని ఫ్రీపోర్టు డిక్లరేషన్ ఆశాభావంతో ఉంది.

1. ప్రభుత్వంలో నిజమైన పాత్రను పోషించేందుకు, ప్రభుత్వ వ్యవస్థలోని అవరోధాలను అధిగమించి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు స్థానిక ప్రభుత్వం స్వరూప స్వభావాలను మార్చాల్సిన అవసరం ఉంది. అబెర్‌దీన్ అజెండా, అక్లాండ్ ఒప్పందానికి అనుగుణంగా స్థానిక ప్రభుత్వ స్థానిక ప్రజలకు నాణ్యమైన సేవలను, పరిపాలనను నిరంతరం అందించాలన్న లక్ష్యంగా పనిచేయాలి.

2. సమర్థవంతమైన స్థానిక పరిపాలన కోసం అన్ని సందర్భాలకు వర్తించే ఏకైక నమూనా అంటూ ఏమీలేదు. స్థానిక సందర్భాలకు అనుగుణంగా స్థానిక పాలనలో మార్పులు చేర్పులు చేస్తూ ఉండాలి.

3. క్లిష్టసమస్యలు తలెత్తినప్పుడు నిస్సహాయంగా మిన్నకుండి పోకుండా ఆత్మవిశ్వాసం, అవకాశాలను సృజనాత్మకంగా మార్చుకోగలిగే అసాధారణమైన దృక్పథంతో ముందుకుసాగాలి. అంటే, స్పష్టమైన వ్యూహాత్మక దృష్టి, నాయకత్వ లక్షణాలతో వ్యవస్థలూ వాటి స్వరూప స్వభావాలతో నిమిత్తం లేకుండా పరిష్కార మార్గంపైనే దృష్టినంతా కేంద్రీకరించాలి.

**ప్రపంచ ఆర్థిక సమస్యలు, వనరుల కొరత ఉన్నప్పుడు స్థానిక ప్రభుత్వాన్ని పటిష్టం చేయడం ఎలా?**

4. ప్రపంచ ఆర్థిక పరిస్థితి తిరోగమన పథంలో ఉన్నప్పుడు, వనరుల కొరత ఉన్నప్పుడూ స్థానిక ప్రభుత్వాన్ని పటిష్టం చేసేందుకు ప్రత్యేకమైన వ్యూహాన్ని అనుసరించాల్సి ఉంటుంది. స్థానిక ప్రభుత్వాన్ని పటిష్టం చేయడమంటే, కౌన్సిలర్లు, అధికారులు, సేవలను పటిష్టం చేయడమొక్కటే కాదు. గట్టి ఆర్థిక పునాది ఉండాలి. పనితీరును జాగ్రత్తగా పర్యవేక్షించాలి. ఆర్థిక, ద్రవ్య సంబంధమైన సమస్యలను పరిష్కరించడానికి బడ్జెట్‌లో కోత పెట్టడం లేదా తగ్గించడం ఒక్కటే మార్గం కాదు. స్థానిక స్థాయిలో ఆర్థికసంక్షోభం తలెత్తినప్పుడు దాన్ని ఎదుర్కొనేందుకు సరైన వ్యూహ రచన చేయడంలో స్థానిక ప్రభుత్వాలకు చాలా ముఖ్యమైన పాత్ర ఉంటుంది. ఇలా వ్యూహరచన చేయడం ప్రజా ఆర్థిక ప్రణాళికా ప్రక్రియలో ఒక భాగం మాత్రమే.

**స్థానిక ప్రభుత్వాన్ని మెరుగు పర్చటానికి వ్యూహాలు**

**స్థానిక ప్రభుత్వ ఆర్థిక పునాదిని మెరుగుపరచడం**

5. స్థానిక ప్రభుత్వాలు, అంతర్జాతీయ దాతల ద్వారా తగినన్ని వనరులు పొందేందుకు, వనరులను బదిలీ చేసుకొనేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతించాలి. ముఖ్యంగా ఆర్థిక మాంద్యం ఉన్నప్పుడు స్థానిక ప్రభుత్వం తన గమ్యాన్ని విస్మరించకూడదు. సాధ్యమైనంత వరకు బయటి నుంచి వచ్చే ఆదాయ వనరులను, ముఖ్యంగా తన స్వంత ఆదాయ వనరులను చెక్కు చెదరనివ్వకుండా ఉంచుకోవాలి. అప్పుడే స్థానిక ప్రభుత్వం జాతీయ ఆర్థిక వ్యవస్థకు ప్రేరణను ఇవ్వగలుగుతుంది.

6. నీరు, పారిశుధ్యం, విద్యుద్దీకరణ, ప్రజారవాణా వంటి ప్రధానమైన స్థానిక మౌలిక సదుపాయాలకు స్థానిక ఆదాయ వనరుల నుంచి మాత్రమే ఖర్చు పెట్టకూడదు. జాతీయ లేదా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంటులు, లేదా మున్సిపల్ బాండ్‌లను విడుదల చేయడం లేదా పబ్లిక్-ప్రైవేటు భాగస్వామ్యం, అప్పులు, పన్నులు నుంచి వచ్చే ఆదాయాన్ని వినియోగించుకోవాలి. ఇదంతా స్థానిక ప్రజాప్రణాళికా ప్రక్రియ పరిధిలోనే జరగాలి. ఆదాయ వనరులను సమకూర్చే కామన్‌వెల్త్ ప్రాజెక్టులు ఏవైనా ఉన్నాయేమోనని కూడా పరిశోధించాలి.

7. జాతీయ అభివృద్ధి విధానాలను రూపొందించి, వాటిని అమలుచేసి, పర్యవేక్షించడంలో స్థానిక ప్రభుత్వాలకు భాగస్వామ్యం కల్పించాలని 2008లో మొట్టమొదటిసారిగా జాతీయ ప్రభుత్వాలు, ప్రతినిధులు ''అక్రా ఎజెండా ఫర్ యాక్షన్''లో అంగీకరించారు. కేంద్ర, ఇతర కింది స్థాయిలన్నింటిలో నిర్వహణా సామర్థ్యం పెంచడానికి ఎక్కడెక్కడ అవకాశాలున్నాయెూ వాటిని గుర్తించాలని, వాటిని

వినియోగించుకోవాలని కూడా అక్రా సదస్సులో తీర్మానించారు. దేశ అభివృద్ధి లక్ష్యాలపై జరిగే చర్చలో స్థానిక ప్రభుత్వాలు పాల్గొనేలా వాటి సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేయాలని కూడా అక్రా ఒప్పందంలో తీర్మానం చేశారు. ఈ ఒప్పందాలన్నింటినీ కామన్‌వెల్త్ దేశాలన్నింటిలో అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కూడా నిర్ణయించారు. అభివృద్ధి కోసం ఇచ్చే సహాయాన్ని జాతీయ అభివృద్ధి వ్యూహాలతో సమన్వయపరచాలి. దాతలు, స్థానిక ప్రభుత్వంతో సహా అన్ని భాగస్వామ్య పక్షాలతో సామరస్యంగా ఉంటూ, వనరులన్నింటినీ నిర్ణీత బాధ్యతలకు అనుగుణంగా మలచాలి.

8. స్థానిక ప్రభుత్వం, ఆర్థిక పునాదిని పటిష్టపరచాలంటే, సరిపోయే స్థానిక వనరులను అంటే పన్నులు, స్థానిక ఆస్తులను, ప్రజావనరులను సమీకరించడానికి కొత్తమార్గాలను అన్వేషించాలి. దీనికి గట్టి ద్రవ్య నిర్వహణా, జవాబుదారీతనం ఉండాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్కరణలపై కేంద్రీకరించి పనిచేయాలి. దృఢమైన, స్వతంత్ర నియంత్రణా సంస్థలు కూడా అవసరం. కిందిస్థాయి వరకు జవాబుదారీతనం ఉంటే పారదర్శకత పెంపొందడటమేకాక అవినీతిని అడ్డుకోవడం వీలవుతుంది.

### స్థానికులందరి అవసరాలను తీర్చటానికి స్థానిక సేవలను మెరుగుపర్చాలి

9. ప్రపంచ ఆర్థికమాంద్యం స్థానిక బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది. సేవా ప్రమాణాలు తగ్గకుండా స్థానిక కౌన్సిళ్లు ఎక్కువ సామర్థ్యాన్ని, కొత్త పద్ధతులను చేపట్టాలి. స్థానిక కార్యకలాపాలు, భాగస్వాములకు సహాయపడేలా కొత్త సేవలను ప్రారంభించడానికి ప్రయత్నం చేయాలి. ఇక్కడ స్థానిక కార్యకలాపాలు అంటే సామాజిక సేవలు, స్థానిక ఆర్థికాభివృద్ధిని మెరుగుపరిచే చర్యలు అని అర్థం. కొత్త కార్యక్రమాలు చేపట్టేటప్పుడు ఖర్చుకు వెనుకాడకూడదు.

10. స్థానిక ప్రభుత్వ అభివృద్ధి ప్రాజెక్టులలో సామర్థ్యాన్ని వృద్ధి చేసేందుకు అనువుగా వాటిని రూపొందించాలి.

11. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పేదరికాన్ని తగ్గించడం; నీరు, పారిశుధ్యం, ప్రాథమిక ఆరోగ్యం, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ మరి ఇతర అంటువ్యాధుల నివారణలో మిలీనియం డెవలప్‌మెంట్ లక్ష్యాలను స్థానిక పరిస్థితులకు అన్వయించాలి. ఈ లక్ష్యాలు 2015కు ఆవల కూడా కొనసాగుతాయి. ఈ సమస్యలు తక్కువ అభివృద్ధి చెందిన దేశాల్లో ఎక్కువగా ఉంటాయి. అయినప్పటికీ ఏదేశంలోనైనా స్థానిక ప్రభుత్వాలకు ఈ లక్ష్యాలు వర్తిస్తాయి.

12. ఎక్కువ ఉద్యోగావకాశాలు, పెట్టుబడి అవకాశాలు, స్థానికాభివృద్ధికి కావలసిన వనరులను సృష్టించడానికి ప్రైవేట్ సెక్టార్, ఇతర భాగస్వామ్య పక్ష్యాలతో రూపొందిన స్థానిక ఆర్థికాభివృద్ధి వ్యూహాలు బాగా తోడ్పడతాయి. అసంఘటిత లేదా ఇంటి నుంచి పనిచేసే వారితో స్థానికార్థికాభివృద్ధి కార్యకలాపాలను చేపట్టాలి.

13. పెరుగుతున్న నగరాలు, జనాభా వల్ల స్థానిక ప్రభుత్వసేవలు, వనరులపై భారం పడుతోంది. ఆసియా, ఆఫ్రికా దేశాల్లో పెరిగిపోతున్న మురికివాడలు, ముఖ్యంగా కామన్‌వెల్త్‌లోని అనేక చిన్నచిన్న దీవుల్లోని ప్రభుత్వాలపై పెనుభారం పడుతోంది. పట్టణీకరణ ప్రభావాన్ని ముందుగానే అంచనావేస్తే, దాని పెరుగుదలను, సంబంధిత సేవలను నియంత్రించడానికి వీలు కలుగుతుంది.

14. గ్రామీణ, మారుమూల ప్రాంతాలలో స్థానిక సేవలను కల్పించడం ఓ ప్రత్యేక సవాలు. ఎందుకంటే, ఆర్థిక వనరులు, దూరాలు, రవాణా సౌకర్యాలు, అవరోధాలుగా ఉంటాయి. ప్రాంతీయ సహకారం, పొరుగునున్న కౌన్సిళ్ల వనరులను ఒకచోట చేర్చడం, ఇతర భాగస్వామ్య పక్షాలతో కలిసి పనిచేయడం వంటి కొత్తకొత్త ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉంది.

15. ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా స్థానిక ప్రభుత్వం ముందుగా సన్నద్ధం చేసి, ప్రమాదాన్ని నివారించే చర్యలు తీసుకోవడంలో ముందుండి పనిచేయాలి. వాతావరణ మార్పులకు అనుగుణంగా స్థానిక స్థాయిలో ఎన్నో కొత్తకొత్త పద్ధతులను అవలంబించవచ్చు.

16. స్థానికపాలనను మెరుగు పరిచేందుకు అందుబాటులో ఉన్న ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీని వినియోగించుకోవాలి.

### స్థానిక ప్రభుత్వంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి

17. ఎక్కువమంది పౌరులను భాగస్వాములను చేయడం, ఎక్కువమందితో సంప్రదింపులు జరపడం ద్వారా స్థానిక ప్రభుత్వాన్ని పటిష్ఠం చేయవచ్చు. గతంలో మిగతా ప్రభుత్వరంగాల మాదిరిగా స్థానిక ప్రభుత్వాలు ప్రజలకు దూరంగా లేదా అధికార నియంతృత్వ పోకడలతో ఉండేవి. ప్రజలను సాధికారులను చేయడం ద్వారా పరిస్థితిలో మార్పు తేవాల్సిన అవసరం ఉంది. ఈ విధమైన ప్రజాస్వామిక వికేంద్రీకరణ లేదా స్థానికీకరణ ద్వారా చిన్నమొత్తాలతో గ్రాంట్‌లను కేటాయించి స్థానిక ప్రజలకు ఆర్థికవ్యవహారాలలో స్వయం నిర్ణయాధికారం ఇవ్వాల్సిన అవసరం ఉంది.

18. ప్రజల సాంస్కృతిక, సాంప్రదాయక విలువలను కొనసాగించడం చాలా ముఖ్యం. సాంప్రదాయక పాలన పద్ధతులతో కొత్త పోకడలను జోడించి సత్సంబంధాలను ఏర్పాటు చేయాలి.

19. స్థానిక ప్రభుత్వం, ప్రజల మధ్య సత్సంబంధాల కోసం వివిధ కొత్త పద్ధతులను అవలంబించాలి. బడ్జెట్ ప్రక్రియలో ప్రజలు ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడం ద్వారా కౌన్సిల్ ఆర్థిక ప్రాధాన్యాలను నిర్ణయించడం వీలవుతుందని గతంలో రుజువైంది. వివిధ స్థాయిల్లో స్థానికులను బాధ్యులు చేయడం ద్వారా జవాబుదారీతనం బాగా మెరుగవుతుంది.

20. విధానాలలో వచ్చిన మార్పుల ఫలాలు పేదలకు, మురికివాడ ప్రజలకు, గ్రామీణులకు, వివక్షకు గురైనవారికి, వికలాంగులకు, వలసదారులకు, మైనారిటీ వర్గాలవారికి చేరాలి. పౌరులందరికీ

సంపూర్ణ ప్రజాస్వామ్యం హక్కులు ఉండాలి. అన్ని నిత్యావసర సేవలు వారికి అందేలా చూడటమే స్థానిక ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. సమగ్రాభివృద్ధి ప్రణాళిక, ప్రాథమిక సేవల అందుబాటు, ప్రణాళికవేత్తల సామర్థ్యం పెంపు వంటి వాటి వల్లనే ఆశించిన మార్పులు వస్తాయి.

21. కామన్‌వెల్త్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ 2005-15 కు అనుగుణంగా మహిళల హక్కులపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి అవసరం ఉంది. దీని ప్రకారం, కనీసం 30 శాతం మంది మహిళలు ప్రజాజీవనంలో ఉండాలన్నది లక్ష్యం. అంటే, స్థానిక ప్రభుత్వంలో మహిళలు నాయకత్వ స్థాయిలో లేదా సిబ్బందిగా లేదా భాగస్వాములుగా ఉండాలి. అందుకని స్థానిక ప్రభుత్వాలు రూపొందించే విధానాలు, కార్యక్రమాలు లింగ ప్రాధాన్యం గానూ, ప్రభావశీలంగా, సామర్థ్యవంతంగా ఉండి ప్రజలందరికీ ఉపయోగకారిగా ఉండాలి. దాన్నే లింగ ప్రతిస్పందన ప్రణాళిక మరియు బడ్జెటింగ్ అంటారు. అలాగే, స్థానిక ప్రభుత్వాల విధానాలు కామన్‌వెల్త్‌లో సంఖ్యాపరంగా పెరుగుతున్న యువజనుల సమస్యలకు కూడా పరిష్కార మార్గాలను చూపాలి. యువజనులను సాధికారులను చేయడానికి, వారికి కావలసిన సహకారాన్ని అందించడానికి మార్గదర్శక కార్యక్రమాలను నిర్వహించాలి.

22. స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధాలు, స్థానిక స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేయడం, వాటికి నిధులను సమకూర్చడం వంటి చర్యలు స్థానిక ప్రభుత్వ వ్యూహాలను పెంపొందింపజేస్తాయి. వాలంటీరింగ్, యువజనోద్యమం ద్వారా స్థానిక ప్రభుత్వం యువజనులకు మద్దతునివ్వవచ్చు.

### కేంద్ర స్థానిక సంబంధాల మెరుగుకు కృషి

23. స్థానిక ప్రజాస్వామ్యం అంటే స్థానిక ప్రభుత్వ 'అనుబంధ సిద్ధాంతానికి' అనుగుణంగా తగిన అధికారాలు కలిగి ఉండటం. స్థానిక ప్రభుత్వం తనకు అధికారం(బాధ్యత) ఉన్న వ్యవహారాలలో స్వయం ప్రతిపత్తితో కర్తవ్య నిర్వహణ చేపట్టినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయపరమైన, సానుకూలమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉంటుంది.

24. స్థానిక ప్రభుత్వం సక్రమంగా పనిచేయడానికి స్థానిక, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభావశీలమైన భాగస్వామ్యం ఉండాలి. ఏ భాగస్వామ్య వ్యవహారంలోనైనా భిన్నమైన ఆలోచనలు ఉండి వాటిపై ఏకాభిప్రాయం సాధించగలిగినప్పుడే దాని బలమేమిటో తెలుస్తుంది. వివాదాలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే వ్యవస్థ ఉండాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పరస్పర సహకారాన్ని ప్రోత్సహించాలి. ఎన్నికైన కౌన్సిలర్లు, పార్లమెంటేరియన్ల మధ్య కూడా అదే తరహా సహకారం ఉండాలి. స్థానిక ప్రభుత్వాల మధ్య గట్టి సంబంధాలు ఉండటానికి ఈ ప్రక్రియకు ఎంతో ప్రాధాన్యం ఉంది.

25. స్థానిక ప్రభుత్వం, అర్బన్, రూరల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖలు ఈ విషయంలో పర్యవేక్షక పాత్రను పోషిస్తాయి. ప్రభుత్వ పాలనకు సంబంధించిన క్లిష్టమైన సమస్యలను పరిష్కరించడానికి సరైన నైపుణ్యం అవసరం కాబట్టి మంత్రిత్వ శాఖల పర్యవేక్షణ అనివార్యమవుతుంది. ఒక్కోసారి అంతర్జాతీయ కామన్‌వెల్త్ స్థాయిల్లో కూడా సమస్యలను పరిష్కరించాల్సి వస్తుంది. వికేంద్రీకరణ, పబ్లిక్ సెక్టార్ సంస్కరణలకు సంబంధించిన సమస్యలు కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో ఉత్పన్నమైనప్పుడు నాయకత్వ పాత్రను పోషించాల్సి వస్తుంది.

26. రాజ్యాంగంలో పొందుపరిచిన పటిష్టమైన చట్టాలు, వాటితో పాటు నమ్మకమైన నిధుల బదిలీ వ్యవస్థ ఉంటే కేంద్ర, రాష్ట్రాలు, స్థానిక ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు నెలకొంటాయి.

### ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించాలి

27. ఒక దేశంలో అంతర్గతంగా, దేశాల మధ్య ప్రాంతీయ భాగస్వామ్య వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక ప్రభుత్వ పనితీరును మెరుగుపరచడానికి ఆచరణయోగ్యమైన యంత్రాంగం అవసరం. ప్రాంతీయ స్థాయిలో సమాచారం బదిలీ, ఆర్థికాభివృద్ధి వంటి ఎన్నో అంశాలను ప్రోత్సహించవచ్చు. అటువంటి సహకారం వల్ల ప్రాంతీయ విధానాలు, స్థానికులకు అందుబాటులోకి వస్తాయి.

### స్థానిక కౌన్సిలర్లు, అధికారుల సామర్థ్యాన్ని మెరుగుపరచడం

28. అబెర్‌దీన్ అజెండాలో పేర్కొన్నట్టు, స్థానిక ప్రజాస్వామ్యాన్ని సంఘటితపరచడానికి తగిన చర్యలు తీసుకోవాలి. వాటిలో భాగంగా క్రమం తప్పకుండా సకాలంలో స్థానిక ఎన్నికలు జరిపించాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, నియమితులైన అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించే శక్తిసామర్థ్యాలు వారికుండేలా చూడటం చాలా అవసరం.

29. స్థానిక ప్రభుత్వం పటిష్టంగా పనిచేయాలంటే, మేయర్లు, కౌన్సిలర్లు, కౌన్సిల్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాధికారులు వారి వారి పాత్రలను, విధులను సక్రమంగా అవగాహన చేసుకొని వాటిని గౌరవించాలి. వారి మధ్య పని విభజనను స్పష్టంగా నిర్వచించాలి.

30. ఎన్నికైన ప్రతినిధులు వారికి అప్పటించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలంటే అందుకు సరిపోయే శక్తి సామర్థ్యాలు వారికుండాలి. నాయకులు తమ శక్తి సామర్థ్యాలను పెంచుకోవటానికి నిరంతరం ప్రజలతో మమేకమై చర్చించాలి, రెండు వర్గాల మధ్య రాయబారాలను నడపటం ద్వారా నైపుణ్యం అబ్బుతుంది. నాయకులుగా రాణించాలంటే, నీతి నిజాయితీ, పారదర్శకత, కట్టుబాటు వంటి లక్షణాలు ఉండాలి. స్థానిక ప్రభుత్వంలో మహిళల సామర్థ్యం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. చిన్న, మారుమూల రాష్ట్రాలలో ఉండేవారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

31. విత్త వికేంద్రీకరణ, ప్రజానిధుల నిర్వహణకు ప్రత్యేక నైపుణ్యం ఉండాలి. ఉదాహరణకు ప్రైవేటు కాపిటల్ మార్కెట్లు, లేదా అభివృద్ధి నిధులకు సంబంధించి పూర్తి అవగాహన ఉండాలి.

అవసరమైన అర్హతలు, నైపుణ్యం గల వారినే ఈ రంగాల్లో నియమించాలి. ద్రవ్యనిర్వహణ, ప్రణాళిక, బడ్జెటింగ్ వంటి రంగాలలో సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

**స్థానిక ప్రభుత్వాల భాగస్వామ్య ప్రభావాన్ని పెంచడం**

32. ఇతర స్థానిక ప్రభుత్వాలతో కలిసి సంఘాలుగా ఏర్పడితే అజెండాలో పేర్కొన్న విధంగా మెరుగుపరచడానికి ఉపయోగపడుతుంది.

33. స్థానిక ప్రభుత్వ సంఘాల వల్ల అంకితభావంతో సేవలను అందించడం వీలవుతుంది. ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీని మరింత సమర్థవంతంగా వాడుకొనేందుకు వీలుగా సాటి సభ్యులకు సహకారాన్ని అందించవచ్చు.

34. స్థానిక ప్రభుత్వాల సంఘాలు తమ పాత్రను సమర్థవంతంగా పోషించడానికి దక్షిణాఫ్రికాలో మాదిరిగా చట్టపరమైన లేదా రాజ్యాంగబద్ధమైన గుర్తింపు ఉండాలి. అంతేకాకుండా, వాటికి అవసరమైన సిబ్బంది, సేవలకు కావాల్సిన వనరులు ఉండాలి. ముఖ్యంగా విదేశాలలో ఉండే వారి సహోద్యోగులతో చర్చించడానికి కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు వంటి అంతర్జాతీయ సంస్థల్లో సభ్యత్వం తీసుకొనేందుకు సిబ్బంది అవసరం అవుతుంది.

35. స్థానిక ప్రభుత్వాల సంఘ రాజకీయ నాయకత్వం, సిబ్బంది సామర్థ్యాన్ని పెంచుకోవాలి. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సిబ్బంది శక్తిసామర్థ్యాలు, వనరులు చాలా దిగుస్థాయిలో ఉంటాయి. వారి సామర్థ్యాన్ని తమ అంతర్జాతీయ భాగస్వాములు, దాతల సహకారంతో బాగా మెరుగుపరచుకోవాల్సి ఉంటుంది.

**పర్యవేక్షణ, మూల్యాంకనను మెరుగుపరచుకోవాలి**

36. 21వ శతాబ్దంలోని ఆధునిక స్థానిక ప్రభుత్వాల పనితీరును పర్యవేక్షించి, మూల్యాంకనం చేసే సమగ్రమైన యంత్రాంగం ఉండాల్సిన అవసరం ఉంది. లక్ష్యాలను ఏమేరకు చేరుకోగలిగారు, ఫలితాలను ఏమేరకు సాధించగలుగుతున్నారన్న విషయాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ఉండాలి. ముందుగానే సమస్యలను గుర్తించి వెంటనే నివారణచర్యలు చేపట్టేందుకు కూడా అవకాశం ఉంటుంది. సేవల నాణ్యతను అంచనా వేసేందుకు పనిని తుల్యాంకన చేయాల్సి ఉంది. పెరుగుదల, స్థానికంగా రూపొందించిన సూచీలు, సహోద్యోగుల సమీక్షల ద్వారా పనినాణ్యతను అంచనా వేయవచ్చు.

37. పనిని మూల్యాంకన చేసేందుకు చాలా దేశాలు వివిధ పద్ధతులను కనిపెట్టాయి. ప్రతిభను గుర్తిస్తూ ఇచ్చిన అవార్డులు వాటిల్లో ఒకటి. ఇతర కౌన్సిల్‌లోని కౌన్సిలర్స్, సిబ్బంది పనిని అంచనా వేయడం మరొక పద్ధతి. ఇవిగాక ఎన్నో అంతర్జాతీయ ప్రత్యామ్నాయాలున్నాయి. వాటిలో 'అర్బన్ గవర్నెన్స్ ఇండెక్స్' అనే సంస్థ ఒకటి. ఇది పనిని అంచనా వేయడంతో పాటు ఇతరులతో పోల్చి చూపిస్తుంది. అనేక కొత్త కొత్త పద్ధతులు ప్రస్తుతం అమల్లో ఉన్నాయి. కౌన్సిళ్లు తమ పరిస్థితులకు అనువైన పద్ధతులను చేపట్టటానికి కావలసిన సలహాలను అందజేస్తారు.

38. పని అంచనా ఆధారంగా అభివృద్ధిని ప్రోత్సహించడంలో స్థానిక ప్రభుత్వాల సంఘాలకు, స్థానిక ప్రభుత్వ మంత్రిత్వశాఖలకు ముఖ్య పాత్ర ఉంది. మంత్రిత్వ శాఖలు, స్థానిక ప్రభుత్వాల సంఘాల మధ్య పారదర్శక సంప్రదింపులు జరిగితే వాటి ప్రాతిపదికగా జాతీయ మూల్యాంకన వ్యవస్థ వ్యవహరిస్తుంది. ఈ విధంగా కేంద్ర స్థానిక ప్రభుత్వాల మధ్య సంబంధాలను పెంపొందించడానికి పని అంచనా వ్యవస్థ ఉపయోగపడుతుంది.

**కామన్‌వెల్త్‌లో అభివృద్ధి సంస్కృతి కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు పాత్ర**

39. ఫ్రీ పోర్ట్ డిక్లరేషన్ ప్రధాన లక్ష్యాలను "డికేడ్ ఆఫ్ కంటిన్యుయస్ ఇంప్రూవ్‌మెంట్" ప్రణాళికలో చేర్పించే బాధ్యతను కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు స్వీకరిస్తుంది.

40. కౌన్సిలర్లకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని సదస్సు సభను కోరనున్నది. ఇటీవలీ ఆసియాలో కౌన్సిలర్ల శిక్షణకు ఒక ప్రణాళికను రూపకల్పన చేశారు. అనుబంధ సభ్యులు, ఆసక్తి కనపర్చిన స్థానిక ప్రభుత్వ శిక్షణా సంస్థలు సంయుక్తంగా ఈ శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించాయి.

41. కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు ఇతర భాగస్వామ్య పక్షాలతో కలిసి స్థానిక ప్రభుత్వాల సంఘాల సభ్యులకు సలహాలిచ్చేందుకు ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో దక్షిణ ఆఫ్రికాలో విజయవంతంగా చేపట్టిన అంతర్జాతీయ స్థానిక ప్రభుత్వ పీర్ రివ్యూ మెకానిజాన్ని అమలు చేయదలుచుకొన్న వారికి సలహాలిస్తున్నారు.

42. స్థానిక స్థాయిలో మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌ను సాధించడానికి స్థానిక ప్రభుత్వానిదే ప్రత్యక్ష బాధ్యత. దీనితోపాటు నిరంతర సేవలను కూడా అందించే బాధ్యత స్థానిక ప్రభుత్వానిదే.






కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు సాంకేతిక సహాయ కార్యక్రమాలు చేపట్టి, పేదరికాన్ని తగ్గించడం, సేవలను సమర్థవంతంగా అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోంది. దానితో పాటు స్థానిక ప్రజాస్వామ్యం, ఉత్తమ పాలన అందించాలన్నది సదస్సు ఆశయం. దీనికి వృత్తిపరమైన నైపుణ్యం ఎంతో అవసరం.

43. ప్రజాస్వామిక సంప్రదాయాలు, ఆర్థిక వనరులను పెంపొందించడం, స్థానిక ఆర్థికాభివృద్ధి, మెరుగైన సేవలు వంటి అంతర్జాతీయ ఉత్తమ సంప్రదాయాలే కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సుకు గుండెకాయ వంటివి. దాని పరిధిలో ఉన్న యంత్రాంగాల్ని పటిష్టం చేసేందుకు కృషి చేస్తోంది. అంతర్జాతీయ/ప్రాంతీయ సదస్సులను, వర్క్‌షాపులను నిర్వహించడం, ఉత్తమ సంప్రదాయాల పథకం, స్థానిక ప్రభుత్వాల డేటాబేస్, కామన్‌వెల్త్ ఇ-జర్నల్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్, రీసెర్చ్, అసోసియేట్ సభ్యుల నెట్‌వర్క్ సమాచారాన్ని వ్యాప్తి చేసేందుకు మీడియాతో సంబంధాలను పెంచుకొనేందుకు ప్రోత్సహిస్తున్నది.

44. ఆసియా మరి ఇతర చోట్ల కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు ప్రస్తుతం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. 'జెండర్ అండ్ లోకల్ గవర్నమెంట్ యాక్షన్ ప్లాన్'ను అభివృద్ధి చేసి, నిర్ణీతకాల వ్యవధిలో పూర్తిచేయాల్సిన లక్ష్యాలను నిర్ణయించడం, స్థానిక ప్రభుత్వానికి సూచీలను తయారుచేయడానికి సదస్సు కామన్‌వెల్త్ సెక్రటేరియట్, ప్రాంతీయ సంస్థలతో సహకరించాలి.

45. అవసరమైన చోట్ల సదస్సు సభ్యులు, ముఖ్యంగా స్థానిక ప్రభుత్వాల సంఘాల తరపున నిధుల కోసం జాతీయ ప్రభుత్వాలు, అంతర్జాతీయ దాతలతో చర్చలు జరుపుతుంది. ఈ నిధులు 2008 అక్రా ఎజెండాలో పేర్కొన్న విధంగా అభివృద్ధికి మాత్రమే వినియోగించబడతాయి. స్థానిక ప్రభుత్వాలను ప్రోత్సహించేందుకు అభివృద్ధి నిధులకోసం యూరోపియన్ యూనియన్‌తో సహాయ సహకార సంబంధాలను సదస్సు కొనసాగిస్తోంది.

46. కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వ సదస్సు ఆచరణాత్మక పరిశోధనలో చాలా పేరు ప్రఖ్యాతులు సంపాదించింది. స్థానిక ప్రభుత్వ అభివృద్ధికి, నిరంతరం మెరుగైన కార్యక్రమాలను చేపట్టాలంటే సాక్ష్యాల ఆధారంగా విధానాలను, కార్యక్రమాలను రూపొందించాలి. స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు, పరిశోధకుల మేలు కలయికతో ఒక ముఖ్యమైన లాభముంది. పరిశోధన అవసరాలను గుర్తించి, పరిశోధనా ఫలితాలను వ్యాప్తిచేసి, ఆచరణాత్మకంగా అమల్లో పెట్టడం సాధ్యమవుతోంది. అయితే, సదస్సు స్థానిక ప్రభుత్వాల జ్ఞానాన్ని ఎలా సంపాదిస్తాయి? ఇతరులతో ఎలా పంచుకొంటాయన్న విషయాలతోపాటు సమాచార నిర్వహణను, పంపిణీని ఎలా చేస్తామన్న విషయాలను ఇంకా అధ్యయనం చేయాల్సి ఉంది. సదస్సు పరిశోధనాసలహా సంఘం ఈ అంశంపై ప్రధాన పాత్రను పోషిస్తోంది.

47. అబెర్‌దీన్ ఎజెండాను అమలుచేస్తున్న తీరును కామన్‌వెల్త్ సభ్యదేశాలన్నీ పర్యవేక్షించాలి. అవి రెగ్యులర్‌గా నివేదికలను తయారుచేసి సదస్సుకు సమర్పించాలి. స్థానిక ప్రజాస్వామిక హక్కులపై వచ్చిన సమస్యల పరిష్కారానికి, సంస్కరణలకు అమలు చేయటానికి కావాల్సిన సాంకేతిక సహాయాన్ని పొందేందుకు సభ్యులు సదస్సు ఆశ్రయిస్తారు.

48. ఫ్రీపోర్టు డిక్లరేషన్‌లో పేర్కొన్న విధానాలను అమలు చేసేందుకు కామన్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు దాని సభ్యులను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రోత్సహిస్తుంది. అలాగే, అది అనేక కామన్‌వెల్త్, ఐక్యరాజ్యసమితి/ అంతర్జాతీయ, ప్రాంతీయ భాగస్వాములను కూడా ఫ్రీపోర్టు డిక్లరేషన్‌ను అమలు చేయవలసిందిగా ప్రోత్సహిస్తుంది. సభ్యులు, భాగస్వాముల మద్దతుతో, ఇప్పుడున్న ప్రాంతీయ సంస్థలను, కార్యక్రమాలను పటిష్టం చేయడమే లక్ష్యంగా పెట్టుకొంది. తన ఉనికి లేని చోట కొత్త వాటిని ఏర్పాటు చేయతలపెట్టింది.

49. 2009 లో ట్రినిడాడ్‌లో జరిగిన కామన్‌వెల్త్ దేశాధినేతల సమావేశంలో ఫ్రీ పోర్టు డిక్లరేషన్, కామఎద్‌వెల్త్ స్థానిక ప్రభుత్వాల సదస్సు పాత్రకు ఆమోదముద్ర లభించింది.

50. ఫ్రీపోర్ట్ డిక్లరేషన్ అమలును పర్యవేక్షించే బాధ్యతను సదస్సు స్వీకరించింది. అది సాధించిన ప్రగతిని 2011లో జరుగనున్న మహాసభలో నివేదిక రూపంలో అందజేస్తుంది.

*సేకరణ:* ***డా॥ వి. శివశంకర ప్రసాద్, ఫాకల్టీ,*** *అపార్డు*

అనువాదం- ***బి. లలిత***

## బోధన ప్రణాళిక (*Fixed Point Chart*)

# గ్రామ వికాసం
# దూర విద్యా బోధన

**మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్ -3** (03-06-2010 నుండి 24-06-2010)

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
| --- | --- | --- | --- |
| 3.6.2010 | సూపరింటెండెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్, జిల్లా పరిషత్ & మండల్ పరిషత్ టైపిస్టులు | ఉ.11.00-మ.12.15<br>ఉ.12.15-మ.1.20<br>మ.2.00-సా.4.00 | ఆంధ్రప్రదేశ్ గుమాస్తా వర్గ సర్వీస్ రూల్స్<br>ఆంధ్రప్రదేశ్ క్రింది స్థాయి వర్గ సర్వీస్ రూల్స్<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| 3.6.2010 | | ఉ.11.00-మ.12.15<br>ఉ.12.15-మ.1.20<br>మ.2.00-సా.4.00 | ఆర్థిక నియమావళి<br>ఆడిట్ అభ్యంతరాలు పరిష్కరణ<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| 17.6.2010 | | ఉ.11.00-మ.12.15<br>ఉ.12.15-మ.1.20<br>మ.2.00-సా.4.00 | ఖజానా నియమావళి<br>కారుణ్య నియామకాలు<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| 24.6.2010 | | ఉ.11.00-మ.12.15<br>ఉ.12.15-మ.1.20<br>మ.2.00-సా.4.00 | ప్రవర్తనా నియమావళి<br>రహస్య నివేదికల నిర్వహణ<br>మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |

### సవరణ

**'స్థానిక పాలన'** మే సంచిక 51 పేజీలో శ్రీ మణిశంకర్ అయ్యర్, కేంద్ర పంచాయితీరాజ్ శాఖామంత్రి అని ముద్రించబడింది. కేంద్ర పంచాయితీరాజ్ శాఖ మాజీ మంత్రి అని ముద్రించబడాలి. అచ్చుతప్పుకు చింతిస్తున్నాం.

**- ఎడిటర్**

## పంచాయతీరాజ్ జాతీయ సదస్సులో
## రాంచంద్రపూర్ ఆదర్శ సర్పంచ్

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఏప్రిల్ 24న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అత్యంత ఘనంగా జరిగింది. కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి డాక్టర్ సి.పి. జోషి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ అతిధిగా పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి సుమారు ఆరువందల మంది స్థానిక సంస్థల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్



నుండి ప్రాతినిధ్యం వహించిన కరీంనగర్ జిల్లా, కోహిడ్ మండలం రాంచంద్రాపూర్ సర్పంచ్ వకుళాభరణం భానుప్రకాష్‌కు ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అరుదైన అవకాశం లభించింది. రాష్ట్రంలో మొట్టమొదటి నిర్మల్ గ్రామపురస్కార్ అవార్డును, శుభ్రం అవార్డును అందుకున్న సర్పంచ్ భానుప్రకాష్ ఆ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (అపార్డు) గ్రామాభివృద్ధిపై లఘు డాక్యుమెంటును రూపొందించింది. ఇటీవల ఆ చిత్ర ఆంగ్లప్రతిని జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగిన ఒక సదస్సులో విడుదల చేశారు. గ్రామ సర్పంచ్‌గా నిస్వార్థంగా గ్రామాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి గావించినందుకు కేంద్రమంత్రి డాక్టర్ జోషి, భానుప్రకాష్‌ను అభినందించడమే కాకుండా ఈ సదస్సులో రాష్ట్రం తరపున ప్రసంగించాల్సిందిగా ప్రత్యేకంగా కోరి అవకాశం కల్పించారు. పలు రాష్ట్రాల పంచాయతీరాజ్ శాఖ మంత్రులతో పాటు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖామాత్యులు శ్రీ బొత్స సత్యనారాయణ, అనేకమంది కేంద్ర, రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్న జాతీయ సదస్సులో భానుప్రకాష్, రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ తీరుతెన్నులు, 73, 74వ సవరణల ఫలితం, స్థానిక సంస్థల పనితీరుపై సవివరంగా ప్రసంగించి పలువురి అభినందనలు పొందారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా ముగింపు సమావేశం అనంతరం సర్పంచ్‌ను అభినందించారు. అలాగే వచ్చే పంచవర్ష ప్రణాళికలో స్థానిక సంస్థలకు మరింత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. ♦

# వార్తల్లో 'అపార్డ్'

## పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలపై వర్కుషాప్

పంచాయతీరాజ్ సంస్థలకు స్థానిక ప్రభుత్వాలుగా రూపొందించటానికి రాష్ట్రప్రభుత్వాలు ఏ విధమయిన సామర్థ్యాలు సంతరించుకోవాలి, ఎటువంటి వ్యూహాలు అవలంబిస్తే పంచాయితీ రాజ్ ప్రతినిధులకు, అధికారులకు మెరుగైన శిక్షణ అందించగలుగుతారు, అన్న విషయాలపై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు అందచేయటానికి గాను యు.యన్.డి.పి, భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా రెండు రోజుల వర్కుషాపును 2010 మే13, మే 14 తేదీలలో అపార్డులో నిర్వహించాయి. పంచాయతీరాజ్ సంస్థలకు ఎన్నికయిన ప్రజాప్రతినిధులు, సంస్థలతో పనిచేస్తున్న అధికార సిబ్బందికి సామర్థ్యాల పెంపుదల కోసం భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ, ఐక్యరాజ్యసమితి సమిష్టి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాల సామర్థ్యాల పెంపుదల ప్రాజెక్ట్ (సి.డి.యల్.జి) భారత దేశంలోని ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌గడ్, ఒరిస్సా, రాజస్థాన్, బీహార్ వంటి 7 వెనుకబడిన రాష్ట్రాలలో అమలు చేస్తున్నారు. ఈ వర్కుషాప్‌నకు ముఖ్య అతిధిగా విచ్చేసిన కేంద్రప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీ సుధీర్ కృష్ణ మాట్లాడుతూ, పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధులకు, సిబ్బందికి ప్రతీ సంవత్సరం ఒక శిక్షణా కార్యక్రమం నిర్వహించే విధంగా రాష్ట్రాలు కార్యాచరణ ప్రణాళిక తయారుచేసుకోవాలని వివిధ రాష్ట్రాలకు సూచించారు. బి.ఆర్.జి.ఎఫ్, ఆర్.జి.ఎస్.వై పథకాలలో ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదలకు నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ, సరైన శిక్షణా సామర్థ్యాల పెంపుదల వ్యూహాలను ఈ రాష్ట్రాలు అమలు చేయకపోవటంతో ఈ నిధులు నిరుపయోగం అవుతున్నాయని శ్రీ సుధీర్‌కృష్ణ అన్నారు. సామర్థ్యాల పెంపుదల కార్యక్రమం రూపొందించుకొనే సందర్భంలో శిక్షణ అందచేయుటానికి ప్రజాప్రతినిధులందరికీ శిక్షణ అందచేయాలంటే ఇంకా ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, ప్రైవేటు ప్రభుత్వ భాగస్వామ్యంతో శిక్షణను అందచేయుటానికి అవకాశాలు ఎంత మేర ఉన్నాయి, తదితర విషయాలను రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖలు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. రెండు రోజులపాటు జరిగే వర్కుషాపులో రాష్ట్రాల సామర్థ్యాలను అంచనా వేయటానికి ఏ విధమైన కార్యాచరణను చేపట్టాలో చర్చించి, విధి విధానాలను రూపొందించాల్సిందిగా శ్రీ సుధీర్ కృష్ణ సూచించారు.



యు.యన్.డి.పి. సి.డి.ఎల్..జి ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్రీ సంజీవ్ శర్మ, చత్తీష్‌గఢ్ రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా నిర్వహించిన సామర్థ్యాల అంచనాపై ప్రజెంటేషన్ చేశారు.

పంచాయతీరాజ్ ప్రజాప్రతినిధుల సామర్థ్యాల పెంపుదల కోసం బి.ఆర్.జి.ఎఫ్ / ఆర్.జి.ఎస్.వై శిక్షణా కార్యక్రమాలను జాతీయ సామర్థ్యాల పెంపుదల ఫ్రేమ్‌వర్క్ (NCBF) ప్రకారం అమలుచేయడంలో ముందంజలో ఉన్న అపార్డు సంస్థ అనుభవాలను అపార్డు కమీషనర్, ఫణికుమార్ పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. వర్కుషాపులో పాల్గొన్న వారందరూ అపార్డులో ఏర్పాటుచేసిన వీడియోకాన్ఫరెన్స్ సదుపాయం వినియోగాన్ని ప్రత్యక్షంగా చూసి అపార్డు అనుసరిస్తున్న పద్ధతిని మెచ్చుకున్నారు. సాప్‌నెట్ ద్వారా వారం వారం ప్రసారమవుతున్న గ్రామ వికాసం శిక్షణా కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయోనన్న విషయాన్ని ఫ్యాకల్టీ సభ్యులు శ్రీమతి శారదాదేవితో నేరుగా టెలిఫోన్‌ద్వారా సంప్రదించి తెలుసుకున్నారు. వివిధ రాష్ట్రాలలో పంచాయతీరాజ్ ప్రతినిధులు, సిబ్బందికోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కృషిని గూర్చి రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు వివరించారు. ఈ వర్కుషాపులో ఒరిస్సా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ, శ్రీ యస్.ఎన్.త్రిపాఠి, జార్ఖండ్ పంచాయతీరాజ్, డైరక్టర్, శ్రీ గణేష్ ప్రసాద్, ఉత్తర్ ప్రదేశ్, పంచాయతీరాజ్ ఉపసంచాలకులు, శ్రీ బి.సి.పంత్, రాజస్థాన్, ఎన్.ఐ.ఆర్.డి. నుండి ప్రొ.యోగేందర్ సింగ్‌పూనియా, బీహార్ పంచాయతీరాజ్ సహాయ సంచాలకులు, శ్రీ సురేంద్ర ప్రసాద్ , ఇర్మా, ప్రొ.డా.కజిరీ మిశ్రా, కీలా నుండి ప్రొ. రతన్ రాజ్, యు.యన్.డి.పి ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీమతి రీతూ మాథుర్, ఆస్కీ నుండి ప్రొ. సురేందర్ రెడ్డి, రామన్ డవలప్‌మెంట్ సంస్థ నుండి శ్రీ రాజేందర్‌జానీ, ఎన్.ఐ.ఆర్.డి. నుండి డా॥ ఆర్.ఎన్.ప్రసాద్, ప్రొ.జయలక్ష్మి, ప్రొ.సారుమతి, అపార్డ్ జాయింట్ డైరెక్టర్, శ్రీ మహ్మద్ తఖియుద్దీన్, సి.డి.పి.ఎ సెంటర్ హెడ్, ప్రొ.ఆర్.సూర్యనారాయణ రెడ్డి, సి.యు.ఎమ్. సెంటర్ హెడ్, ప్రొ.రఘునాధ రెడ్డి, సి.డబ్ల్యు.యస్. సెంటర్ హెడ్, కె.వెంకటకృష్ణ ఇతర ఫ్యాకల్టీ సభ్యులు డా.దీపానాయర్, డా.శివ శంకర ప్రసాద్ పాల్గొన్నారు. ఈ వర్కుషాపులో పాల్గొన్న అధికారులు, విద్యావేత్తలు బృందాలుగా విడిపోయి ప్రజాప్రతినిధుల సామర్థ్యాల అంచనా ప్రక్రియకు సంబంధించిన విజన్, మిషన్, ఉద్దేశ్యాలు వివిధ రాష్ట్రాల నుండి సేకరించాల్సిన సమాచార ప్రశ్నావళులు రూపొందించారు.




యు.యన్.డి.పి, పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖలచే ఎంపిక చేయబడిన మాస్టర్ రీసోర్స్‌పర్సన్స్ వారికి కేటాయించిన రాష్ట్రాలను ఒక నెలలోపు సందర్శించి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పంచాయతీ రాజ్ ప్రజాప్రతినిధులకు సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాలకు సంబంధించిన వివిధ అవకాశాలను పరిశీలించి తగు సూచనలు, సలహాలను అందజేస్తారు.

*- డా. శివ శంకర ప్రసాద్*



# పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించే ఆహారం



ఒక వ్యక్తి వ్యాధి నిరోధక సామర్థ్యం అతను శిశువుగా ఉన్నప్పటి పోషణపై, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి బాల్యదశ నుంచి వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడం చాలా ముఖ్యం. పిల్లలు పుట్టినప్పటి నుండి మంచి రోగ నిరోధక శక్తిని కలిగి ఉండేందుకు గర్భవతిగా ఉన్నప్పుడు తల్లికి లభించే పోషణపై ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా శిశువులకు రోగ నిరోధక శక్తి అంతగా ఉండదు. దీని ఫలితంగా అప్పుడే పుట్టిన బిడ్డలకు, తక్కువ బరువుతో పుట్టే బిడ్డలకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉంది. శిశు మరణాలలో 30 శాతం వరకు తక్కువ బరువుతో పుట్టిన శిశువులవే కావడం గమనార్హం. మొదటి నెల రోజుల కాలంలో శిశువుకు విరోచనాలు, ధనుర్వాతం వంటి వ్యాధులు తీవ్రమైన ప్రాణాంతక పరిస్థితికి దారి తీయవచ్చు. తొలి ఆరు నెలల కాలంలో శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, అనారోగ్య పరిస్థితులు రావచ్చు. 6 నెలల వయస్సు దాటిన తర్వాత నుంచి 2 సంవత్సరాల వయస్సు వరకు బిడ్డకు పోషకాహారలేమి ఒక ప్రధానమైన సమస్య కావచ్చు. తరచుగా జ్వరం రావడం, పొంగు చూపడం, దాని తరువాత ఏర్పడే క్లిష్ట పరిస్థితులు వంటివి కూడా బిడ్డను ప్రాణాపాయస్థితికి తేవచ్చు.

## ముర్రుపాలు అప్పుడే పుట్టిన బిడ్డకు కావలసిన పోషకాహారం

పిల్లల ఎదుగుదలకు కావలసిన అన్ని పోషకాంశాలు, రోగ నిరోధక శక్తి కూడా తల్లిపాల నుండి అందుతాయనడం నిస్సందేహం. అంటురోగాలను ఎదుర్కొనేందుకు కావలసిన శక్తి కూడా వాటికి పుష్కలంగా ఉంటాయి. ప్రసవించిన వెంటనే బిడ్డను తల్లిఎదపై బోర్ల పడుకోపెట్టినట్లయితే, తల్లి స్పర్శతో, బిడ్డ నెమ్మదిగా తనంతట తాను పాకుతూ వెళ్ళి తల్లి రొమ్మును చేరుకొని, తల్లిపాలు త్రాగడం ప్రారంభిస్తుంది. పుట్టిన ప్రతి బిడ్డ మొదటి గంటలో చాలా హుషారుగా ఉంటుంది. అటు పిమ్మట బిడ్డ నిద్రపోతుంది. తరువాత హుషారు కావడానికి సుమారు 40 గంటల కాలం పడుతుంది. కాబట్టి బిడ్డ పుట్టిన గంటలోపలే తల్లిపాలు ఇవ్వడం ప్రారంభించాలి. మొదటి ఆరు నెలల కాలం తల్లిపాలు మాత్రమే ఇప్పించాలి. ఆరు నెలలు నిండిన పిదప తల్లిపాలతో పాటు సురక్షితమైన, సరియైన, ఇంటిలో వండిన అదనపు ఆహారం ఇప్పిస్తూ తల్లిపాలు రెండు సంవత్సరాల వయస్సు వరకు వీలైతే ఇంకా ఎక్కువ కాలం ఇప్పించాలి.

పిల్లలకు వివిధ వయస్సుల్లో లభించే ఆహారాన్ని బట్టి వారి వ్యాధి నిరోధకశక్తి ఆధారపడి ఉంటుంది. కనుక పిల్లలకు సరైన పోషకాహారాన్ని అందించవలసిన బాధ్యతను తల్లిదండ్రులు సక్రమంగా నిర్వర్తించాలి. శిశువులకు నెలలు పెరుగుతున్న కొద్దీ తల్లిపాలు చాలవు అన్న వాస్తవం అందరు గ్రహించాలి. ఎందుకంటే ఈ సమయంలో శిశువు కదలికలు ఎక్కువవుతాయి. బరువు పెరుగుతుంది. ఈ కారణంగా శక్తి జనకాల అవసరం ఎక్కువ అవుతుంది. ఎందుకంటే పుట్టినప్పటి నుండి 6 నెలల వరకు వారికి 600 కిలో కేలరీల శక్తి జనకాలు, 11 గ్రాముల ప్రొటీనులు అవసరమవుతాయి. అలాగే ఏడవ నెల నుండి సంవత్సరం వరకు శక్తి జనకాల అవసరం 800 కిలో కేలరీల వరకు ఉండి, 13 గ్రాముల మాంసకృత్తులు తీసుకోవలసి వస్తుంది. అందువల్ల వారికి తొలి ఘనాహారం తప్పనిసరిగా ఆరు నెలలు పూర్తి చేసిన తరువాత తినిపించడం మొదలుపెట్టాలి.

పిల్లల్లో రోగ నిరోధక శక్తి ఉంటే, అది అనేక వ్యాధులు వారి శరీరానికి సోకకుండా కాపాడుతుంది. ముఖ్యంగా పిల్లల్లో క్షయ, పోలియో, కంఠసర్పి, ధనుర్వాతం, కోరింతదగ్గు, పొంగు, హెపటైటిస్ బి ద్వారా వచ్చే కాలేయ సంబంధ వ్యాధులు మొదలైనవి వారిని అంగ వైకల్యానికి, అర్థాంతర మరణాలకు గురి చేస్తున్నాయి. కాబట్టి పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడానికి భారత ప్రభుత్వం సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని మొదలు పెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా పుట్టిన వెంటనే లేదా ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా బిసిజి టీకాను, పోలియో చుక్కలను ఇప్పించాలి. మొదటి నెలలో డిపిటి, పోలియో, హెపటైటిస్ బి మొదటి డోసు ఇప్పించాలి. తిరిగి రెండవ, మూడు నెలలలో కూడా డిపిటి, పోలియో, హెపటైటిస్ బి డోసులు ఇప్పించాలి. తరువాత 9వ నెలలో తట్టు టీకా ఇప్పించాలి. అలాగే విటమిన్ ఎ మొదటి డోసు (100000 ఐ.యు విటమిన్ ఎ), తట్టు టీకాతో పాటు, 2వడోసు (200000 ఐ.యు. విటమిన్ ఎ) 18 నెలల వయస్సులో డి.పి.టి/ఓ.పి.వి బూస్టర్‌తో పాటు, తక్కిన 3 డోసులు (200000 ఐ.యు. విటమిన్ ఎ) ఆరు నెలల ఎడంతో ఏడాదికి 2 సార్లు, బిడ్డకు మూడేళ్ళు నిండే సరికి మొత్తం 5 డోసులు విటమిన్ ఎ ద్రవం ఇప్పించాలి. సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం వల్ల వారిలో 7 ప్రాణాంతక వ్యాధుల నుండి తట్టుకొనే శక్తి పెంపొందుతుంది. అలాగే విటమిన్-ఎ ను కూడా అందివ్వడం వలన పోషకాహార లోపం వలన వచ్చే అంధత్వాన్ని నివారించడమే కాకుండా పిల్లలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. ప్రతి టీకాకు పూర్తి కోర్సు ఇప్పించాలి. ఎప్పుడైనా, ఏ కారణం వల్లనైనా శిశువుకి ఒక టీకా ఇప్పించని పక్షంలో ఎంత తొందరగా వీలయితే అంత తొందరగా ఆ టీకాని ఇప్పించాలి. కొద్దిపాటి జ్వరం, జలుబు, దగ్గు, అతిసారం వున్నప్పటికీ, పిల్లలకు టీకాలు ఇప్పించాలి.

పిల్లలకు వివిధ వయస్సులో లభించే ఆహారాన్ని బట్టి వారి వ్యాధి నిరోధక శక్తి ఆధారపడి ఉంటుంది. కనుక పిల్లలకు సరైన పోషకాహారాన్ని అందించవలసిన బాధ్యతను తల్లిదండ్రులు సక్రమంగా నిర్వర్తించాలి. ఎదిగే పిల్లలకు ఏమి కావాలో, వారికి ఎటువంటి ఆహారం ఇవ్వాలో తెలుసుకోవలసిన అవసరం తల్లిదండ్రులది. తల్లులకు పిల్లల పోషకాహారం పట్ల అవగాహన ఏర్పడితే, పిల్లల

తరువాయి భాగం - 40వ పేజీలో...



# జీవరాశులు పదికోట్లు...

## భూమి ఒక్కటే... భవిష్యత్తూ ఒక్కటే...

**ఎంతో సుందరమైన గ్రహం మనది. సముద్రాలు, నదీనదాలు, సెలయేళ్ళు, వాగులు వంకలు, పర్వతాలు, మంచుకొండలు, పచ్చని చెట్లు, పొదలు, పూలవనాలు, ఎడారులు, ఎండమావులు, వాటి మధ్య ఎన్నో జీవరాశులు. ఈ సువిశాల, అనంతమైన విశ్వంలో ఇంతకంటే వైవిధ్య భరితమైన, అందమైన మరో గ్రహం ఉంటుందంటే నమ్మబుద్ధికాదు. ఇప్పటి వరకు మనకు ఆనవాళ్లు, ఆధారాలూ దొరకలేదు.**

**అటువంటి అరుదైన ఈ భూమిపై ఎన్ని జీవరాశులున్నాయో చెప్పగలరా? మనిషి తనకున్న పరిమిత జ్ఞానంతో, పరిమితమైన వనరులతో, తనకు అందుబాటులో ఉన్న సమయంతో, ఇప్పటివరకు 18 లక్షల జీవరాశులను మాత్రమే గుర్తించాడు. మొత్తం 10 కోట్ల వరకు ఉన్నాయని అంచనా.**

ఈ 10 కోట్ల జీవరాశుల్లో మనిషి ఒక జీవి. కాని విచిత్రం, దౌర్భాగ్యం, అభ్యంతరకరం, అమానుషం, క్రూరం ఏమిటంటే, ప్రకృతిని తన చేతుల్లోకి తీసుకుని యధేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్న మనిషి మిగతా 10 కోట్ల జీవరాశుల భవితవ్యాన్ని నిర్దేశిస్తున్నాడు, నియంత్రిస్తున్నాడు, నిర్దయగా అంతం చేస్తున్నాడు. ప్రకృతి గురించి తనకు తెలిసింది చాలా తక్కువైనా, తెలియనిది ఎంతో ఉన్నా, ప్రకృతితో, దానిపై ఆధారపడి బతికే జీవులతో చెలగాటం ఆడుకుంటున్నాడు.

భూమిపై 10 కోట్ల జీవరాశులుంటే, ఇని లక్షల సంవత్సరాలుగా మనిషి కేవలం 18 లక్షల జీవులను మాత్రమే గుర్తించగలిగాడంటే, మనిషి శక్తి ఏపాటిది! గుర్తించలేని కోటానుకోట్ల జీవుల ప్రస్తుత పరిస్థితి ఏమిటో, అవి ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సవాళ్ళు, ప్రమాదాలు ఏమిటో తెలిసేదెప్పుడు? వాటిని కాపాడేదెప్పుడు?

ఇప్పటివరకు గుర్తించగలిగిన 18 లక్షల జీవరాశుల్లో 17,291 జీవరాశులు నశించి పోయే ప్రమాదం ఉన్నట్లు మనం









తెలుసుకోగలిగాం. మనకు తెలియకుండా ఇంకా అనేక జీవులు మనుగడ ప్రమాదాన్ని ఎదుర్కొంటుండవచ్చు. ఈ 17,291 జీవుల్లో మనకు అంతగా తెలియని మొక్కలు, క్రిమికీటకాలనుంచి మనను ఎంతగానో మురిపించే పక్షులు, క్షీరదాల వరకు ఉన్నాయి. ఉన్న వాస్తవ పరిస్థితిలో ఇది కొండంతలో గోరంత వంటిది మాత్రమే. చాలా జీవులను కనుగొనేలోపుగానే అవి మాయమయి పోతున్నాయి.

ఈ విపత్కర పరిస్థితికి కారణం ఏమిటి? మన (మానవులు) కార్యకలాపాలే. మనం అభివృద్ధి పేరిట చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా ముందున్న అడవుల్లో చాలా భాగాన్ని మనం ఖాళీ చేసేశాము. ప్రపంచంలోని తడి భూములను సగంపైగా ఎండబెట్టేశాము. మత్స్య సంపదలో మూడొంతులు ఖాళీ చేసేశాము. అనేక శతాబ్దాల పాటు భూగ్రహం వేడెక్కుతూ ఉండటానికి అవసరమైన, ప్రమాదకరమైన వాయువులను భూవాతావరణంలోకి ఇప్పటికే వదిలిపెట్టేశాము. వేడిని నిలిపి ఉంచటం ఈ వాయువుల ప్రత్యేకత.

సాధారణంగా సహజ క్రమంలో, పరిణామ క్రమంలో కొన్ని జీవులు అంతరిస్తుంటాయి. మనం అభివృద్ధి అనే 'యాక్సిలరేటర్' పై కాలు పెట్టి నొక్కుతుండటంతో అంతరించటంలో సహజక్రమం వేగం కంటే 1000 రెట్లు వేగంగా జీవరాశులు అంతరించిపోతున్నాయి.





తత్ఫలితంగా, మన మనుగడకే ఆధారభూతమైన పునాదులనే మనం దెబ్బతీసుకుంటున్నాం. ఈ భూమ్మీద ఉన్న అనంతమైన జీవరాశుల్లో వైవిధ్య భరితమైనవి ఎన్నో ఉన్నాయి. దీన్నే 'జీవ వైవిధ్యం' అంటున్నాం. ఈ జీవ వైవిధ్యం వల్లనే మనకు ఆహారం, బట్టలు, ఇంధనం, మందులు, ఎన్నో..., మరెన్నో, లభిస్తున్నాయి.

మీరనుకోవచ్చు. మీ పెరటిలోనో, రోడ్డు పక్క మొక్కలపైనో వాలి ఉన్న ఒక తుమ్మెదకు, మీ జీవితానికి మధ్య మౌలికమైన అనుబంధం ఏమీ ఉండదని. కాని ఎంతో కీలకమైన బంధం ఉంది. అత్యంత సంక్లిష్టంగా ఉన్న జీవుల సాలెగూడు నుంచి చివరికి ఒక జీవి మాయమైపోయినా, ఫలితాలు దారుణంగా ఉంటాయి. ఆ దుష్ప్రభావం మిగిలిన జీవులపై పడుతుంది.

జీవ వైవిధ్యానికి ఇంత ప్రాధాన్యత ఉండబట్టే, ఐక్యరాజ్యసమితి ఈ ఏడాది (2010)ని అంతర్జాతీయ జీవవైవిధ్య సంవత్సరంగా ప్రకటించింది. ప్రతి ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో ఈ సారి "అనేక జీవులు.... ఒక భూమి... ఒక భవిష్యత్తు" అనే థీమ్‌ని పాటించాలని ఐక్యరాజ్య సమితిలోని పర్యావరణ కార్యక్రమ విభాగం (యుఎన్ఇపి) నిర్ణయించింది.

మానవాళి సౌభాగ్యానికి జీవవైవిధ్యం ఎంత అవసరమో తెలియజేయటానికి, దాన్ని కాపాడటంలో ఇప్పటివరకు మనం సాధించిన విజయాలను పేర్కొనడానికి, జీవవైవిధ్యానికి కలుగుతున్న నష్టం రేటును తగ్గించటానికి మనం చేసే ప్రయత్నాలు, కృషి మరింత పెంచేలా ప్రోత్సహించటానికి ఈ థీమ్‌ని ఐక్యరాజ్య సమితి ఎంపిక చేసింది.



అరుదైన భూగ్రహంపై అంతకంటే అపురూపంగా ఉన్న

జీవవైవిధ్యాన్ని కాపాడటానికి ఐక్యరాజ్య సమితి ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అత్యవసరంగా పిలుపునిస్తోంది. జీవవైవిధ్యం లేని ప్రపంచం మనుగడ సాగించలేదు. కోట్లాది మంది ప్రజలు, మొక్కలు, జీవులు ఒకే గ్రహంపై జీవిస్తున్నాయి. ఈ జీవరాశులన్నీ నశించకుండా మనుగడ సాగిస్తేనే, సమిష్టిగా మాత్రమే మరింత సురక్షితమైన, సంపన్నమైన భవిష్యత్తును అందుకోగలవు.



## జీవవైవిధ్యానికి జరుగుతున్న నష్టం అపారం

భూగ్రహం పై ఉన్న జీవరాశులు ఎన్ని రకాలున్నాయనే విషయంపై మనిషికి ఏమాత్రం అవగాహన ఉందో, ప్రతిరోజు అంతరించిపోతున్న జీవరాశుల గురించి కూడా అంతంత మాత్రమే అవగాహన ఉంది. శాస్త్రజ్ఞుల అంచనాల ప్రకారం, ప్రతి 24 గంటల్లో సుమారు 150 నుంచి 200 రకాల వరకు జీవరాశు లు అంతరించిపోతున్నాయట.



భూమి చరిత్రలో జీవులు అంతరించిపోవటమే ప్రక్రియ ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. అయితే, గత 6.5 కోట్ల సంవత్సరాల్లో భూమిపై ఎప్పుడూ ఇంత వేగంగా జీవరాశులు నశించిపోలేదు. డైనోసార్లు మాయమై పోయినప్పటి నుంచి చూసినా, ఇప్పుడు చాలా వేగంగా జీవుల అంతర్ధానం జరుగుతోంది.

ఉత్పత్తి, వినియోగం వంటి విషయాల్లో అస్థిరమైన అభివృద్ధి నమూనా విధానాలను మనం అవలంబిస్తున్నందువల్లనే ఇంత వేగంగా జీవరాశులు నశించిపోతున్నాయి. జీవుల ఆవాసాలను నాశనం చేయటం, నగరాలకు విస్తరించటం, కాలుష్యాన్ని పెంచడం, అడవులు నరికి వేయటం, భూతాపాన్ని పెంచడం వంటి చేష్టల ద్వారా మనమే ఈ విపత్కరపరిస్థితిని చేజేతులా తెచ్చుకున్నాం.

జీవవైవిధ్యానికి వాతావరణ మార్పులు పెనుసవాలు విసరబోతున్నాయని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తోంది. భూగ్రహపు సగటు ఉష్ణోగ్రత 1.5 నుంచి 2.5 సెల్సియస్ డిగ్రీలకు పెరిగినట్లయితే, ఇప్పటివరకు గుర్తించిన జీవరాశుల్లో (మొక్కలు, జంతువులు, సహా) 20 నుంచి 30 శాతం అంతరించి పోతాయని కూడా హెచ్చరిస్తోంది. ఎందుకంటే, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జీవవైవిధ్యం మనం క్షేమంగా ఉండటానికి దోహదపడుతుంది. ఉదాహరణకు మన ఆరోగ్యానికి అవసరమైన ముడిపదార్థాలు



జీవవైవిధ్యం వల్లనే మనకు లభిస్తాయి. ప్రపంచ జనాభాలో 60 శాతంపైగా ప్రజలు తమ మందుల కోసం మొక్కలపై ప్రత్యక్షంగా ఆధారపడుతున్నారు.



గత శతాబ్దకాలంగా, సహజమైన పర్యావరణ వ్యవస్థలను వ్యవసాయ భూములుగా మార్చటం వల్ల, జీవవైవిధ్యం అందించే ప్రయోజనాల వల్ల అనేకమంది ప్రజలు లాభపడ్డారు. అయితే, జీవవైవిధ్యాన్ని కోల్పోవటం వల్ల సమాజానికి మొత్తం కలిగే నష్టం ఇంతకు ఎన్నో రెట్లు ఉంటుంది.

## మన చేతుల్లో ఉన్నది మనం చేద్దాం !

ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యక్తిగతంగా ఎవరికి వారు జీవ వైవిధ్యాన్ని కాపాడటానికి ప్రతిన పూనాలి. మనకు సాధ్యమైన వాటిని మనం పాటించినప్పటికీ, జీవ వైవిధ్యానికి అది దోహద పడుతుంది.

తక్కువ వినియోగం ద్వారా భూమి వనరులను మనం కాపాడగలం. హరిత మార్గం అందరూ అనుకునేంత కష్టంమేమీ కాదు. పొద్దున్నే లేచినప్పటి నుంచి రాత్రి పడుకోబోయే వరకు మనం అనేక అంశాలను పాటించి భూమి హరితదానాన్ని రక్షించవచ్చు.

- ఒక మొక్క నాటుదాం. ఐక్యరాజ్య సమితి లోని పర్యావరణ కార్యక్రమ విభాగం గత ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ఏడాది చివరికల్లా 700 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం. ప్రపంచంలో ఉన్న మొత్తం 700 కోట్ల జనాభాకు ఒక్కొక్కరికి ఒక మొక్క వంతున మొత్తం 700 కోట్ల మొక్కలు నాటాలనేది లక్ష్యం. ఇప్పటికి 300 కోట్ల మొక్కలను ప్రపంచ వ్యాప్తంగా పలు చోట్ల నాటారు. మరో 500 కోట్లు నాటవలసి ఉంది. కాబట్టి, ఈ అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవమైన జూన్ 5న మొక్కలు నాటే పని చేపడుదాం.
- మనకు అక్కరలేని వస్తువులను అవతల పారవేసే బదులు, అవి అవసరమైన వారికి గానీ, ధర్మసంస్థలకు కానీ, అనాధాశ్రమాలకు కాని ఇద్దాం.
- నీరు, విద్యుత్తు, ఇంధనం వంటి అన్ని వనరులను పొదుపుగా వాడుకుందాం.

## అసలు జీవ వైవిధ్యం అంటే ఏమిటి ?

భూమిపై నివశించే జీవరాశుల సంఖ్య, వాటి భిన్నత్వం, కాలానుగుణంగా అవి ఒక చోటినుంచి ఒక చోటికి మారటం వంటివన్నీ జీవవైవిధ్యం కిందకు వస్తాయి. ఈ జీవవైవిధ్యం వల్ల మనకు ఆహారం, శుభ్రమైన నీరు, కలప, పీచు, ఇతర పదార్థాలు లభిస్తున్నాయి. అంతేకాక వాతావరణం, వరదలు, వ్యాధులు, నీటి నాణ్యత వంటివన్నీ నియంత్రితమవుతున్నాయి.

ఇదే విధంగా మన కార్యకలాపాలు కొనసాగితే, 2050 నాటికి వ్యవసాయ భూమి మరింత విస్తరించి అడవులు మరింత కుంచించుకుని పోతాయి. ప్రత్యేకించి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో. తద్వారా స్థానికంగా, విశ్వవ్యాప్తంగా జీవ వైవిధ్యం దెబ్బతింటుంది. జీవ వైవిధ్యానికి నష్టం వాటిల్లటం వలన ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజలపై దుష్ప్రభావం పడుతుంది. వరదలు, కరువులు, అడవుల్లో మంటలు వ్యాపించటం, వ్యాధుల విజృంభణ వంటివి ప్రత్యక్ష ప్రభావాలు. చాలీచాలని ఆహారం, నీరు వంటి సమస్యల వల్ల వచ్చే తగాదాలు, ఘర్షణలు పరోక్షంగా మనను దెబ్బతీస్తాయి.

జీవవైవిధ్యం మన మనుగడకు ఎంత కీలకమైనదో ఎంత చెప్పినా తక్కువే. వ్యక్తిగతంగా, సమాజపరంగా, ప్రభుత్వాల పరంగా, అంతర్జాతీయంగా బహుముఖ చర్యలు తీసుకోవటం ద్వారా జీవరాశులను, తద్వారా జీవ వైవిధ్యాన్ని కాపాడాలని కంకణం కట్టుకున్నప్పుడే, కఠోర నిర్ణయం తీసుకుని కార్యాచరణకు సిద్ధమైనప్పుడే మన మనుగడకాని, భూమి మనుగడకాని ఆశావహం కాగలదు. *– గొట్టిపాటి సుజాత*





# కొలువు తీరిన

మే 8వ తేదీన సెంటెనరీ రోజ్‌పార్క్‌లో రోజ్‌షో జరిగింది. ఇది టూరిస్టులను ఎంత ఆనందోత్సాహాలలో ముంచిదో! ఖాదీ బోర్డు శాఖా మంత్రి ఆర్. రామచంద్రన్ దీన్ని ప్రారంభించారు.

**మం**డే ఎండల్లో మనమిక్కడ మండిపోతూ ఉంటే, అక్కడేమో ఈ సుమబాలలు అందంగా, ఆహ్లాదంగా కొల ంవుతీరాయి చూడండి. మే నెల రావటం ఆలస్యం - ప్రతి ఏ టా తమిళనాడులోని ఊటీలో 'వేసవి ఉత్సవం' జరుగుతుంది. ఈ ఉత్సవంలో భాగంగా ఈ ఏడాది కూడా ఎన్నో కనువిందు దృశ్యాలు కళ్లముందు పరచుకున్నాయి.

# ఎంత మనోహరం ఈ సోయగాలు !









# పూల ఉత్సవం

మే 14 నుంచి మూడురోజుల పాటు ఊటీలోని ప్రభుత్వ బొటానికల్ గార్డెన్‌లో జరిగే పూల ప్రదర్శనను తమిళనాడు గవర్నర్ సూర్జిత్‌సింగ్ బర్నాలా ప్రారంభించారు. కేంద్ర ఐటి, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఎ.రాజా, రాష్ట్ర న్యాయశాఖ మంత్రి దురై మురుగన్, రాష్ట్ర ఖాదీ బోర్డు శాఖా మంత్రి ఆర్.రామచంద్రన్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

అంతేకాదు. మే 9 నుంచి 17 తేదీల మధ్య రకరకాల నాటక, నృత్య, సంగీత కార్యక్రమాలు ఇక్కడి బ్రీక్స్ హెచ్ఎడిపి ఓపెన్ స్టేడియంలో జరిగాయి. 18వ తేదీన కలెక్టరేట్ నుంచి బోట్ హౌస్ వరకు సైకిల్ ర్యాలీ, మే 19న అసాధారణ బైకింగ్ విన్యాసం కూడా జరిగాయి. 24న వింటేజ్ కార్ ర్యాలీ జరిగింది. ఇక ఊటీ సరస్సు











అయితే మే 11న బోట్‌రేస్‌కి వేదికైంది. మే 13న పడవల ప్రదర్శన జరిగింది. మే 22,23 తేదీల్లో, కూనూర్‌లోని సిమ్స్ పార్క్‌లో పండ్ల ప్రదర్శన జరిగింది. గుడలూర్‌లో మే 27, 28 తేదీల్లో సుగంధ ద్రవ్యాల ప్రదర్శన జరిగింది. అంతేకాదు, హార్టికల్చర్ కాంప్లెక్స్‌లో మే 8 నుంచి 10 రోజులపాటు ఫొటో ప్రదర్శన జరిగింది.

ఈ సంవత్సరం మాత్రమే ఈ వేడుకలు కొత్త కాదు. మే నెల వచ్చిందంటే చాలు నెల రోజుల పాటు ఊటీలో సందడే సందడి. మండే ఎండలను భరించలేక, చల్లగా, హాయిగా గడపటం కోసం సందర్శకులు తండోప తండాలుగా ఊటీకీ వచ్చేస్తారు. వీరికి ఊటీ సందర్శన మరింత హాయిగా, ఆహ్లాదకరంగా, కనుల విందుగా ఉండేందుకు ప్రభుత్వం సకల ఏర్పాట్లు చేస్తుంది. రకరకాల ఉత్సవాలను, వేడుకలను, కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ఏడాది పొడవునా సందర్శకులు ఊటీకి వస్తూనే ఉంటారు. అయితే, వేసవి వారికి మరింత ఆకర్షణ. వేసవిలో దొరికే చల్లదనం ఒక ఆకర్షణ అయితే, ఈ వేడుకలన్నీ మరెన్నో ఆకర్షణలు కల్పిస్తాయి.

అన్నిటిలో పూల ప్రదర్శన అత్యద్భుతంగా ఉంటుంది. వందల రకాల పూలు ఇక్కడ కొలువుతీరుతాయి. ఆ దృశ్యాలు కళ్లారా చూడాలే కాని, ఎంత వర్ణించినా తక్కువే. ఊటీలో జరిగే మొత్తం వేసవి ఉత్సవానికే ఇది వన్నె తెస్తుంది.

ఒకవైపు పూల ప్రదర్శనలు, పండ్ల ప్రదర్శనలు, పడవ పందాలు, ఇతర ప్రదర్శనలు కళ్లకు విందవుతుంటే, మరో వైపు రకరకాల నాటక, నృత్య, సంగీత కార్యక్రమాలు వీనులకు విందవుతాయి. ఊటీని హోరెత్తిస్తాయి.

















సాంప్రదాయికమైన, శాస్త్రీయమైన కళాప్రదర్శనలకు కూడా ఊటీ ఇప్పుడు కేంద్రమవుతుంది. సాహసక్రీడలంటే ఇష్టపడే వారికి అందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా ఉంటాయి. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలూ జరుగుతుంటాయి. మరియమ్మన్ ఆలయంలో కూడా ఆలయ ఉత్సవం జరుగుతుంది. బొక్కాపురం మరియమ్మన్ ఆలయం, కూనూరు మరియమ్మన్ ఆలయాల్లో కూడా స్థానిక వారసత్వం, సాంప్రదాయాలు ప్రతిఫలించే వేడుకలు నిర్వహిస్తారు.

ఊటీలో విస్తారంగా దొరికే పూలు, పండ్లు, టీ మొదలైన ప్రకృతి ప్రసాదితాలను ఆనందంగా ఎంజాయ్ చేసేలా వేడుకలను రూపొందిస్తారు. ఊటీలో చిక్కనైన పచ్చి టీతోటలు విస్తారంగా పరచుకుని ఉన్నాయి. అత్యంత నాణ్యమైన పండ్లకు, అందమైన పూలకు కూడా ఊటీ వేదికే.

ఊటీలో పూల ప్రదర్శన అసలు 1896లోనే అంటే 114 సంవత్సరాల క్రితమే ప్రారంభమైంది. పూల ప్రేమికులకు, పూల పెంపకం దార్లకు, వ్యవసాయదార్లకు పూలపట్ల అవగాహన కల్పించటమే ఈ ప్రదర్శన ఉద్దేశ్యం. సందర్శకులకు పరవశింపచేయటం మరో ప్రధాన లక్ష్యం. ఆ పూలను కూడా రకరకాల ఆకారాలలో అందంగా అమరుస్తారు.

1979 వరకు పూల ప్రదర్శనను నీలగిరి అగ్రి-హార్టికల్చరల్ సొసైటీ నిర్వహించింది.

1980 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ బాధ్యత తీసుకుని మరింత పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది. 1995లో ఊటీలోని బొటానికల్ గార్డెన్స్‌లో శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూల ప్రదర్శన జరిగింది. 150 పైగా పూలరకాలను అప్పుడు ప్రదర్శించారు. దొడ్డబెట్ట శిఖరపు సానువుల్లో 50 ఎకరాలకు పైబడి విస్తరించి ఉండే బొటానికల్ గార్డెన్స్‌ను పూల ప్రదర్శన జరిగేటప్పుడు చూడటం అత్యంత మనోహర దృశ్యం.

- రాధాకృష్ణ





# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి 'పురా'

భారతదేశంలో సుమారు 6 లక్షల గ్రామాలున్నాయి. మన దేశంలోని దాదాపు 70 శాతం జనాభా గ్రామాల్లోనే నివశిస్తున్నారు. దేశం సమగ్రంగా, సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే, గ్రామాలు అభివృద్ధి ప్రక్రియలో కీలక పాత్ర పోషించవలసి ఉంది.

మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పన వంటి ప్రయత్నాల ద్వారానే ఈ గ్రామాలు సంపన్నమవుతాయి. నగరాలకు వెలుపల ఉన్న గ్రామాలలో నగరంలో ఉండే మౌలిక సదుపాయాలను, సేవలను కల్పించాలని 'పురా' (గ్రామీణ ప్రాంతాలలో పట్టణ సదుపాయాల కల్పన - `Provision or Urban Amemities in Rural Areas) ప్రతిపాదిస్తోంది. తద్వారా నగరాల బయట కూడా ఆర్థిక అవకాశాలు లభిస్తాయనేది ఈ పథకం వెనుక భావన.

విజ్ఞాన సమాజాన్ని తయారు చేయాలనే భావనతో, 2020 నాటికల్లా భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా చూడాలనే కలతో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ 'పురా' పథకాన్ని రూపొందించారు.

దేశ జనాభాలో మూడింట రెండు వంతులు గ్రామాల్లోనే నివశిస్తున్నందున, ఈ జనాభాకు సాధికారత అందించనిదే దేశాన్ని 'అభివృద్ధి చెందిన దేశం'గా చూడలేమని డాక్టర్ అబ్దుల్ కలామ్ భావన.








గ్రామీణ భారతదేశం 'అనుసంధానం' (కనెక్టివిటీ) కొరతతో కునారిల్లు తున్నదని డాక్టర్ కలామ్ ఉద్దేశ్యం. భౌతిక అనుసంధానం (అధ్వాన్న స్థితిలో ఉన్న రోడ్లు, చాలీచాలని రోడ్లు). ఎలక్ట్రానిక్ అనుసంధానం (ఆధారపడలేని, చాలీచాలని కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు), విజ్ఞాన్ అనుసంధానం (వృత్తి పరమైన, వృతి విద్యా పరమైన కళాశాలలు, శిక్షణా సంస్థల కొరత) ఆర్థిక అనుసంధానం మొదలైనవి దీని కిందకు వస్తాయి. ఈ నాలుగు కొరతలను సరిదిద్దినట్లయితే, గ్రామాల్లో ఆర్థిక అనుసంధానం జరుగుతుందని డాక్టర్ కలామ్ విశ్వాసం.

అంతేకాక, రోడ్ల సదుపాయాలను కల్పించటం ద్వారా భౌతిక అనుసంధానాన్ని, నమ్మకమైన కమ్యూనికేషన్ల నెట్‌వర్క్‌ని కల్పించటం ద్వారా ఎలక్ట్రానిక్ అనుసంధానాన్ని, మంచి వృత్తి విద్యా కళాశాలలను, శిక్షణ కేంద్రాలను కల్పించటం ద్వారా విజ్ఞాన అనుసంధానాన్ని ఏర్పాటు చేయాలని, తిరిగి ఈ మూడు అనుసంధానాలను సరైన విధంగా అనుసంధించాలని డాక్టర్ కలామ్ ఉద్ఘాటిస్తారు. అప్పుడా పరిస్థితి ఆర్థిక అనుసంధానానికి, సంపదకు దారితీస్తుందని ఆయన అంటారు. ఈ కారణాల దృష్ట్యా, 'పురా' భౌతిక, ఎలక్ట్రానిక, విజ్ఞాన, ఆర్థిక అనుసంధానాలను ప్రతిపాదిస్తోంది. గ్రామాల సముదాయాలు సుస్థిరమైన అభివృద్ధి సాధించాలంటే, ఇది అవసరమని భావిస్తున్నారు.

## 'పురా' అమలు

గ్రామీణ ప్రాంతాల్లో మొదటిసారిగా 'పురా'ను ప్రయోగాత్మక ప్రాతిపదికన చేపట్టేందుకు ప్రభుత్వం చొరవ తీసుకుని ముందుకు



వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి అవకాశాలను, పట్టణ సదుపాయాలను కల్పించడానికి ఈ పథకాన్ని రూపొందించింది. అంతేకాకుండా, గ్రామాలు పట్టణాల మధ్య అంతరాన్ని తొలగించి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలను తగ్గించాలనేది ఈ పథకం లక్ష్యం.

11వ పంచవర్ష ప్రణాళికలో ఈ పథకానికి 248 కోట్ల రూపాయలు కేటాయించారు. గ్రామ పంచాయితీలు, ప్రైవేటు రంగ సంస్థల భాగస్వామ్యంతో (పిపిపి విధానం అమలు చేయటం పథకంలోని ముఖ్య లక్షణం. 11వ పంచవర్ష ప్రణాళికలలో ఏడెనిమిది ప్రయోగాత్మక ప్రాజెక్టులను చేపట్టి, 'పురా'ను అమలు చేస్తారు. ఈ విధంగా ప్రయోగాత్మక ప్రాజెక్టులు అమలు చేయటం ద్వారా 'పురా' పథకాన్ని వాస్తవంగా పరిశీలించడానికి, భవిష్యత్తులో పథక విస్తరణకు గుణపాఠాలు నేర్చుకోవటానికి వీలవుతుందని భావిస్తున్నారు.

## వ్యూహం

ఎంపికైన ప్రైవేటు భాగస్వామి 'పురా' ప్రాజెక్టును అమలు పరుస్తారు. ఇందుకు గ్రామ పంచాయితీని లేక భౌతికంగా దగ్గరగా ఉండే కొన్ని గ్రామాల సముదాయాన్ని గుర్తిస్తారు. వీటి జనాభా సుమారు 25,000 నుంచి 40,000 మధ్య ఉండేలా చూస్తారు. గ్రామాల సముదాయం ప్రాజెక్టు ప్రాంతం కాగా, ప్రతి పంచాయితీలో అమలు చేయటానికి ఉప ప్రాజెక్టులను చేపడతారు.

ఇందుకు కావలసిన నిధులు కేంద్ర ప్రభుత్వ పథకమైన 'పురా' ద్వారా లభిస్తాయి. అదనంగా ప్రైవేటు రంగ భాగస్వామి నిధులను, నిర్వహణా మద్దతును, స్థానిక పంచాయితీల పాత్రను కూడా వినియోగించుకుంటారు.

### 'పురా' కింద కల్పించాల్సిన పట్టణ సదుపాయాలు, ఆర్థిక కార్యకలాపాలు

**గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పథకాల కింద తప్పనిసరిగా చేపట్టవలసిన కార్యకలాపాలు, కల్పించవలసిన సదుపాయాలు**

1) నీటి సదుపాయం, పారిశుధ్య సదుపాయం

2) గ్రామీణ వీధుల నిర్మాణం, నిర్వహణ

3) డ్రెయినేజ్

4) ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ



5) నైపుణ్యాల అభివృద్ధి

6) ఆర్థిక కార్యకలాపాల అభివృద్ధి

**గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ కాకుండా, ఇతర శాఖల పథకాల కింద చేపట్టవలసిన సదుపాయాలు**

7) గ్రామ వీధుల్లో లైటింగ్

8) టెలికమ్యూనికేషన్లు

9) విద్యుదుత్పాదన, మొదలైనవి.

**ఆదాయం కోసం, ప్రజల కోసం చేపట్టాల్సిన అదనపు ప్రాజెక్టులు**

10) గ్రామీణ అనుసంధాన పర్యాటకం

11) సమీకృత గ్రామీణ సముదాయం, గ్రామీణ మార్కెట్లు

12) అగ్రి, ఇతర సర్వీసుల

13) గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ఇతర ప్రాజెక్టులు

## గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పథకాల కింద కల్పించాల్సిన సదుపాయాలు

నీటి సదుపాయం, పారిశుద్య సదుపాయం, గ్రామీణ వీధుల నిర్మాణం, నిర్వహణ, డ్రెయినేజ్, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి ఆర్థిక కార్యకలపాల అభివృద్ధి మొదలైన వాటిని ప్రైవేటు భాగస్వామి కల్పించవలసి ఉంది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అమలు చేస్తున్న స్వర్ణజయంతి గ్రామ స్వరోజ్‌గార్ యోజన (ఎస్‌జిఎస్‌వై), జాతీయ గ్రామీణ మంచినీటి పథకం (ఎన్ఆర్‌డిడబ్ల్యుపి) సంపూర్ణ పారిశుద్ధ్య పథకం (టిఎస్‌సి) మొదలైన పథకాల కింద వీటిని చేపట్టవచ్చు. ఈ పథకాల అనుసంధానాన్ని జిల్లా స్థాయిలోని డిఆర్‌డిఎల స్థాయిలో జరపవచ్చు. అప్పుడు ఈ పథకాల కింద డిఆర్‌డిఎ నిధులను మంజూరు చేస్తుంది.

## ఇతర మంత్రిత్వ శాఖల పథకాల కింద కల్పించే సదుపాయాలు

గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోకి రాని, ఇతర మంత్రిత్వ శాఖల్లో అమలవుతున్న పథకాలను కూడా 'పురా' ప్రాజెక్టు అమలులో



చేపట్టవచ్చు, ఉదాహరణకు, గ్రామీణ రోడ్లకు లైటింగ్ సదుపాయాలు, విద్యుదుత్పాదన సదుపాయాన్ని న్యూ రెన్యూయబుల్ ఎనర్జీ మంత్రిత్వశాఖ పరిధిలో చేపట్టవచ్చు, టెలికమ్ సర్వీసుల సదుపాయాన్ని కమ్యూనికేషన్స్, ఐటి మంత్రిత్వశాఖ పథకాల పరిధిలో కల్పించవచ్చు.

## అదనపు ప్రాజెక్టులు

గ్రామాల్లో కల్పించవలసిన పట్టణ సదుపాయాలకు అదనంగా ప్రజలకు ఉపాధి కల్పించే ప్రాజెక్టులను, ఆదాయాన్ని కల్పించే ప్రాజెక్టులను ప్రైవేటు భాగస్వామి చేపట్టవచ్చు, గ్రామ పంచాయితీ భాగస్వామ్యంలో వీటిని అమలుచేయాలి.

**1) గ్రామీణ పర్యాటక ప్రాజెక్టులు**

స్థానికులకు ప్రత్యక్ష ఉపాధిని కల్పించే పర్యాటక ప్రాజెక్టులను, స్థానిక కళాకారులను, వృత్తి నిపుణులకు ఆదాయాన్ని కల్పించే ప్రాజెక్టులను చేపట్టవచ్చు.

**2) నైపుణ్యాలను అభివృద్ధి పరిచే సంస్థను నెలకొల్పటం**

'పురా' ప్రాజెక్టులో భాగంగా చేపట్టే ఆర్థిక కార్యక్రమాలకు దీన్ని అనుసంధానిస్తారు.

**3) సమీకృత గ్రామీణ వ్యాపార కేంద్రాలు**

స్థానిక ఆర్థికవ్యవస్థ వాణిజ్య స్థాయికి అభివృద్ధి చెందడానికి ఈ





సమీకృత గ్రామీణ వ్యాపార కేంద్రాలు ఉపయోగపడతాయి.

## బిజినెస్ మోడల్

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను కల్పించి నిర్వహించడానికి ప్రైవేటు పెట్టుబడులు, నిర్వహణా సామర్థ్యాలను, ప్రభుత్వ నిధులను అనుసంధానించడమే 'పురా' పథకంలోని సారాంశం.

## 'పురా' నిధులు

**'పురా' పథకం కింద చేపట్టే ప్రాజెక్టులకు నిధులు నాలుగు రకాలుగా లభిస్తాయి.**

1. గ్రామీణాభివృద్ధి శాఖ అమలు చేసే పథకాలు
2. ఇతర మంత్రిత్వ శాఖలు అమలు చేసే పథకాలు
3. ప్రైవేటు పెట్టుబడులు
4. 'పురా' కింద గ్రాంట్లు

'పురా' కింద చేపట్టే ప్రతి ప్రాజెక్టు వ్యయం రూ.120 కోట్లకు మించరాదు.

## 'పురా' ప్రాజెక్టులకు భూమి

ప్రజల సౌకర్యాలకు గ్రామపంచాయితీ / రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా భూమిని అందజేస్తాయి. అదనపు సౌకర్యాలకు గ్రామ పంచాయితీ / రాష్ట్ర ప్రభుత్వం, భూమి కేటాయించి నట్లయితే, ఆదాయాన్ని గ్రామ పంచాయితీ, ప్రైవేటు భాగస్వామి పరస్పర ఒప్పందం ద్వారా తగిన



విధంగా పంచుకుంటారు. కాల వ్యవధి ముగియగానే, అదనపు ప్రాజెక్టుల కింద చేపట్టిన సదుపాయాలు గ్రామ పంచాయితీకి / రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ అవుతాయి. గ్రామ పంచాయితీ / రాష్ట్ర ప్రభుత్వం భూమిని కల్పించనట్లయితే, ప్రైవేటు భాగస్వామి బహిరంగ మార్కెట్ నుంచి భూమి కొనుగోలు చేస్తారు. అయితే, ఈ వ్యయాన్ని ప్రాజెక్టు వ్యయంలో కలపరాదు.

ప్రైవేటు భాగస్వాముల ఎంపిక ప్రైవేటు భాగస్వాములను బహిరంగ పోటీ బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. బిడ్డర్లు ఒంటరిగా కానీ, ఒక కన్సార్టియంగా కాని దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రముఖమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థల నుంచి 'ఆసక్తి వ్యక్తీకరణ' ను ఆహ్వానిస్తారు. ఇందుకు బహిరంగంగా పత్రికా ప్రకటన విడుదల చేస్తారు. ఆసక్తి ఉన్న బిడ్డర్లు తమ స్పందనను తెలియజేయవచ్చు. వచ్చిన దరఖాస్తులను వడపోసి, అర్హతల ఆధారంగా జాబితాను కుదిస్తారు.

ఇట్లా కుదించిన జాబితాలోని బిడ్డర్లకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్ ఎఫ్ పి) ముసాయిదాను జారీ చేస్తారు. సంప్రదింపుల కోసం బిడ్ల సమర్పణకు ముందుగా వీరిని సమావేశానికి ఆహ్వానిస్తారు. తరువాత చివరి ఆర్ఎఫ్పిని జారీచేస్తారు. బిడ్డర్లు తమ ప్రతిపాదనలను సమర్పిస్తారు. ఇందులో కాన్సెప్ట్ ప్రణాళికలు, సంబంధిత గ్రామ పంచాయితీలు, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఉంటాయి.

'ఆసక్తి వ్యక్తీకరణలకు స్పందనగా బిడ్డర్ల సాంకేతిక సామర్థ్యాలను, వాటికి కేటాయించిన పాయింట్లను ముందుగా నిర్ణయించుకున్న పద్ధతి ప్రకారం బేరీజు వేస్తారు. ఇందుకు ఒక ప్రాజెక్టు స్క్రీనింగ్, మానిటోరింగ్ కమిటీ ఉంటుంది. వివిధ బిడ్డర్లు సమర్పించిన కాన్సెప్ట్ ప్రణాళికలకు ఈ కమిటీ, ఆర్ఎఫ్పి పత్రంలోని ప్రమాణాల ప్రకారం మార్కులు వేసి, ర్యాంకులు కేటాయిస్తుంది. మంచి ర్యాంకులు వచ్చిన బిడ్డర్లను ఎంపిక చేసి, డిపిఆర్ (Detailed Project Report) లను తయారు చేయవలసిందిగా కోరుతారు. తిరిగి వీటిని కమిటీ పరిశీలిస్తుంది. ఆ తరువాత ఒక ఇంటర్ మినిస్టీరియల్ ఎంపవర్డ్ కమిటీ డిపిఆర్లను, గ్రాంటులను మంజూరు చేస్తుంది. ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

'పురా' విధానంలో ప్రతిపాదించిన మోడల్, గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించినది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల జీవన నాణ్యతను ఇది గణనీయంగా మెరుగు పరుస్తుంది. అక్కడ కల్పించే ఉపాధి అవకాశాలు, ఆధునిక సదుపాయాలు, సేవలు గ్రామాలు-పట్టణాల మధ్య అంతరాలను తగ్గిస్తాయి. అంతేకాక, పట్టణ ప్రాంతాల రద్దీని, జన సాంద్రతను కూడా తగ్గిస్తాయి. గ్రామాలనుంచి పట్టణాలకు వలసలను ఆపుతాయి.

'పురా' పథకంలోని సమీకృత విధానాలు గ్రామీణ భారతాన్ని సుసంపన్నం చేస్తాయి. ప్రయోగాత్మకంగా చేపట్టిన 'పురా' ప్రాజెక్టులు విజయవంతమైతే, 'పురా' పథకంకూడా విజయవంతంగా అమలు జరుగుతుంది.

- డాక్టర్ దీపా నాయర్
ఫాకల్టీ, సెంటర్ ఫర్ అర్బన్ స్టడీస్.
(అనువాదం : టి.ఎన్.)

27వ పేజీ తరువాయి భాగం...

ఆరోగ్యం, ఎదుగుదల, శారీరక ధృడత్వం ఆశించిన విధంగానే సాగుతాయి.

ఇటీవల జరిపిన పరిశోధనల వల్ల తెలిసినదేమిటంటే, పసుపురంగులో ఉండే పళ్ళు, పచ్చని తాజా ఆకుకూరల్లో ఉండే బీటా కెరోటిన్, పుల్లని పళ్ళల్లో ఉండే 'సి' విటమిను, శాఖాతైలాల్లో ఉండే 'ఇ' విటమిన్, పాలలోని జింకు, పుట్టగొడుగులలోని కాపర్, గింజధాన్యాలు, ఎండిన పళ్ళల్లో ఉండే క్రోమియమ్ లాంటి పోషకాంశాలు మొదటి నుంచి క్రమం తప్పక తీసుకునే వారిలో రోగ నిరోధక శక్తి పెంపొందడమే కాకుండా, అరవై ఏళ్ళు దాటినా వృద్ధాప్యపు ఛాయలు ఒక పట్టాన రావు అని.

అలాగే శాస్త్రజ్ఞులు కొన్ని ఆహార పదార్థాలలో విటమినులు, ఖనిజ లవణాలు కాని కొన్ని ఫైటో కెమికల్స్‌ని ఇటీవలే కనుగొన్నారు. ఇవి కూడా రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వీటిలో ముఖ్యమైనవి పుల్లని సిట్రస్ పళ్ళల్లో ఉండే Limonenes, క్యాబేజీ లాంటి కూరగాయాల్లో ఉండే indoles, isothicynates, ఎండిన బీన్సులో ఉండే flavones, కొన్ని కూరగాయల్లోను, పళ్ళలోను ఉండే flavoniods, సోయా చిక్కుడులో ఉండే genistein లాంటివి. ఇవే కాకుండా ఆపిల్ పళ్ళలోని Ellagic acid మరియు caffeic acid శరీరంలోని కేన్సరు కారకాలని బయటకు పంపించి వేస్తాయి. వీటిలో ఉండే ferulic acid, octacosanol లాంటి అంశాలు ముసలి వయస్సులో వచ్చే parkinson disease నుంచి కేన్సరు నుండి రక్షణ కలుగజేస్తుంది. అలాగే అరటిపళ్ళలో ఉండే catechols శరీరానికి రోగ నిరోధక శక్తిని కలుగచేస్తాయి. కమలా పళ్ళల్లో ఉండే terpenes, Beta cryptoxanthin శ్వాసకోశ కేన్సరు, ఇతర కేన్సరుల నుంచి రక్షణ కలుగజేస్తుంది. ఖర్జూరపు పళ్ళలోని benzyaldelizole, cancer, lymphome, psoriosis లాంటివి చర్మవ్యాధి నుండి రక్షణ కలుగచేస్తాయి. ద్రాక్ష పళ్ళలోని "Ellagic acid" కేన్సరు కారకాలను శరీరం నుంచి బయటకు పంపించడమే కాకుండా డిఎన్ఎను పాడు చేయకుండా కాపాడుతుంది. బొప్పాయి, మామిడి, క్యారెట్లు, చిలకడ దుంప, ఆకుకూరలు Beta Carotene కలిగి ఉండి శరీరంలో కేన్సరు కారకాలైన free radicalsని నిర్వీర్యం చేసి ఆరోగ్యాన్ని కలుగచేస్తాయి.

ఆలుగడ్డలలోని calechols రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయి. ఇక టమోటాలు 10,000 రకాల phyto-chemicals కలిగి ఉండి, కొన్ని రకాల కేన్సరుల నుండి విముక్తిని కలిగించడమే కాకుండా అందులోని aminobutyric acid రక్తపు పోటు నుండి రక్షణ కలుగచేస్తాయి. అలాగే పీచు పదార్థాలు అధికంగా గల తక్కువ మరపట్టిన గింజ, పప్పుధాన్యాలు, ఆకుకూరలు వంటివి ఆరోగ్యానికి మంచివి, అత్యవసరం కూడా.

Omega 3 అనబడే fatty acid గల చేపలు, ఆకుకూరలు, సోయా చిక్కుడు, ఆవనూనె లేదా ఆవపిండిని ఎక్కువగా వాడితే రక్తంలోని కొలస్ట్రాల్‌ని కరిగించివేస్తుంది. అలాగే పెరుగులాంటి పులిసిన పదార్థాలు brain cancer, ఇతర కేన్సరులను రాకుండా చేస్తాయి. అన్ని రకాల సుగంధ ద్రవ్యాలు, ముఖ్యంగా మిరియాలు, ఆవాలు, లవంగాలు, ఉల్లి, వెల్లుల్లి, అల్లం, పసుపు లాంటివి కొన్ని ప్రత్యేక అంశాలు కలిగి ఉండి కొన్ని రకాల కేన్సరుల నుండి మనని దూరంగా ఉంచగలుగుతాయి. రోగాలను దరి చేరనీయవు.

పోషకాహార విజ్ఞానాన్ని, ఆహార పదార్థాల ఎంపికలోను, వండడంలో పాటించవలసిన మెళుకువల ద్వారా మీ వంటింటి దగ్గరే అనేక రోగాలను రాకుండా నిరోధించవచ్చు. వీటికి తోడు ఆరోగ్యాన్ని పెంపొందించే జీవనశైలిని అవలంబిస్తే, చీకుచింత లేని ఆనందమయ జీవితాన్ని గడపవచ్చు. దానికి మీరు చేయవలసింది ఏమిటంటే :

- నిర్ణీత వేళల్లో భోజనం చేయండి, నిద్రపోండి.
- రోజుకు రెండుసార్లు ఎక్కువ పరిమాణంలో భోజనం చేసే కన్నా, నాలుగుసార్లు, తక్కువగా తీసుకోండి.
- భోజనానికి ముందు చిరుతిళ్ళు తీసుకోకండి.
- రాత్రి పూట నిద్రపోయే రెండు గంటల ముందు భోజనం చేయండి.
- రోజూ కాయగూరలు, పళ్ళు ఆహారంలో తప్పనిసరిగా తీసుకోండి.
- వంట నూనెలు పూర్తిగా మానివేసిన మంచిది కాదు. కాబట్టి మితంగా అంటే నాలుగు టీ స్పూన్లకు మించి తీసుకోకూడదని గుర్తుంచుకోండి.
- రోజుకు 200 మిల్లీగ్రాముల కన్నా ఎక్కువ కొలెస్టరా తీసుకోకూడదు. మీగడ తీసిన పాలు, పచ్చసొన తీసిన గ్రుడ్డు తీసుకోవడం ద్వారా కొలెస్టరాల్ తగ్గించవచ్చు.
- ఉప్పు తగ్గించి వాడాలి. పచ్చళ్ళు, అప్పడాలు, సాస్‌లు వీలైనంత వరకు తగ్గించండి లేదా మానివేయండి.
- స్వీట్లు లేదా తీపి పదార్థాలు తీసుకోవడం తగ్గించండి.
- అన్ని రకాల ఫాస్ట్‌ఫుడ్స్ క్రొవ్వుతో నిండినవి. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు కూడా మంచిది కాదు. వీటిలో అత్యవసర పోషకాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు లోపించి ఉంటాయి. కాబట్టి వీటిని తీసుకోవడం తగ్గించండి లేదా మానివేయండి.
- ఆరోగ్యానికి తోడ్పడే ఆహార దినుసుల్లో మెంతులు, ఉల్లి, వెల్లుల్లి, చేపలు, సోయాబీన్, పసుపు, అల్లం, లవంగాలు, వెల్లుల్లి ప్రధానమైనవని గుర్తుంచుకోండి. వీటిని విరివిగా వాడండి.
- ఎత్తుకు తగిన బరువు ఉండేలా ఆహారంలో మార్పులు చేసుకోండి.
- దానికి తోడు క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి.
- నిర్ణీత వ్యవధిలో వైద్య పరీక్షలు చేయించుకోండి.
- అధికంగా మందులు వాడకండి.
- మానసిక ఆందోళన, ఒత్తిడి తగ్గించుకోండి.

రోగ నిరోధక శక్తితో కూడుకున్న సంతులిత పోషకాహారానికి తోడు, ఆరోగ్యాన్ని పెంపొందించే జీవనశైలిని పాటిస్తే, నిండు నూరేళ్ళు జీవనం, ఆనందంగా కొనసాగించవచ్చు.

*డా॥ ఎ. సాయిబాబా,* ఐ.ఐ.హెచ్.ఎఫ్.డబ్ల్యు

# పంచాయితీల్లో మహిళల పురోగమనం



**మూడంచెల పంచాయితీ రాజ్ వ్యవస్థలోని అన్ని స్థాయిల్లో మహిళలకు 50 శాతం స్థానాలను కేటాయిస్తున్నట్లు ఈ ఏడాది మార్చి 5న ఒరిస్సా ప్రభుత్వం ప్రకటించింది. భువనేశ్వర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పంచాయితీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఒరిస్సా ముఖ్యమంత్రి శ్రీ నవీన్ పట్నాయక్ తన నిర్ణయాన్ని ప్రకటించారు.**

మహిళలకు పంచాయతీల్లో 33 శాతం స్థానాలు కేటాయించడానికి రాజ్యాంగానికి జరిగిన 73వ సవరణ అమలు కాకముందే 1990ల దశకం తొలి సంవత్సరాల్లోనే మహిళలకు 33 శాతం స్థానాల రిజర్వేషన్‌ను బిజు పట్నాయక్ ప్రభుత్వం ఒరిస్సాలో అమలు చేసింది.



ఒరిస్సాలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టిన ఘనత బిజు పట్నాయక్‌కు చెందుతుంది కాబట్టి, ఆయన పుట్టిన రోజును పంచాయతీరాజ్ దినోత్సవంగా ప్రతి ఏటా ఒరిస్సా ప్రభుత్వం పాటిస్తోంది.

బీహార్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్‌లతో సహా అనేక రాష్ట్రాలు మహిళలకు పంచాయతీ వ్యవస్థలో 50 శాతం స్థానాలను కేటాయించాయి. ఈ ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు కేరళ, త్రిపుర ప్రభుత్వాలు ఇదివరకే ప్రకటించాయి. పంచాయితీలో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి తమ రాష్ట్ర చట్టాలకు సవరణలు తెచ్చే అధికారం రాష్ట్రాలకు ఉంది.



మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న 33 శాతం రిజర్వేషన్ల స్థానంలో 50 శాతం రిజర్వేషన్లను కల్పించడానికి ఉద్దేశించిన రెండు బిల్లులను ఏడాది మార్చి 9న త్రిపుర అసెంబ్లీ ఆమోదించింది.









ఇందుకు గాను, త్రిపుర పంచాయతీలు, పట్టణ అభివృద్ధి మంత్రి శ్రీ మాణిక్ డే శాసనసభ సమావేశాల్లో త్రిపుర పంచాయితీల (ఐదవ సవరణ) బిల్లు, 2010ను, త్రిపుర మున్సిపల్ (నాలుగవ సవరణ) బిల్లు, 2010ను ప్రవేశపెట్టారు.

ఈ రెండు బిల్లులు చరిత్రాత్మకమైనవిగా ముఖ్యమంత్రి శ్రీ మాణిక్ సర్కార్ అభివర్ణించారు. మహిళల పట్ల దయ చూపడానికి పంచాయితీలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో వారి స్థానాలు పెంచటం లేదని, సమాజంలో పురుషులకు, స్త్రీలకు సమాన బాధ్యతలు ఇవ్వటానికి ఈ చర్య తీసుకున్నామని ఆయన అన్నారు.

ఇక ఉత్తరాఖండ్‌లో అయితే, పంచాయితీ స్థానాల్లో 55 శాతం మహిళల చేతుల్లో ఉన్నాయి. వీరిలో చాలా మంది నాన్ - రిజర్వుడు స్థానాల నుంచి పోటీ చేసి గెలుపొందారు.

మహారాష్ట్రలో కూడా పంచాయితీలు, పట్టణాభివృద్ధి సంస్థల్లో మహిళలకు 50 శాతం స్థానాలకు కేటాయించడానికి అన్ని పక్షాల మద్దతును కూడగట్టడానికి మహారాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

వివిధ రాష్ట్రాల స్థాయిల్లో ఈ దిశలో జరుగుతున్న పురోగమన కృషి, ప్రయత్నాల కారణంగా స్థానిక ప్రభుత్వాల్లో మహిళలు చురుగ్గా పాలు పంచుకోవటానికి అవకాశాలు లభిస్తున్నాయి. అట్టడుగు స్థాయిలో, గ్రామ స్థాయిలో, క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న మహిళా నాయకురాళ్లకు పంచాయితీలు అందివచ్చిన మెట్లుగా ఉపయోగపడుతున్నాయి.

స్థానిక ప్రభుత్వాల్లో మహిళలకు రిజర్వేషన్లు లేనట్లయితే, అధికారం అనేది వారికి అందని మానిపండుగానే ఉండేది. ప్రత్యేకించి పురుషాధిపత్యం బాగా ఉన్న రాజకీయ రంగంలో.

మహిళలకు తప్పనిసరిగా ఇవ్వాల్సిన కోటా 33 శాతం అయినప్పటికీ, దేశంలోని అన్ని జిల్లాల్లో అంతకంటే ఎక్కువ స్థానాల్లోనే వారు గెలుపొందారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న కొన్ని రాష్ట్రాల ఆదర్శాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తే, మహిళా ప్రాతినిధ్యం మరింత పెరుగుతుందని ఆశించవచ్చు.

(పంచాయితీ రాజ్ అప్‌డేట్, మార్చి 2010, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఢిల్లీ సౌజన్యంతో)

అనువాదం: **- ఆర్.కె.**



# అనితరసాధ్యం శ్రీ శ్రీ కవితామార్గం

శ్రీశ్రీ అభ్యుదయ కవితా ప్రస్థానానికి యుగకర్త. ఒక వ్యక్తి యుగకర్తగా నిలబడాలంటే సాహిత్యాన్ని గానీ సమాజాన్ని గానీ తనలోంచి ప్రవహింప జేసుకొని తానూ కాలం కంటే వేగంగా పరువులెత్తే కవిత్వంతో అభ్యుదయ పథాలలోకి అతినవ్యంగా ప్రసరించాలి. దీనికి పరిణామశీలత ఒక్కటీ ఉంటే సరిపోదు. ప్రయోగశీలత కూడా కావాలి. ఆ 'ప్రయోగశీలత' అప్పటి వరకూ ఉన్న కవితా సంప్రదాయాలకీ, ఆధునిక సంప్రదాయాలకీ వారధిలా పనిచేయాలి. ఆ కవిత్వ ప్రభావం కొన్ని తరాలపై ప్రత్యక్షంగా గానీ పరోక్షంగాగానీ అంతర్లీనంగా ప్రతిధ్వనించాలి. సరిగ్గా ఈ లక్షణాలన్నీ ఉండడం వల్లనే శ్రీశ్రీ యుగకర్తగా గుర్తింపు పొందాడు. శ్రీ శ్రీ కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే కేవలం సాహిత్యాన్ని అధ్యయనం చేసినట్లు చేస్తే సరిపోదు. శ్రీశ్రీ కవిత్వాన్ని జీవితాధారమయ్యె ప్రాణవాయువుగా శ్వాసించినా కూడా ఆ లోతులు అందడం కష్టమే.

శ్రీశ్రీ కవితాప్రయోగాలు కేవలం విశృంఖలత వైపు సాగలేదు. సనాతన సంప్రదాయంలో ఉన్న శక్తిని అంతర్గయగా పెట్టి ఆధునిక ప్రయోగాలు చేశాడు. అందుకే శ్రీశ్రీ సనాతులలో ఆధునికుడు, ఆధునికులలో సనాతుడు. ఇది చాలా అరుదయిన విషయం.

శ్రీశ్రీ మహాప్రస్థానంలో ఛందోబందోబస్తులను తిరస్కరిస్తూ వచనాన్ని ప్రవేశపెట్టాడు. కానీ ఈ ప్రయోగం ఆకస్మాత్తుగా చేయలేదు. మహాప్రస్థానం నాటికి పూర్తిగా వచన కవితా శైలి రాలేదు. ఆ ప్రారంభ దశలు మహాప్రస్థానంలో కన్పిస్తాయి. భావ కవుల కాలంలో పరిణతరూపాన్ని పొందిన గేయ బాహిర రూపాన్ని మార్చడం కోసం మొదట శిష్ట్లా చేసిన ప్రయోగాలు ఉద్యమ రూపం దాల్చాయి. వచన కవితకు ఒక రూపాన్నివ్వడంలో శిష్ట్లాతో పాటు శ్రీరంగం నారాయణబాబు, శ్రీశ్రీ, జరుక్‌శాస్త్రి ప్రముఖ పాత్ర వహించారు. వీరిలోనూ శ్రీశ్రీ దే అగ్రస్థానం. 1929లో సుప్తాస్థికలు అనే కవిత మొట్టమొదటి వచన కవితగా పేర్కొంటారు. ప్రగతివాదం నుండి సహజమైన ఆలోచనలకు ప్రతిఫలంగా దూసుకువచ్చిన వచన కవిత శ్రీశ్రీ చేసిన అధివాస్తవిక రచనల్లోనూ, మహాప్రస్థానంలోనూ చోటు సంపాదించింది. తరువాత నయాగరా కవులూ దీనిని అనుసరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దాశరథి, ఆరుద్రా వచనాన్ని ఉపయోగించారు. ఆరుద్ర త్వమేవాహం గేయవృత్తాదులను అక్కడక్కడా కలిగి ఉన్నప్పటికీ శబ్దం నుండి కావ్య సమగ్రస్వరూపం దాకా ఒక ప్రయోగ వైవిధ్యాన్ని ప్రదర్శించిన కావ్యం. ఇది నిజంగా శ్రీశ్రీ మానస పుత్రిక వంటిది. దాశరథి రాసిన మస్తిష్కంలో లేబొరేటరీ, ప్రయోగవాద కవిత్వానికి మచ్చుతునక. ఆరుద్ర, దాశరథులతో పాటు అజంతా, బైరాగి, కుందుర్తి, ఎల్చూరి, తిలక్, కవిరాజమూర్తి, వరద రాజశేఖర్ మొదలైన తొలితరం వచన కవులనుండీ నేటి వరకూ అవిచ్ఛిన్నంగా అసంఖ్యాకులైన కవులు వచన కవిత్వాన్ని రచిస్తూ ఉన్నారు.

శ్రీశ్రీకి శబ్ద శక్తి బాగా తెలుసు. కొత్త సమాజం కోసం, కొత్తతనం ఉన్న కవిత్వానికి మేలైన భాషను శ్రీశ్రీ ఊహించాడు. ఒకవైపు సంప్రదాయబద్ధమైన సంస్కృత భాషా ప్రయోగాలను చేస్తూ రాబోయే కాలానికి ఊపిరిగా నిలిచే వ్యవహార భాషను వచన కవిత్వంలో ప్రవేశపెట్టాడు. 1934 డిసెంబరు భారతిలో ప్రచురితమైన శ్రీశ్రీ 'ఆకాశదీపం' కవిత వ్యావహారిక భాషలో రాసిన వచన కవితలలో మొట్టమొదటిది. ఎలా మాట్లాడుతున్నామో అలాగే రాయడానికి ఆద్యుడూ శ్రీశ్రీ. బాటలు నడచీ, పేటలు కడచీ... ఇత్యాది ప్రయోగాలు మహాప్రస్థానంలో ఎన్నో ఉన్నాయి. లక్షణ విరుద్ధమైన భాషగ్రామ్యమని కొట్టిపారవేసే, సంప్రదాయ కోవిదులు కూడా మెచ్చే ప్రపంచాబ్జం, త్రేతాగ్ని, పరమేష్టిజూకాలు, విశ్వవృష్టి... లాంటి తత్సమాలను అలంకారికంగా ఉపయోగించాడు. పీడితుల బాధల్ని వాళ్ళ భాషలోనే చెప్పాలనే భావనలో శ్రీశ్రీ 'జట్కావాలా' మొదలైన కవితలు రాశాడు. ఇదే నేటి దళిత, మైనారిటీ, స్త్రీవాద ధోరణులకు మూలమయ్యింది. ప్రాంతీయ మాండలికాలు కూడా నేటి వచన కవిత్వంలో చోటు చేసుకొంటున్నాయంటే - దానికీ శ్రీశ్రీ లోని దార్శనికతే కారణం. నాడే మహాప్రస్థానంలో చూపిన శబ్దాడంబరాల నుండి శ్రీశ్రీ బయటపడి, కవితా వస్తువుకు వాస్తవికతను అద్ది, చేవని అందించే సజీవ భాషను తన రచనలలో ప్రయోగించాడు. భాషా ప్రవాహ లక్షణాన్ని సాధిస్తూ, శైలిలో విప్లవాత్మకంగా శ్రీశ్రీ అనుసరించిన పంథా నేటి వచనకవితా భాషకు అనుసరణీయమయ్యింది.

1857 చార్లెస్ బోదిలేర్ అనే ఫ్రెంచ్‌కవి, ఇతనికి 26 సంవత్సరాలకు పూర్వం అలాయ్‌సియస్ బెర్‌ట్రాండ్ అనే కవి కేవలం వచనకవిత్వాన్నే రాశారు. వీరి కవితా నిర్మాణాల లక్షణాలే శ్రీశ్రీ రాసిన సుప్తాస్థికలలో వ్యవస్థితాలై ఉన్నాయి. పద్య కవిత్వంలో లయను అనుసరించి రచన ఉంటుంది. వచన కవితలో రచన లయను అనుసరించి ఉంటుంది. భావానికి తగిన అభివ్యక్తి తీవ్రతనీ, దీనికి తగిన భాషనీ, ఆ భాషలో వేగాన్ని నింపుకొని వచన కవిత్వానికి ఒక గొప్ప శక్తిని సంతరించిన కవి శ్రీశ్రీ.

వస్తు సంవిధానాలలో వస్తువుకే అధిక ప్రాధాన్యాన్నిచ్చిన శ్రీశ్రీ వస్త్వాధారిత శబ్ద ప్రపంచాన్ని లయాత్మకంగా మంత్రించి కవిత్వంలో బిగించిన నేర్పరి. పదబంధాలు, భావచిత్రాలు, ప్రతీకలు ప్రయోగించడం వస్తువుని ప్రస్ఫుటం చేస్తూ రచించడం, ఆలంకారిక ప్రయోగాల ద్వారా వస్తు తత్త్వాన్ని పట్టుకోవడం 'భిక్షువర్షీయసి' లాంటి కవితలలో శ్రీశ్రీ ప్రదర్శించాడు. ఇదే విధంగా వస్తువునీ, శిల్పాన్ని సమంగా కాపాడుకొంటూ ఎందరో విప్లవ రచయితలు శ్రీశ్రీ అడుగుజాడల్లో పయనించారు.

శ్రీశ్రీ లోని శ్రమైక జీవన సౌందర్య ప్రభావం వల్ల శివసాగర్ అడవిని 'గరికపూలపాన్పు'గా నిర్మించాడు. 1970లో విరసం ఆవిర్భావం జరిగింది. నాటి కవులు శ్రీశ్రీలోని పీడిత వర్గాల వెతలను వస్తువుగా స్వీకరించి కవిత్వంరాసే లక్షణాన్ని స్వీకరిస్తూ వర్గదృక్పథంలో కవితలు రాశారు. అలాగే వృత్తులపై ఆధారపడి కష్టపడి జీవించే వారిని 'సామాజికస్పృహ' కు పెద్ద పీట వేయడం ద్వారా శ్రీశ్రీ ప్రారంభించాడు. ఇదే మార్గంలో అనేక వచన కవితలు, వృత్తికళాకారుల పట్ల అదే సామాజిక స్పృహను ప్రకటించే విధంగా వచ్చాయి. శిల్పంలో కూడా శ్రీశ్రీ మార్గమే వృత్తి కవితలకు అనుసరణీయం అయ్యింది.

శ్రీశ్రీ తన కవిత్వంలో ప్రదర్శించిన పెట్టుబడిదారీ వ్యవస్థల పట్ల నిరసన, భూమి, భుక్తి, విముక్తి కోసం కొడవళ్ళెత్తిన ప్రజాపక్షపాతం.. లాంటి గుణాలు దాశరథి, సోమసుందర్ (వజ్రాయుధం) ఆరుద్ర, వట్టికోట వంటి ప్రజాకవులను ఆకర్షించి నిజాం పాలనను నిరసించేలా చేశాయి. రాజ్యహింస, నిర్బంధాలను వస్తువులుగా స్వీకరించి రాసిన కె. శివారెడ్డి "రసూల్ రసూల్", ఆఫ్సర్ 'మరణవార్త' కవితలు ఈ కోవకి చెందినవే.

జనప్రవాహంతో పాటుగా కవిత్వం వస్తు రూపాలను మార్చుకోవాలని దృఢంగా నమ్మినకవి శ్రీశ్రీ. అందుకే రష్యావంటి ఇతర

దేశాలలో జరుగుతున్న విప్లవాలకు స్పందించి 'గర్జించు రష్యా... గాండ్రించు రష్యా' అని గళం విప్పాడు. ఇది కేవలం సమకాలిక సంఘటనలపై స్పందించడమే కాదు. ఆ స్పందనలలో కొత్త ఆలోచనల్ని, ఆవేశాలను నింపి విశ్వజనీనమైన దృక్పథాన్ని కల్గించడమే. ఇది శ్రీశ్రీ ఆశయం. విశ్వవృష్టి, భువనభవనం, ప్రపంచాబ్జం... ఇవన్నీ దీనికి నిదర్శనాలు. శ్రీశ్రీ బాధ ప్రపంచానిదన్న చలం మాటలూ దీనినే నిరూపిస్తాయి. 1991లో చుండూరు సంఘటన, చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పత్తిరైతుల ఆత్మహత్యలు ఇలా అనేక సమకాలీన సామాజికాంశాలపై కవులు తీవ్రంగా స్పందించడానికి శ్రీశ్రీ మార్గ దర్శకుడు. నేటికీ తెలుగు కవులు సమాజంలో జరిగే సంఘటనలకి సామాజిక స్పృహతో స్పందిస్తున్నారు. రచనలు చేస్తున్నారు. ఇది ఒక వారసత్వంగా అందింది. దీనిలో శ్రీశ్రీ పాత్ర లేదనడానికి వీలులేదు.

ఏది రాసినా ఎలా రాసినా ఒక కొత్తదనం, తనదైన ముద్ర శ్రీశ్రీ కవిత్వాన్ని సమూహం నుండి వేరుచేస్తాయి. సమూహాన్నీ శ్రీశ్రీ మార్గంలో నడిపిస్తాయి. కథాత్మకమైన కవిత్వం చెప్పడానికి 'పూర్ణమ్మ' వంటి గేయాలు రాసిన గురజాడ ఆద్యుడైతే.. ఆ సంప్రదాయానికి కొంత సామాజిక స్పృహనీ, స్త్రీవాద దళిత వాదల ఛాయలనీ ప్రతిబింబించే విధంగా భిక్షువర్షీయసి, బాటసారి లాంటి కవితల్ని రాసిన శ్రీశ్రీ నిలుస్తారు.

కవిత్వాన్ని ప్రతాకాత్మకంగా చెప్పడం శ్రీశ్రీ కవిత్వంలోని నవ్యత. ఈ ప్రతీకలను కూడా చాలా తక్కువ పదాలతో సూచించడం ఒక విశేషం. కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, రొట్టెముక్క, అరటితొక్క, బల్లచెక్క, తలుపుగొళ్లెం, హారతిపళ్లెం, గుర్రపుకళ్లెం అనేవి క్రమంగా ఆకలి, పరిశ్రమ, ఫ్యాక్టరీ, బేకరీ, కర్షకుడు, కార్మికుడు, స్వాతంత్ర్యం, విజయం, వేగం అనే వాటికి ప్రతీకలు. కవిత్వంలో ప్రతీకల్ని వాడడం ఆధునిక కవిత్వంలో బలమైన శిల్ప వైవిధ్యం.

శ్రీశ్రీ - సంప్రదాయంలో ఉన్న పదబంధాలనే కొత్త అర్థంలో వాడడానికి అనంతర కవులకు మార్గదర్శి. 'మహాప్రస్థానం' అంటే మరణమని అర్థం. దీనిని గొప్ప ప్రస్థానమని ప్రగతి శీలతకు ప్రతీకగా వాడాడు. ఇదే విధంగా ఆరుద్ర 'త్వమేవాహం', దాశరథి రుద్రవీణ, అగ్నిధార, సోమసుందర్ వజ్రాయుధం' వంటి పేర్లను సంప్రదాయం నుండి తీసుకొని అభ్యుదయ స్ఫోరకాలుగా వాడుకొన్నారు. దీనికి ఒరవడి శ్రీశ్రీదే. గేయంలోంచి వచనకవిత్వాన్ని, వచన కవిత్వంలోంచి మినీ కవిత్వాన్ని వెలికితీస్తారు శ్రీశ్రీ. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీశ్రీ ఆధునిక చిత్రకవి. మహాప్రస్థానంలో గేయ, వచన, మినీ, హైకూల్లాంటి కవిత్వ ప్రక్రియలున్నాయి.

శ్రీశ్రీ గేయం జననాట్యమండలి, ప్రజా నాట్యమండలి వాళ్ళ గేయాలకూ, విప్లవ గేయాలకూ అండగా నిలిచింది. వచన కవిత్వం కుందుర్తి, తిలక్ వంటి కవుల కలాల్లోంచి వరవళ్ళు తొక్కింది. శ్రీశ్రీ కవిత్వంలోని తత్సమ శబ్దప్రయోగాన్ని తిలక్ స్వీకరించాడు. శ్రీశ్రీ మహాప్రస్థానంలోని 'ఐ' 'వ్యత్యాసం' లాంటి కొన్ని కవితలను విడదీస్తే మినీ/హైకూ కవితలవుతాయి. 'పుడమి తల్లికి పురటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపించాయి'. 'నేను సైతం ప్రపపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను' మొదలైనవి.

మైత్రి శతక రచనకు ఆద్యుడు శ్రీశ్రీ. వ్యావహారిక భాషకు ఆంగ్లాన్ని జోడించి, చుట్టూ ఉన్న సమాజంపై, వ్యక్తులపై మిత్రులపై సంధించిన కందాస్త్రాలు శ్రీశ్రీ సిరిసిరిమువ్వ శతక పద్యాలు. సిరిసిరి మువ్వలతో పాటు శ్రీశ్రీ - ప్రాసకీడలు, లిమరిక్కులు రాస్తే - ఆరుద్ర కూనలమ్మపదాలు, జరుక్‌శాస్త్రి రుక్కుటేశ్వర పద్యాలు వెంటనే వెలువడ్డాయి. కొంచెం అధిక్షేపం, మైత్రి, సమకాలిక స్పృహలు ఈ తరహా రచనలకు లక్షణాలని చెప్పవచ్చు. ఇదే పద్ధతిలో ఇంకా శ్రీన.చ. రామానుజాచార్యులు గారు రాసిన మూర్ఖశతకం, శ్రీశ్రీని సంబోధిస్తూ కావూరి పాపయ్య శాస్త్రిగారు రాసిన ఒక శతకం, చేరాకోశతమానం' అనే పేరున కోవెల సంపత్కుమారాచార్య గారి శతకం, సినారెగారికి నానీలతో ద్వానాశాస్త్రి రాసిన శతకం. ద్వానాశాస్త్రిపై పరిమి రామనరసింహం రాసిన ద్వానాశతకాలు వచ్చాయి. ఇద్దరు వ్యక్తుల మధ్య మైత్రిని తెలుపుతూ, చమత్కారవంతంగా శతక సంప్రదాయంలో వచ్చిన రచనలకు మూలం శ్రీశ్రీ. సి.ప్రా.లి.లే.

అభ్యుదయ విప్లవోద్యమాల ద్వారా శ్రీశ్రీ నడచిన దారిలో ఎందరో కథకులు కూడా ఉన్నారు. కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి వంటి ప్రముఖులే వీరిలో ఉన్నారు. పతితుల పక్షం నిలిచి ధనస్వామ్య, న్యాయ వ్యవస్థలను నిలదీసిన రావిశాస్త్రి మహాప్రస్థానంలో శ్రీశ్రీ చెప్పిన ఋక్కుల పేరున తొమ్మిది కథలు రాసి వాటిని శ్రీశ్రీకి అంకితం ఇచ్చారంటే శ్రీశ్రీ ప్రభావం ఎంతటిదో తెలుస్తోంది. అందుకే శ్రీశ్రీ "రావిశాస్త్రి పెన్ను, నరుడి మూడోకన్ను, వర్గ దోపిడిపై గురిపెట్టిన గన్ను" అన్నారు. అలాఏ కథకులు అవసరాల రామకృష్ణారావు గారు శ్రీశ్రీ కందాల మీద మనసు పారేసుకొని అచ్చం శ్రీశ్రీ శైలిలోనే చాలా కందాలు రాసి శ్రీశ్రీగారికే వినిపించారట. మచ్చుకో రెండు చూడండి -

బాగుండాలి ప్రజాకవి - బాగా పదినాళ్ళపాటు రాయాలని మా
మూగ ప్రజతరపు ప్రార్థన-బాగా తగ్గించు డోసు బాబూ! శ్రీశ్రీ!!
మనసున మనసై మొదలుగ - మనుషులు మారాలి వరకు మనకవి వ్రాసెన్ సినిమాపాటలు వందలు-కనరాదొక బూతుమాట కంగ్రాట్స్ శ్రీశ్రీ!

శ్రీశ్రీ విమర్శరంగంపై కూడా తనదైన ముద్రవేశారు. గురజాడపై 'ఆధునిక గద్యవాఙ్మయ ప్రవర్తకుడు' 'గురజాడ ఆధిక్యానికి కారణాలు' అనే వ్యాసాలలో మొట్టమొదటిసారిగా గురజాడ కవిత్వం, కథ, నాటకాలపై విశ్లేషణాత్మక విమర్శ చేశారు. ఇదే అనంతర విమర్శకులకు గురజాడని కొత్తగా దర్శింపజేసింది. వ్యాసాన్ని భారంగా కాక, తేలికగా... క్లిష్టంగా కాక స్పష్టంగా రాయడానికి నాంది పలికాడు. శ్రీశ్రీ రాసిన "ఆధునిక గద్య వాఙ్మయ ప్రవర్తకుడు" అనే వ్యాసం ఇలా ప్రారంభమవుతుంది.

వేసిన దారంట వెళ్ళిపోవడం సులభం, అంతేకాదు పదిలం... ఇలా సాగుతుంది. ఈ రచన 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' రచించిన ఆరుద్రపై ప్రభావం చూపింది. ఆరుద్ర 'ఈగ ఇల్లలుకుతూ తన పేరు మర్చిపోయింది....' అంటూ సాహిత్య చరిత్ర ప్రారంభిస్తారు. ఇక పరిశోధనాంశాన్ని సులభంగా నుడికారపు సొంపులతో అందించాలన్న వాక్యరచనా విన్యాసం ఆరుద్రకి శ్రీశ్రీ నుండే సంక్రమించిందనవచ్చు.

శ్రీశ్రీ తన రచనలకు తానే పీఠికలు రాసుకొనే సంప్రదాయాన్ని కూడా ప్రారంభించాడు. వారం వారం (1946), గురజిడ (1959), మరో మూడు యాభైలు (1974) సొంతపీఠికలతో వెలువడ్డాయి. రావిశాస్త్రి రాసిన ఆరుసారాకథలలో రచన అనే సిద్ధాంతాన్ని శ్రీశ్రీ ప్రతిపాదించారు. ఇది వీరిలోని తార్కిక విమర్శకుణ్ణి దర్శింపజేస్తుంది. ఇలా ఏ రచన చేసినా దానిపై శ్రీశ్రీ ముద్ర ఉంటుంది. ఆ ముద్రే శ్రీశ్రీని సాహితీలోకాన్ని దాటి సామాన్య జనహృదయాలపై శాశ్వతంగా నిలిచిపోయేలా చేసింది.

***- అద్దంకి శ్రీనివాస్***



# కుంభ (జన) మేళా

మకర సంక్రాంతి పర్వదినాన ప్రారంభమైన హరిద్వార్ కుంభ మేళాలో దాదాపు 5 కోట్ల మంది భక్తులు గంగానదిలో పవిత్ర స్నానాలు చేశారు. గత ఏప్రిల్ 14న ఒక్కరోజే కోటి మంది భక్తులు ఈ కుంభ మేళాకు హాజరైనట్లు అధికార అంచనాలను బట్టి తెలుస్తోంది. ప్రయాగ (అల్హాబాద్)లో 2001లో 144 ఏళ్ల తరువాత జరిగిన మహా కుంభ మేళాకు ఆరుకోట్ల మంది భక్తులు ప్రపంచం నలుదిక్కులనుంచీ వచ్చినట్లు వివిధ సర్వేలద్వారా తెలుస్తోంది. విదేశాలనుంచే 10 లక్షల మంది మహా కుంభ్‌మేళాలో పాల్గొన్నారు. ఇది ప్రపంచ చరిత్రలో అతి పెద్ద "మానవ సమూహం"గా గుర్తింపు పొందింది.

ఇంతటి మహోత్సవం జరగడానికి వెనుక ఎన్నో పురాణ గాధలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా చెప్పుకొనే గాధ ఈ విధంగా సాగుతుంది.

సృష్టి జరిగినప్పుడు, దేవతలు కొన్ని బలహీనతలతో పుట్టారట. ఆ బలహీనతలు పోగొట్టుకొనే మార్గం చెప్పమని బ్రహ్మదేవుణ్ణి సలహా అడిగారట. సాగర మధనం చేస్తే అమృతం పుడుతుంది. దాన్ని తలా ఒక చుక్క తాగితే మీ బలహీనతలన్నీ పోతాయని బ్రహ్మ చెప్పారట. కానీ సాగరమథనం చేయడానికి దేవతల వర్గం ఒక్కటే సరిపోదు. వారికి అవతలి వైపుకూడా మరో వర్గం ఉంటేనే మథనం సాధ్యమవుతుంది. అప్పుడు దేవతల రాక్షసుల వద్దకెళ్లి, తమ ప్రతిపాదనను చెబుతారు. వారి మధ్య చర్చోప చర్చలు జరిగిన మీదట వచ్చే అమృతంలో చెరిసగం పంచుకొనేందుకు రెండు పక్షాలవారూ అంగీకరిస్తారు. ఒకవైపు దేవతలూ, మరోవైపు రాక్షసులూ కలిసి వాసుకీ అనే మహాసర్పాన్ని తాడులా మందర పర్వతాన్ని కవ్వంలా ఉపయోగించి వెయ్యేళ్ల పాటు సాగరమథనం చేస్తే అందులోంచి ఒక కుండెడు అమృతం వస్తుంది. ఆ అమృతాన్ని తాగితే, రాక్షసులు మరింత శక్తివంతులవుతారని, అది వారికి దక్కకుండా ఆ కుండను దేవతలు చాటుగా తీసుకెళ్లి పారి పోతుంటారు. వారి వెనుక రాక్షసులు పడతారు.



రెండు వర్గాల మధ్య 12రోజులు, 12 రాత్రులు యుద్ధం జరుగుతుంది. ఆ సమయంలో నాలుగు చుక్కల అమృతం భూమ్మీద పడుతుంది. ఆ చుక్కలు పడిన చోట్లే, హరిద్వార్, ప్రయాగ, ఉజ్జయనీ, నాసిక్ అని హిందువుల భావన. అందుకే అక్కడ కుంభ (కుండ) మేళాలు ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరుగుతుంటాయి. దేవతల ఒక రోజు, మానవుల ఏడాదికి సమానం అని కొందరి వాదన. అందుకే 12 ఏళ్లకు ఒకసారి ఆ నాలుగు పట్టణాల గుండా ప్రవహించే నదులలో నీరు అమృతంలా మారుతుందని హిందువుల విశ్వాసం. ఆ నదుల్లో స్నానం చేస్తే చేసిన పాపాలన్నీ హరించి పోతాయన్న నమ్మకంతో స్నానాలు చేయడానికి హిందూ భక్తులు కుంభ్ మేళాకు వెళ్తుంటారు.

## చరిత్రలో ప్రస్తావన

క్రీ.శ. 629-645 మధ్యకాలంలో హర్షవర్ధనుని ఆస్థానానికి వచ్చిన చైనాయాత్రికుడు హ్యూన్ సాంగ్ కుంభ్‌మేళా ప్రాశస్త్యం గురించి మొట్టమొదటి సారిగా రాసినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అయితే, వేదకాలం నుంచీ నదుల ఒడ్డున ఉత్సవాలు, మహా ఉత్సవాలు జరుగుతుండేవనీ పురాణ గాధల్లో ప్రస్తావన వస్తూనే ఉంటుంది. అందుకని, కుంభ్‌మేళా ఒక రకంగా హిందువుల అతి ప్రాచీన పర్వదినాలలో ఒకటిగా అందరూ భావిస్తుంటారు.

1786-1794 మధ్యకాలంలో థామస్ డేనియల్, విలియండేనియల్ అనే ఇద్దరు బ్రిటీష్ చిత్రకారులు హరిద్వార్ కుంభ్ మేళాకు హాజరయ్యారు. వారు గీసిన అనేక చిత్రాలు ఇప్పటికీ భద్రంగా ఉన్నాయి.

1830లో కెప్టెన్ థామస్ స్కిన్నర్ హరిద్వార్ కుంభ్‌మేళాను సందర్శించారు. వేలాది మంది జనం, రకరకాల వాహనాల్లో హరిద్వార్ వైపు యాత్ర సాగిస్తూ ఉంటే, వారిని దాటుకుంటూ వెళ్లామని, చిన్నా, పెద్దా, పేదా, ధనిక అన్న బేధం లేకుండా రంగురంగుల దుస్తుల్లో, వేరువేరు వేషభాషల్లో, వివిధ శరీరచ్ఛాయలుగల మనుషులను చూస్తుంటే, ప్రపంచంలో మరే యితర ప్రదేశమూ ఇలాంటి వైవిధ్యాన్ని కనపరచజాలదని ఖచ్చితంగా చెప్పవచ్చునని స్కిన్నర్ తన గ్రంధంలో రాశారు.

## మేళాలో ఆకర్షణలు....

లక్షలాది మందిని అంతగా ఆకర్షించే కుంభ్‌మేళాలో పవిత్ర స్నానాదులు కాకుండా ఏమేమి ఆకర్షణలు ఉంటాయి? విదేశీ యాత్రికులను బాగా ఆకర్షించేది 'నాగ బాబా'లు లేదా నాగసాధువులు. అట్ట కట్టిపోయిన బారు జడలతో, ఒంటిమీద ఎలాంటి ఆచ్ఛాదనా లేకుండా ఉండే సాధువులు, సన్యాసులు, యోగులు నది ఒడ్డున రకరకాల భంగిమల్లో, యంత్ర తంత్ర విద్యలను ప్రదర్శిస్తూ ఉంటారు. ఒకవైపు వేలాది మంది భక్తులు నదిలో స్కానం చేస్తుంటే, నది ఒడ్డున వీరు చేసే హంగామాను చూడటానికి వందలాది మంది వారిచుట్టూ గుమిగూడతారు. కొందరు దిగంబర బాబాలు ఒంటి కాలుపై





రేయింబవళ్లు ధ్యానముద్రలో ఉంటే, కొందరు వివిధ యోగాసన భంగిమల్లో ధ్యానం చేస్తూ ఉంటారు. వీరి విన్యాసాలు దేశ విదేశీ యాత్రికులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. వివిధ రకాల బాబాలు ఈ విధంగా ఉంటారు.

### పరివాజకులు

వీరు పూర్తిగా మౌనం పాటిస్తూ, జనం మధ్యలో తిరుగుతుంటారు. వారిదారికి అడ్డంవచ్చిన వారిని పక్కకు తొలగమని చెప్పేందుకు చిన్న గంటలను వాయిస్తూ ఉంటారు.

### శీర్షాసనులు

శీర్షాసనం (తల కింద పెట్టి) వేసి 24 గంటలపాటు ధ్యానం చేస్తూ ఉంటారు.

### కల్పవాసులు

మేళా జరిగినన్ని రోజులూ గంగా తీరంలో ఉంటూ, ధ్యానం, కర్మకాండలు చేస్తూ, రోజుకు మూడుసార్లు నదీస్నానాలు చేస్తుంటారు వీరు.

కొందరు సాధువులు రోజంతా సాష్టాంగ దండత్వద్ ముద్రలో ఉంటారు. మరికొందరు చెట్టుకొమ్మ నుంచి వేలాడుతున్నట్టుగా యోగాముద్రలో ఉంటారు.

నాగబాబాలు అనేక రకాల రుద్రాక్ష మాలలు ధరిస్తూ ఉంటారు. ఆ రుద్రాక్షలకు రోగాలను నయంచేసే శక్తి ఉంటుందని వారి నమ్మకం. 11,000 రుద్రాక్షలను ధరిస్తే శంకరుని అవతారంగా మారతారని కూడా సాధువులు చెబుతుంటారు.

### అఖాడాలు (క్యాంపులు)

నాగబాబాలు ఉండే శిబిరాలలో నిరంతరం హుక్కా (చిలుం) సిద్ధంగా ఉంటుంది. ఆ పక్కనే ఓ మట్టి కుండలో 'భంగు' (పాలు గంజాయి కలిపి చేస్తారు) కూడా ఉంటుంది. మాదక పదార్థాలు వాడటం తప్పేమీ కాదని, తమ నిత్యకృత్యాలలో అదో భాగమనీ, ఆచారాల్లో కూడా దానికి స్థానం కల్పించారు. మాదక ద్రవ్యాలు వాడితే త్వరగా నిర్వాణం పొందుతామని వారు చెబుతుంటారు. యాత్రికులు, ముఖ్యంగా విదేశీ యాత్రికులు, అభాడాలలో చేరి సాధువులతో పాటు మాదక ద్రవ్యాలు రుచి చూస్తూ ఆనంద పరవశులవుతుంటారు.

### వచ్చే ఆరేళ్లలో....

- 2013 అలహాబాద్‌లో జనవరి 27 నుంచి ఫిబ్రవరి 25 వరకు పూర్ణ కుంభమేళా
- 2015లో నాసిక్‌లో ఆగస్టు 15నుంచి సెప్టెంబర్ 13 వరకు అర్ధ కుంభమేళా
- 2016లో ఉజ్జయితిలో ఏప్రిల్ 22 నుంచి మే21 వరకు అర్ధ కుంభమేళా

### మేళాలో అపశృతులు....

సమాచార, ప్రసార రంగాలలో వచ్చిన అభివృద్ధి కారణంగా మేళాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చాలా ముందు జాగ్రత్తలు తీసుకోవడం వీలవుతోంది. కానీ, 1954 ఫిబ్రవరి 3వ తేదీ మాత్రం కుంభ మేళాల చరిత్రలో ఓ మాయని మచ్చలా ఉండి పోయింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అలహాబాద్‌లో జరుగుతున్న మొట్టమొదటి కుంభమేళా అది. ఆరోజు మౌనీ అమావాస్య పర్వదినం. పవిత్ర స్నానాలకు మంచి రోజుకూడా. గంగానదిలో స్నానాలు చేయడానికి లక్షలాదిమంది అక్కడికి చేరుకున్నారు. ఎక్కడో అపశృతి దొర్లింది. అంతే, ఒక్కసారే జనం ఉరుకులు పరుగులు ప్రారంభించారు. కనీ వినీ ఎరుగని రీతిలో తొక్కిసలాట జరిగింది. పిల్లలూ, స్త్రీలూ, వృద్ధులు జనం కాళ్ల కింద పడి నుజ్జు నుజ్జు అయిపోయారు. అనేక మంది నదిలో మునిగి పోయారు. ఆ మరుసటి రోజు 'ద గార్డియన్' పత్రిక, తొక్కిసలాటలో 800 మంది మృతి, వేలాది మందికి గాయాలు అనే పతాక శీర్షికలో వార్తను వేసింది. ఆ తరువాత కాలంలో ప్రభుత్వాలు మేల్కొని, పెరుగుతున్న భక్త గణానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయనారంభించారు. గత ఏప్రిల్‌లో ముగిసిన హరిద్వార్ కుంభమేళాలో చెప్పుకోతగ్గ ఘటనలేవీ జరగక పోవడమే దీనికి సాక్ష్యం.

### ముగింపు

సుప్రసిద్ధ అమెరికన్ నవలా రచయిత మార్క్‌ట్వైన్ 1895లో ఒక కుంభమేళాకు హాజరయ్యాడు. ''అదో అంతులేని యాత్ర. వయోవృద్ధులూ, బలహీనులు, యువకులూ, పిల్లలూ, స్త్రీలూ అంతా కలిసి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని సాగించే సుదీర్ఘ పాదయాత్ర. ఎన్ని కష్టాలు ఎదురైనా, ఎండైనా, వానైనా, చలైనా లెక్క చేయకుండా, మనోనిబ్బరం కోల్పోకుండా ముందుకు సాగుతుంటారు. వారిలో ఉన్న మత విశ్వాసమే వారినలా సుదీర్ఘ యాత్రలో నడవనిస్తోంది. వారి యాత్రను ఇష్టంగా చేస్తారో, కష్టంగా చేస్తారో నాకు తెలియదుగానీ, వారి యాత్రా, వారి విశ్వాసం మాత్రం నాలాంటి వారి ఊహకే అందనంతటి మహోన్నతమైనది అని ఖచ్చితంగా చెప్పగలను అని మార్క్‌ట్వైన్ తన జ్ఞాపకాలలో కుంభ్‌మేళా గురించి రాసుకున్నారు.

**- కె. ఎస్. రెడ్డి**





సామాజిక తనిఖీ

కాపాడుతామని ప్రమాణ స్వీకారం చేయటం ఉంటుంది. అయితే, ఈ సర్పంచ్‌లు నిజాయితీగా, న్యాయబద్ధమైన పద్ధతుల్లో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. అతి తక్కువ డబ్బును వెచ్చించారు. అందుకే 'పారదర్శకత' పై ప్రమాణ స్వీకారం చేయగలిగారు", అని అన్నారు.

"ఇప్పుడు ప్రతి ఒక్కరికీ తెలుసు - సర్పంచ్‌గా ఉంటూ నీతి నియమాలు పాటించటమంటే పెద్ద సవాలు వంటిదని. ఎందుకంటే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి కోటి రూపాయలు వరకు వీరి చేతికి వస్తున్నాయి." అని కూడా ఆయన అన్నారు.

# రహస్యం బదులు 'పారదర్శకత'

రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో గెలుపొందిన కొందరు గ్రామ సర్పంచ్‌లు తమ ప్రమాణ స్వీకార సమయంలో 'రహస్యం' బదులు 'పారదర్శకత' పై ప్రమాణం చేసి వినూత్న, విశిష్ట సాంప్రదాయానికి నాంది పలికారు. మొత్తం సర్పంచ్‌ల సంఖ్యతో పోలిస్తే వీరి సంఖ్య చిన్నదే కాని, వీరు గణనీయమైన సంఖ్యలోనే ఉన్నారు.

సాధారణంగా ప్రజా ప్రతినిధులు తమ ప్రమాణ స్వీకార సమయంలో అధికార రహస్యాలను కాపాడతానని ప్రమాణం చేయటం ఆనవాయితీ, అయితే, 'రహస్యం' పాటించటం కంటే 'పారదర్శకత' పాటించటం ఉత్తమమని భావించిన సర్పంచ్‌లు ఈ చర్య తీసుకోవటం ముదావహం.

అంతే కాక, తమ ఆస్తులను మొత్తం వెల్లడిస్తామని వీరు ప్రమాణ స్వీకారం చేశారు. వీలయినంత ఎక్కువ పారదర్శకత విధానంలో తమ బాధ్యతలు, విధులు నిర్వర్తిస్తామని కూడా వీరు ప్రతిజ్ఞ చేశారు.

మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్‌కి చెందిన నిఖిల్ డే ఈ విషయంపై వ్యాఖ్యానిస్తూ, "సాధారణంగా అనేక పదవులకు రహస్యాలు

వివిధ నిబంధనలు, ఆదేశాలు, చర్యల ద్వారా ప్రభుత్వం ఏం చేయాలని తాము కోరుకుంటున్నామో కూడా వీరు ఒక జాబితాను తయారు చేసి, ఆ మేరకు తీర్మానాన్ని ఆమోదించారు. గత ఏడాది కాలంలో జరిగిన పనులకు సామాజిక తనిఖీ నిర్వహించాలని వీరు కోరారు.

అంతే కాక, పంచాయితీ కార్యదర్శులు, రోజ్‌గార్ సేవక్ (ఉపాధి సహాయకులు) ల విధులు, బాధ్యతలు ఏమిటో స్పష్టంగా తమ తీర్మానంలో నిర్వహించారు. సమాచార హక్కు చట్టంలోని నిబంధనలకు పూర్తిగా కట్టుబడి ఉంటామని, ఉపాధి హామీ పథకంలో కాంట్రాక్టర్లపై, యంత్రాల వాడకంపై నిషేదం విధిస్తామని కూడా వీరు ప్రకటించారు.

అకౌంట్లు, ఆదాయాలు, ఖర్చులు, చేసిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులు, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు, చెల్లించవలసిన బకాయిలు మొదలైన వివరాలతో కూడిన స్టేటస్ రిపోర్టును తయారు చేయవలసిందిగా ఈ బృందంలోని సర్పంచ్‌లు ఇప్పటికే తమ గ్రామ












పంచాయతీల కార్యదర్శులకి లేఖ రాశారు.

"కొన్ని సార్లు మేం వ్యతిరేకించిన పథకాలు లేకపోతే వాటికి అమలు చేసిన విధానాల కింద చెల్లింపులు జరపడానికి బలవంతంగా సంతకం చేయవలసి వచ్చేది", అని బిల్వారా ఆసింద్ బ్లాక్‌లోని రూప్ పురా పంచాయితీ సర్పంచ్ శ్రీ సురేష్ వ్యాఖ్యానించారు.

"గతంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా కొన్న మెటీరియల్‌ను నేను వ్యతిరేకించాను. అయితే, ఇప్పుడు ఆ మెటీరియల్ కొనడానికి అయిన ఖర్చు 42 లక్షల రూపాయలను మంజూరు చేస్తూ బలవంతాన సంతకం పెట్టవలసి వచ్చింది," అని ఆయన నిరసన వ్యక్తం చేశారు.

స్టేటస్ రిపోర్ట్‌ను కోరుతూ తన పంచాయితీ కార్యదర్శికి లేఖ రాయగా, ఈ పద్ధతిలో పనిచేయటం తన వల్ల కాదని, బదిలీ చేయించుకుని వెళ్లిపోతానని ఆ కార్యదర్శి చెప్పినట్లు రాజ్‌సుమంద్ జిల్లాకు చెందిన రాము కరణ్ అనే సర్పంచ్ ఆవేదనతో తెలిపారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగమైన సామాజిక తనిఖీ అంటేనే పంచాయితీల్లో పనిచేసే అధికార గణం గజగజ వణికిపోతున్నట్లు ఒక సర్పంచ్ చెప్పారు. కనీసం ఏడాది కాలానికయినా



సామాజిక తనిఖీ జరగాలని ఈ బృందంలోని సర్పంచ్‌లు కోరుకుంటుండగా, అంతకంటే తక్కువ కాలవ్యవధిలోనే, తరచూ సామాజిక తనిఖీని ఇప్పటినుంచి చేపట్టాలని కొందరు దృఢంగా భావిస్తున్నారు.

''ఒక వేళ 'సామాజిక తనిఖీ' అనే పదాలకి వారు భయపడుతున్నట్లయితే, ఆ పదాలను వాడం. మాకు కావలసిందేమిటంటే, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మరింత పకడ్బందీగా అమలు జరగటం'' అని భన్వర్ సింగ్ అనే సర్పంచ్ వ్యాఖ్యానించారు.

అసలు తన పంచాయితీ పరిధిలోని ప్రజలకే సామాజిక తనిఖీ అంటే ఆసక్తి లేదని పాలి జిల్లాకు చెందిన ఒక సర్పంచ్ చెప్పారు.

ఏది ఏమైనా, వినూత్నమైన ఆలోచనలతో, నవ్యభావాలతో, ప్రజలకు మేలు చేయాలనే తపనతో , పదవికి న్యాయం చేయాలనే దృఢదీక్షతో ఉన్న ఈ సర్పంచ్‌ల బృందం తమ ఆశయాలను అందుకోవాలని, ఆ రాష్ట్రంలోని మిగిలిన సర్పంచ్‌లు, ఇతర రాష్ట్రాల్లోని సర్పంచ్‌లు కూడా ఈ బాటన నడవాలని కోరుకుందాం.

**- సురేష్ కుమార్**

(మార్చి 4, 2010 నాటి హిందూ పత్రిక సౌజన్యంతో)

# కవి జనాశ్రయుడు మల్లియ రేచన

**నన్నయ, తిక్కన, ఎఱ్ఱన కవీంద్రుల పుణ్యమా! అని మహాభారతాంధ్రీకరణ పూర్తి అయ్యింది. ఒక మహాకావ్యం తెలుగులో వెలుగు చూసింది. ఇది ఆంధ్రులు చేసికొన్న అదృష్టం.**

**అయితే, నన్నయ తెనుగు కవితకు ఆద్యుడు కదా! నన్నయకు పూర్వం తెలుగు లేకపోతే, దానిని గ్రంథస్థం చెయ్యదగిన కవితా సామగ్రి నన్నయ ఎలా సంపాదించుకోగలిగాడు. విత్తనం లేకుండగా ఇంతటి మహావృక్షం అప్పటికప్పడు ఎలా విస్తరించగలిగింది! నన్నయ కన్నా ముందుగా ఎవరో కవితామూర్తులు ఉండి ఉండాలి. లేకపోతే ఇది సాధ్యం కాదు.. ఈ ప్రశ్నలు ఈనాటివి కావు. ఏనాటి నుండో విమర్శకుల హృదయాలను కుదిపేస్తున్నాయి. కవులున్నారు, కవిత్వం కూడా నన్నయకు పూర్వం ఉంది, అని అంగీకరిస్తే నన్నయ ఆదికవి కాకుండా పోతాడు. మరొకరెవరో ఆదికవి పదవికి అభ్యర్థులుగా నిలబడతారు.**

ప్రాచీన కాలం నుండి సర్వప్రాదేశిక భాషగా విస్తరించింది సంస్కృత భాష. భారతదేశంలో వ్యాప్తి చెందిన భాషలన్నింటికి మూలం, ప్రాచీనం అయిన భాష, సంస్కృత భాష. 'అందుకో జనని సంస్కృతంబు సకల భాషలకును' అంటూ మన ప్రాచీన కవులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. అంటే తెలుగు, తమిళం, కన్నడం మొదలైన భాషలలో వచ్చిదంతా అనువాద సాహిత్యమే.

శైవులు, వైష్ణవులు, జైనులు తమతమ మతాలను అభివృద్ధి పరచుకోవడానికి, మతప్రచారానికి అనువుగా కొన్ని కావ్యాలు వ్రాశారు. ఆ కోవలో జైనసాహిత్యం కూడా అభివృద్ధిలోకి వచ్చింది.

కన్నడ సాహిత్యానికొస్తే పంపన అనునతడు ఆదికవి. ఈయన తమ్ముని పేరు జనవల్లభుడు. వీరికాలంలోనే క్రీ.శ. 940 ప్రాంతంలో మల్లియ రేచన అనే తెలుగుకవి ఉన్నాడు. రేచన కవిమాత్రుడే కాదు. ఎందరో కవులకు ఆశ్రయమైనవాడు. తన దగ్గరనున్న ద్రవ్యాన్ని ఇతరులకు దానం చేసి ఆశ్రయం కల్పించినవాడు. అందుకే మల్లియ రేచనను ఆ కాలపు కవులు కవిజనాశ్రయుడు అని ప్రశంసించారు. పంపన, జనవల్లభుల మాదిరిగా జైనుడైనప్పటికి తెలుగు కవులను, తెలుగు కవిత్వాన్ని ఆదరించి పోషించిన కవి, ఈయన గురువు పేరు వాదీంద్ర చూడామణి.

జనవల్లభుడు, రేచన మంచి ప్రాణస్నేహితులు. ఇరువురూ కవులు కావడం చేత సంస్కృతాది అనేక భాషలలోని కావ్యాలను గూర్చి కూలంకషంగా చర్చించుకొన్నారు. తెలుగు కవిత్వానికి రాచబాట వెయ్యాలని నిర్ణయించుకొన్నారు. ఈ కార్యక్రమానికి కవిజనాశ్రయుడైన మల్లియ రేచన నడుం కట్టుకొన్నాడు. దీనికి జనవల్లభుడు తన సహకారమందిస్తానన్నాడు. రేచన పేర 'కవిజనాశ్రయుడు' అనే లక్షణ గ్రంథం తయారు చెయ్యడానికి మార్గం ఏర్పాటు చేసుకొన్నారు. లక్షణ గ్రంథమనగానే ఛందస్సుకి సంబంధిత గ్రంథాన్ని నిర్మించాలని వీరి భావన. గురు, లఘువుల రూపకల్పన. గణాలు, యతి, ప్రాస,సూర్యగణాలు, ఇంద్రగణాలు, పద్యలక్షణం మొదలైన విషయాలన్నీ ఇవన్నీ సంస్కృత కావ్యాలలో ఉన్నాయి. తెలుగునకు అవే ఆధారం ఉంటాయి. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. ఈతని కాలంలోనే వేములవాడ భీమకవి అనే పేరుతో ఒక కవి ఉన్నాడు. ఈతడు ఏదంటే అది జరిగిపోతుంది. అటువంటి వర్ణాన్ని భీమకవి, వేములవాడ భీమేశ్వరుని ద్వారా పొందాడు. మల్లియరేచన, వేములవాడ భీమకవి ద్వారా కవిజనాశ్రయం అనే లక్షణ గ్రంథాన్ని వ్రాయించాడని, భీమకవికి కావలసినంత ధనం ఇచ్చాడని కొందరు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. దీనికి ఆధారంగా, ఈ క్రింది పద్యాన్ని ఉదాహరణగా చెబుతారు.

*వేములవాడను వెలసిన*
*భీమేశ్వరు కరుణగల్గు భీమకవి నే*
*గోమటి రేచన మీదను*
*నీ మహి గవులెన్న ఛందమేలమి రచింతున్*

అని కవిజనాశ్రయ గ్రంధావతారికలో ఉంది. సహజంగా కవి అయిన రేచన, భీమకవిని ఆశ్రయించాడని అనుకోవడం హాస్యాస్పదంగా ఉంటుంది. కనుక, తరువాతి వారెవరో ఈ పద్యాన్ని కవిజనాశ్రయంలో కలిపి ఉంటారు.

## తెలుగు సాహిత్య చరిత్ర

రేచన, కవిజనాశ్రయం వ్రాసేనాటికి ఏవేవో లఘు రచనలు ప్రచారంలో ఉండి ఉంటాయి. వాటిలో ఛందస్సుకి సంబంధించిన విషయాలను రేచన సంస్కరించి ఉంటాడు. ఆ కారణం చేతనే రేచన కాలం నాటి సీసపద్యాలలో, పద్యలక్షణాలున్నప్పటికీ కొన్ని కొన్ని చోట్ల గణభంగాలు, యతిదోషాలు కనబడుతూ ఉన్నాయి. సంస్కృతం, కన్నడముల కలయిక వలన ఏర్పడిన సరిక్రొత్త భాష తెలుగు. అందుకే తెలుగు తేట, కన్నడ కత్తురి (కస్తూరి) అని ఒక సామెత పుట్టింది.

రేచన రచించిన కవిజనాశ్రయాన్ని నన్నయభట్టు ఆధారంగా చేసుకొని మహాభారతాన్ని ఆంధ్రీకరించడానికి పూనుకొన్నాడు.

సమస్తమైన కావ్యకళలకు కావ్యం జన్మభూమి. కావ్య నిర్మాత, దానికి సంబంధించిన అన్ని విషయాలు తెలిసిన వాడై యుండాలి. ఇటువంటి విషయ జ్ఞానం లేనివాడు గ్రుడ్డెద్దు పొలం దున్నినట్లుంది.

కావ్యాలు, గద్యకావ్యం, పద్యకావ్యం, నాటకం అని మూడు విధాలుగా ఉంటాయి. పద్యరచన కన్నా గద్యరచన గొప్పదంటారు. 'గద్యం కవీనాం ని కషం వదంతి' అని గద్యరచన కవులకు ఒరపిడిరాయి వంటిదట. అలాగే 'నాటకాంతం హి సాహిత్యం' - అంటే నాటక రచనతో కవి సాహిత్యం ఎంతటిదో తెలుస్తుంది. నాటకంలో నాయకుడు,

ప్రతినాయకుడు (విలన్), మంత్రి, సేనాని, రాజగురువు, మహారాణి, చెలికత్తెలు, హాస్య పాత్రధారులు మొదలైన వారుంటారు. వీటిని ఉత్తమ పాత్రలు, మధ్యమ పాత్రలు, నీచపాత్రలు అని మూడు విభాగాలు చేశారు. వారి వారి అర్హతలను బట్టి భాష ఉంటుంది. ఇన్ని నియమాల పరంపరలతో కష్టపడుతూ, తన మెదడుకి కవి పదునుపెట్టి కవి రచన సాగించాలి. నాగవర్మ అనే తెలుగుకవి రేచనకు సమకాలికుడు.

సాధారణంగా కవులు తాము రచించిన కావ్యాలను మహారాజుల కో, కవిపోషకులకో, భగవంతునికో అంకితం ఇస్తారు. కాని, నాగశర్మ ఆ విధంగా చెయ్యలేదు. తన కావ్యాన్ని, తన జీవిత భాగస్వామిని అయిన భార్యకే అంకితమిచ్చాడు. ఇది చాలా గొప్ప విషయం. ఆ కావ్యంలో భార్యను రకరకాల సంబోధనలతో వర్ణించాడు.

మల్లియ రేచన గొప్ప పరాక్రమవంతుడు. సుందరాంగులను వశం చేసుకొనే విద్య ఈతని సొంతం. వైశ్యవంశంలో మణి వంటివాడు. చక్కని వ్యాపారవేత్త. కవి, కవిపోషకుడు. తొలి తెలుగు వెలుగుల జిలుగులకు ప్రరోచన మల్లియ రేచన, అని తెలుగు వారు చెప్పకోవల సిన వ్యక్తి ఈయన.

పొన్నమయ్య అనే కవి తెలుగులో ఆదిపురాణం అనే గ్రంథం రచించాడు. ఈయనకు సర్వదేవుడు అనే బిరుదు కూడా ఉంది. ఆదిపురాణంలోని కందపద్యాలకు, మల్లియ రేచన రచించిన కొన్ని కంద పద్యాలకు పోలికలు, తేడాలు కూడ వున్నాయి.

కందపద్యంలో నలము, జగణము, సగణము, భగణము, గగము అనే గణాలుంటాయి. రెండు నాలుగు పాదాలలో ఆరింట జగణం కాని, నలముగాని ఉండితీరాలి. జగణము బేసి గణంగా ఉండకూడదు. రెండు నాలుగు పాదాలలో చివర గురువు ఉండి తీరాలి. - ఇదీ కంద పద్యనియమం. కందములోని రెండవ నాల్గవ పాదాలలోని మొదటి గణము వరుసలో అయితే నాలుగవ గణంగా ఉంటుంది. ఈ గణంలో జగణం వాడుకోవచ్చు. కొందరు అది పాదంలో మొదటిది కనుక బేసిగణం, అని అక్కడ జగణం వెయ్యరు. ఈ పద్యం చూడండి -

*పరగిన విమల యశో భా*
*సుర చరితుడు భీమనాగ్రసుతు డఖిల కళా*
*పరిణతుడయ్యేను. భూ సురో*
*వరప్రసాదోచితప్రభువశ్రీ యుతుడై*

పై పద్యంలో క్రీ గీత గీచిన పదం జగణం. అయినా ధార, ధోరణి రసవంతంగా ఉన్నాయి. శ్రీశ్రీ మహాకవి కూడా తన 'సిరిసిరి మువ్వా' శతకంలో,

*జగణంతో జగడం కో*
*రగాదగదు. కాని, దాని తస్సా గొయ్యా*
*నగలాగ వెలుగును కదా!*
*చిగిర్చితే నాలుగింట సిరిసిరిమువ్వా!*

ఈ పద్యంలో రెండవ పాదంలోని 'రగాద', నాలుగవ పాదంలోని ''చిగిర్చి'' -పదాలు నాలుగవ గణంలో ఉన్న జగణాలు. ఇవి రస స్ఫూర్తిని కలిగిస్తున్నవే తప్ప, రసభంగానికి తావివ్వలేదు కదా! కాని, రెండవ పాదంలో 'ర' కారానికి 'త' కారం యతిగా వేశారు. 'రత' లకు యతి లేదు. ఇది ప్రామాదికమై ఉంటుంది. రేచన గారి కవిజనాశ్రయం తెలుగులో మొట్టమొదటి కావ్యం. పైగా లక్షణ కావ్యం.

చాలాకాలం వరకు కవిజనాశ్రయాన్ని వేములవాడ భీమకవి రచించాడనే అపప్రథ ఉంది. రేచన ప్రతి పద్యంలోను తనను గూర్చి చెప్పకొన్నాడు. అది ఆత్మశ్లాఘ అని కొందరన్నా, లేక అనుకొన్నా, అది పొరపాటు. ఇది యథార్థంగా మల్లియ రేచన కృతమే ననడానికో సాక్ష్యం. ఆయనదే మరో విషయం -

శిశువు జన్మించినపుడు తల్లి, బిడ్డకు పాలిస్తుంది. ఏవిధమైన అనుభవము లేని శిశువు, తల్లి దగ్గర పాలు త్రాగుతాడు. ఇది సహజాతం. అదే విధంగా క్రమంగా మాట్లాడడం, కూనిరాగాలు తీయడం మొదలైనవి చేస్తాడు. కట్టు, బొట్టు, జుట్టు మొదలైన అలంకారాలపై మోజు పడతాడు. వీటిలో సాహిత్యంతో పాటు సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం మొదలైన లలితకళల మీద అభిలాష ప్రదర్శిస్తాడు. ఇవన్నీ విద్యలే. విద్య ఏదయినా దానికి సాహిత్యం ప్రధానం.

శతాబ్దాల చరిత్రలో ఒకసారి సింహావలోకనం చేసుకొంటే ఆలయాల మీద శిల్ప విన్యాసం కనబడుతుంది. రాజుల పాలనలో ఆ కాలపు శిల్పం దర్శనమిస్తుంది. ఎన్ని రకాలుగా కేశాలనలంకరించుకొన్నారో ఆ శిల్పాలలో చూడవచ్చు. జుట్టుంటే ఏ కొప్పయినా అలంకరించుకోవచ్చునని అంటారు స్త్రీలు.. చేమకూర వేంకటకవి తల్లిదండ్రులు పెట్టని సొమ్ము పెన్నేరుల్ - ఆడు బిడ్డకు తల్లిదండ్రులు కొనిపెట్టని, లేక చేయించి పెట్టని అలంకారం ఏదయినా ఉందంటే అది పొడవైన జుట్టేనట.

కవి దృష్టిలో పడిన ఏవిషయమైనా మనోహరంగా సాహిత్యంలో సాక్షాత్కరిస్తుంది. అలనాటి పల్లెపడుచుల అనురాగ గీతాలు, దేశరక్షణ దక్షులైన పరాక్రమవంతుల వీరగాథలు, బాలనాగమ్మ, దేశింగురాజు, పలనాటివీరులు, లక్ష్మణ మూర్ఛ, ఊర్మిళాదేవి నిద్ర మొదలైన గాథలు రాగభరితంగా గానం చేస్తూ జనాల నువ్విళ్ళూరించేవారు జముకుల వారు. ఇవన్నీ జానపదుల కథలు, గాథలు. వీటికి ఛందోలంకార వ్యాకరణాదులుండవు. అయినా అది కూడా కవిత్వమే. రాగతాళబద్ధమైన కవిత్వం. కవిత్వానికి కావలసిన ఛందస్సు, అలంకారాలు, వ్యాకరణాలు పుట్టనికాలంలో, అంటే నన్నయకు పూర్వం ఈ రకమైన సాహిత్యం ఆవిర్భవించింది, ప్రజలనలరించింది.

మహారాజుల ఆస్థానాలలో నాట్యకత్తెలు ఉండేవారు. వారు హావభావ విన్యాసాలతో కొలువులోని వారిని మెప్పించేవారు. మహారాజుల మన్ననలకు పాత్రులై ఎన్నో బహుమానాలు పొందేవారు.

ఈ విషయాలన్నీ సాహిత్యం, గ్రంథస్థం కాక పూర్వం జనుల నలరించిన ప్రక్రియలు. సాహిత్యం, గ్రంథస్థమైన కాలంలో అనేకములైన కళలు వృద్ధి చెందాయి. మౌఖిక రూపంగా, జానపద సాహిత్యం బాగా వృద్ధి పొందింది. ఈ కోణాలనన్నింటిని దృష్టిలో నుంచుకొని, మల్లియ రేచన వివిధ రకాల ఛందస్సులకు రూపకల్పన చేశాడు. నన్నయగారు ఆంధ్రశబ్ద చింతామణి రచించిన తరువాత శాశ్వతమైన కవిత్వం, గ్రంథస్థం కాసాగింది. శాఖోపశాఖాలుగా విస్తరించింది.

*- వారణాసి వేంకటేశ్వర శాస్త్రి*

భారతదేశ జనాభాలో 2001 జనాభా లెక్కల ప్రకారం వికలాంగుల జనాభా 2.19 కోట్లు. మొత్తం జనాభాలో 2.13శాతం. వీరిలో 75 శాతం మంది వికలాంగులు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. కేవలం 47.5 శాతం (గ్రామీణ) 44.4 శాతం (పట్టణ) మంది మాత్రమే విద్యావకాశాలను పొందగల ుగుతున్నారు. ఉపాధి రేటు కూడా కేవలం 34శాతం మాత్రమే ఉంది.Unescap సర్వే ప్రకారం భారతదేశంలో 6 కోట్ల మంది వికలాంగులున్నారు.

ఆంధ్రప్రదేశ్ జనాభాలో దాదాపు 6 శాతం మంది అనగా 45 లక్షల మంది ఏదో ఒక వికలత్వంతో బాధపడుతున్నారు. అందులో 2% మంది తీవ్ర వికలత్వంతో బాధపడుతున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 13.65 లక్షల మంది వికలాంగులు ఉన్నారు. వీరిలో 5.82 లక్షల మంది అంధులు. 2.12 లక్షల మంది వినికిడి లోపం కలవారు, 4.16 లక్షల మంది చలన సంబంధ వికలాంగులు, 1.55 లక్షల మంది మానసిక వికలాంగులు. వీరిలో 8.47 లక్షల మంది వికలాంగ పెన్షన్లు పొందుతున్నారు. 10.50 లక్షల మంది వికలాంగులు ఎలాంటి పునరావాస కార్యక్రమ పరిధిలోనికి రాకుండా గ్రామీణ ప్రాంతాలలో ఉన్నారు. వికలాంగులలో 7.74 లక్షల మంది పురుషులైతే, 5.91 లక్షల మంది స్త్రీలు.




శాస్త్రీయ విధానం పాటించి వికలత్వ నిర్ధారణ చేస్తారు.

జి.ఓ.నెం. 16-18/97 తేదీ 1-6-2001 లోని మార్గదర్శక సూత్రాలను పాటిస్తారు. ఇప్పటి వరకూ శాస్త్రీయత ఆధారంగా చేస్తున్న మానవ నిర్ధారణ ఎక్కువ సమయం తీసుకుంటున్నది. కావున వికలత్వ నిర్ధారణ పరీక్షను పారదర్శకంగా, శాస్త్రీయంగా, సరిచూసుకోవటానికి వీలుగా, వైద్యుల పరీక్షలకు దీటుగా ఉండే విధానాన్ని, యంత్రాంగాన్ని (mechanism) తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇతర సంబంధిత శాఖల పై స్త్రీ, శిశు వికలాంగుల సంక్షేమశాఖతోను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ

# వికలత్వ నిర్ధారణ కోసం సరికొత్త సాఫ్ట్‌వేర్ ఆధారితా విధానం

వికలాంగుల చట్టం 1995 (సమాన అవకాశాలు, హక్కుల పరిరక్షణ, సంపూర్ణ భాగస్వామ్య చట్టం) ప్రకారం అంగవైకల్యం ఉన్న ప్రతి చిన్నారికి 18 సంవత్సరాల వరకు ఉచిత విద్యనభ్యసించే అవకాశం కల్పించడం, ప్రత్యేక పాఠశాలలలో వృత్తి విద్యను ప్రోత్సహించడం, మామూలు పిల్లలతో కలిసి మెలసి వుండేందుకు పాఠశాలలో తగిన వాతావరణం కల్పించడం, ప్రత్యేక విద్యావ్యవస్థకు రూపకల్పన చేయడం, నిరుద్యోగులైన వికలాంగులకు ఉద్యోగాలు కల్పించడం, ప్రభుత్వ, స్థానిక సంస్థల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందించడం, ఉద్యోగంలో ఉన్న వికలాంగులకు ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రభుత్వ లక్ష్యం.

40% అంగవైకల్యం కలవారు మాత్రమే చట్టం పరిధిలో వికలాంగుల ుగా గుర్తింపబడతారు. వికలాంగుల చట్టం 1995, సెక్షన్ 73, సబ్ సెక్షన్ (1), (2) ద్వారా దాఖలు పరిచిన అధికారం ద్వారా కేంద్ర ప్రభుత్వం 31-12-96 న నోటిఫై చేయబడిన వికలాంగుల చట్టం 1995 రూల్స్ 1996 ప్రకారం, వికలత్వ ధృవీకరణ పత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంచే కాని ఏర్పాటు చేయబడిన మెడికల్ బోర్డు ద్వారా జారీ చేయాలి. బోర్డునందు కనీసం ముగ్గురు వైద్య నిపుణులైన సభ్యులుండాలి. అందులో కనీసం ఒక్కరు స్పెషలిస్టు ఉండాలి. వికలత్వ ధృవీకరణ పత్రాన్ని వికలత్వ రకం, తీవ్రతలను డయాగ్నసిస్ చేసి జారీ చేస్తారు. అర్హత, సామర్థ్యం కలిగిన వైద్య వృత్తి నిపుణులచే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం

శాఖ, HMRI (SOFTWARE PROVIDER) సహాయ సహకారాలతో ఒక కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఆధారిత వ్యూహాన్ని రూపొందించింది.

మొదట ఈ సాఫ్ట్‌వేర్‌ని పైలట్ బేస్‌లో రంగారెడ్డి జిల్లాలోని 3 మండలాలలో అమలు చేశారు. తర్వాత కొన్ని మార్పులు చేర్పులతో రాష్ట్రమంతటా ఉపయోగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఈ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు అందుబాటులో ఉంచి ప్రతి ఒక్క వికలాంగుడికి ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా వచ్చే సర్టిఫికెట్, ఐడి కార్డును క్రొత్తగా జారీ చేయాలని నిర్ణయించారు. ఈ సాఫ్ట్‌వేర్ పేరు SADAREM (Soft to Assess Disiabilty for Access, Rehabilitation and Empowerment)

## సాఫ్ట్‌వేర్ ఫీచర్స్

ఈ సాఫ్ట్‌వేర్ నందు కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ జారీ చేసిన గెజిట్ 2001లో నిర్ణయించబడిన పద్ధతులు, సూత్రాల ఫార్ములా ప్రకారం, వికలత్వ తీవ్రత శాస్త్రీయంగా నిర్ధారించబడుతుంది. వికలత్వ రకం, తీవ్రత నిర్ధారణ అనేవి శాస్త్రీయ విధానం ద్వారా అన్ని రకాల వికలత్వాలను, తీవ్రతలను చివరి పారామీటర్ ప్రకారం నిర్ధారించే విధంగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌తో ఫార్ములాని రూపొందించారు. పట్టిక మొదటి భాగంలో డెమోగ్రాఫిక్, వ్యక్తిగత వివరాలను వాస్తవ ధృవీకరణ పత్రాల ఆధారంగా కంప్యూటర్

ఆపరేటర్ కానీ ఇతరులు కానీ పూరించాలి. ఉదా: పుట్టినతేదీ, స్థలం, అర్హత మొదలగునవి. ప్రతి వికలత్వానికి ఒక నిర్ధారణ పట్టికను వైద్య నిపుణులతో పూరించాలి.

## అవసరాల నిర్ధారణ

వైద్యపరమైన జోక్యాలు, చికిత్సాపరమైన జోక్యాలు, సహాయ ఉపకరణాల వంటి ఫంక్షనల్ అవసరాలు తెలుసుకోవడానికి ఈ సాఫ్ట్‌వేర్‌లో అవకాశం ఉంది. ఈ సమాచారం వికలాంగులు సాధికారత సాధించడానికి ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు ఉపయోగపడుతుంది.

## ధృవపత్రం గుర్తింపు కార్డు తయారీ

వికలాంగుల వివరాలను కంప్యూటరైజ్ చేసిన తరువాత సాఫ్ట్‌వేర్ వికలత్వ శాతం దానంతటదే లెక్క వేస్తుంది. 40% కంటే ఎక్కువ శాతం ఉన్నవారికి వికలత్వ ధృవీకరణ పత్రం, ప్రత్యేక గుర్తింపు కార్డు తయారవుతాయి. ప్రతి వికలాంగునికి ఒక యునిక్ ఐడి నెంబరు వస్తుంది. స్పెషలిస్టుల సలహాలతో వున్న ఒక రిపోర్డు ఇస్తారు. 40% కంటే తక్కువ ఉన్న వారికి సర్టిఫికెట్, ఐ.డి. కార్డు ఇవ్వరు. స్పెషలిస్టుల రిపోర్డు ఇవ్వబడుతుంది. తిరస్కరింపబడిన కేసులకు కూడా స్పెషలిస్టుల సలహాలతో వున్న ఒక రిపోర్డు ఇస్తారు.

## డేటా బేస్ జెనరేషన్

అన్ని సిస్టమ్స్ ఒకే సర్వర్ కలిగిన లాన్ సెట్టింగ్‌లో ఉండాలి. అన్ని సిస్టమ్స్‌లో ఫీడ్ చేసిన డేటా సర్వర్ నందు నిలువ చేయబడును. క్యాంపు చివరలో ఫీడ్ చేయబడిన డేటా External memory divice ద్వారా గ్రామీణాభివృద్ధి శాఖ వారికి అందజేయబడుతుంది. ఈ డేటాని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు వికలాంగులకు చెందిన వివిధ పథకాలలో, కార్యక్రమాలలో ఉపయోగించుకునే వీలుంది. ఈ SADAREM సాఫ్ట్‌వేర్‌ను నిర్దేశించిన ప్రభుత్వ ఆసుపత్రులలో ఇన్‌స్టాల్ చేసి దీని ద్వారా మాత్రమే ధృవపత్రాలు, గుర్తింపు కార్డులను మెడికల్ బోర్డు ఆధ్వర్యంలో జారీ చేస్తారు. HMRI వారి సౌజన్యంతో పి.డి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఈ సాఫ్ట్‌వేర్‌ను, డేటా బేస్‌ని నిర్వహిస్తారు.

## సాఫ్ట్‌వేర్ ద్వారా పొందే లాభాలు

ఈ సాఫ్ట్‌వేర్ వికలత్వ ధృవీకరణ పత్రం, గుర్తింపు కార్డును జనరేట్ చేస్తుంది. వీటిమీద మెడికల్ బోర్డు సభ్యులు సంతకం చేసిన తరువాత లామినేట్ చేసి సంబంధిత వ్యక్తులకు జారీ చేస్తారు. తిరస్కరించబడిన, అర్హులుకాని (40% కు తక్కువ) వారి కేసులకు సంబంధించి వారికి రిపోర్డు ఇవ్వడం, డేటాని స్టోర్ చేయడం చేస్తుంది. సెంట్రల్ సర్వర్‌కు అప్ లోడ్ చేసిన తర్వాత వెబ్ నందు వివిధ రకాలైన నివేదికలను వికలాంగులతో సహా అందరూ చూడవచ్చును. ఈ వెబ్ సైట్ నందు జిల్లాల వారీగా, మండలం వారీగా, పంచాయితీల వారీగా, హాబిటేషన్ వారీగానే కాకుండా ఒక వ్యక్తికి సంబంధించిన డేటాను కూడా చూడవచ్చును. ఈ డేటా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల ద్వారా వికలాంగులకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలలో ఉపయోగపడుతుంది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ఇవ్వబడిన సర్టిఫికెట్, ఐ.డి కార్డు ద్వారా ఇతర సౌకర్యాలైన బస్సు, రైల్వే రాయితీ పాస్‌లు యిస్తారు.

## ప్రక్రియ

*వికలాంగుల సమీకరణ :* వికలాంగులందరూ ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా క్రొత్త వికలత్వ ధృవీకరణ పత్రం పొందాలి. కావున శిక్షణ పొందిన వాలంటీర్లచే గుర్తించబడిన వికలాంగులను క్యాంపు ప్రదేశానికి పంపాలి. నిర్దేశించబడిన పంచాయితీ/ హాబిటేషన్ కు చెందిన వారినే క్యాంపునకు పంపాలి. యునిక్ ఐ.డిని ట్రాక్ చేసుకుని డేటాబేస్ నందు డూప్లికేషన్‌ని, ఓవర్ ల్యాప్ కాకుండా నిరోధించాలి. హాబిటేషన్ కోడ్ ఆధారంగా ఐ.డి. నంబరు జెనరేట్ అవుతుంది కావున ఒక హాబిటేషన్‌కు చెందిన వికలాంగుల నిర్ధారణ ఒకే క్యాంపునందే జరగాలి.



## క్యాంపు నిర్వహణ

క్యాంపు ప్రదేశం వికలాంగులకు సౌకర్యవంతంగానూ, ప్రణాళికా బద్ధంగానూ ఉంచాలి. వికలాంగులకు, వారి సహాయకులకు అందుబాటులో వాలంటీర్లనుంచవలెను. ఒక్కో వైద్య స్పెషలిష్టుకి వెలుతురు ఉన్న ప్రత్యేక గదిని కేటాయించాలి. నిరవధిక విద్యుత్ సరఫరా, జనరేటర్ సౌకర్యం ఉండాలి. వేచి ఉన్న వికలాంగులకు వారి హక్కులు, పథకాలు, లబ్ధిని చేకూర్చే కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని ,అవగాహనను కల్పించడమేకాక వేచి ఉండటంలో వుండే ఒత్తిడిని అధిగమించగలిగేటట్లు చేయాలి. సాఫ్ట్‌వేర్ ప్రొవైడర్ ద్వారా డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లా స్థాయిలో శిక్షణ ఇవ్వాలి.

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వారు రూట్‌మ్యాప్ ప్రకారం గ్రామాలకు వారి బస్సులను పంపి వికలాంగులను, వారి సహాయకులను క్యాంపు ప్రదేశానికి తీసుకుని వచ్చి మరల నిర్ధారణ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత వారివారి స్థలాలలో వదలాలి. వికలాంగులకు బస్సు టికెట్‌లో రాయితీని (50% జిల్లా సర్వీసుల్లోను, 100% అర్బన్ సబర్బన్ సర్వీసెస్) కల్పించాలి. ప్రాథమిక స్థాయి ఐడింటిఫికేషన్ అధికారులు వారిని క్షేమంగా చేర్చడమనే బాధ్యత తీసుకోవాలి. వికలాంగుల ప్రాథమిక స్థాయి గుర్తింపు / స్క్రీనింగ్‌లు అంగన్‌వాడీ వర్కర్, ఇందిరాక్రాంతి పథం సిబ్బంది ద్వారా జరగాలి. వీరికి టి.ఓ.టి ల ద్వారా శిక్షణ ఇవ్వాలి. టి.ఓ.టి లకు జిల్లా కలెక్టరు శిక్షణ ఇప్పించాలి.

జిల్లా కలెక్టరు అంగన్ వాడీ వర్కర్లకు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి, పంచాయితీ సెక్రటరీలు, వి.ఆర్.ఒ. బిల్లు కలెక్టర్లు, పట్టణ ఇందిరాక్రాంతి పథం సిబ్బంది, రాజీవ్ విద్యా మిషన్ సిబ్బంది, గ్రామ

సమాఖ్యలకు ప్రాథమికస్థాయి స్క్రీనింగ్ కోసం ఒక్కొక్కరికి కొన్ని ఇళ్లు/ హాబిటేషన్లు/ వార్డులు కేటాయించాలి. అలాగే ఇతర శాఖల సిబ్బందికి అన్ని స్థాయిలలో ప్రత్యేక విధులు కేటాయించాలి.

ప్రాథమిక స్థాయి గుర్తింపు / స్క్రీనింగ్ చేసే సిబ్బంది ప్రతి హాబిటేషన్లోని ప్రతి ఇంటిని దర్శించి వారికి ఇచ్చిన శిక్షణాంశాల ప్రకారం వికలాంగులకు సంబంధించిన సమాచారాన్ని నమూనా పత్రం (ఫార్మాట్) నందు పూరించి మండల అభివృద్ధి అధికారి/ మున్సిపల్ కమీషనర్‌కు అందజేయాలి. ఈ సర్వే ప్రారంభానికి ముందే ఆ గ్రామానికి చెందిన వికలాంగుల జాబితా ఎం.పి.డి.ఓ. ప్రాథమిక స్థాయి గుర్తింపు సిబ్బందికి అందజేయాలి. మండల అభివృద్ధి అధికారి/ మున్సిపల్ కమీషనర్ నమూనా పత్రాలను ఆ జిల్లా డి.ఆర్.డి.ఏ.పి.డి. కి పంపాలి. డి.ఆర్.డి.ఎ.పి.డి. నమూనా పత్రాలను అంతకుముందే ఇన్‌స్టాల్ చేయబడిన సాఫ్ట్‌వేర్ ద్వారా కంప్యూటరైజ్ చేయిస్తారు.

ప్రాథమికస్థాయిలో గుర్తించబడిన సంఖ్యను బట్టి జిల్లా కలెక్టరు ఎన్ని మెడికల్ బోర్డులు ఏర్పాటు చేయాలి, కావలసిన మెటీరియల్, తాత్కాలిక సిబ్బందిని అంచనావేసి జిల్లాకు సంబంధించిన క్యాంపుల షెడ్యూలును తయారుచేసి ప్రాథమిక స్థాయి గుర్తింపు సిబ్బంది ద్వారా వికలాంగులకు తెలియజేయాలి. కలెక్టరుచే ఇవ్వబడిన రూట్ మ్యాప్ ప్రకారం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులు నడపాలి. మండల అభివృద్ధి అధికారి ప్రతి హాబిటేషన్ వారీగా గుర్తింపబడిన వికలాంగుల కోసం ఒక ప్రత్యేక శాశ్వత రిజిష్టరును ఇవ్వబడిన ప్రొఫార్మాతో నిర్వహించాలి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

అన్ని అంచనా శిబిరాలు పూర్తయిన తరువాత వచ్చిన డేటా బేస్ సెర్ప్ ద్వారా పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచబడి ఎంతోమంది వికలాంగుల కోసం పనిచేసే సర్వీస్ ప్రొవైడర్స్‌కు ఉపయోగపడుతుంది. వికలత్వ నిర్ధారణకు సంబంధించిన రికార్డులు జిల్లా హాస్పిటల్స్‌లోని సూపరిండెంట్ ఆధీనంలో ఉంటాయి.

## సాధారణ మార్గదర్శకాలు

- బహుళ వికలత్వం ఉన్న వ్యక్తి క్యాంపు నందు సంబంధిత స్పెషలిస్టు దగ్గరకు వెళ్ళి ఎక్కువ స్థాయిలో ఉన్న వికలత్వాన్ని నిర్ధారించుకోవాలి.
- వ్యక్తులకు స్క్రీనింగ్ చేసే ప్రాథమిక స్థాయి అధికారులకు ముందుగా సరైన అవగాహన కల్పించి హార్డ్ కాపీ పత్రాలు పూరించేటపుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- నైపుణ్యంగల డేటా ఎంట్రీ ఆపరేటర్‌లను నియమించి వారికి తగు సూచన ఇవ్వాలి. డేటా ఎంట్రీ చేసేటపుడు డేటా ఎంట్రీ ఆపరేటర్లు తగు జాగ్రత్తతో, అప్రమత్తతతో వ్యవహరించాలి. గుర్తింపు చిహ్నాలు మొదలైనవి రాసేటపుడు వ్యాకరణదోషాలు ఉండరాదు.
- తిరస్కరించబడిన, అర్హతలేని కేసులకు తగు కౌన్సిలింగ్ ఇవ్వాలి.
- విద్యుత్ సరఫరాలో లోపాలు, అవరోధాలు లేకుండా చూసి సాఫ్ట్‌వేర్ (ఆపరేటింగ్ సిస్టమ్), హార్డ్‌వేర్ (హార్డ్‌డిస్క్) విఫలం కాకుండా చూడాలి.
- వికలాంగులు వేచి ఉండే సమయం తక్కువగా ఉండేలా చూసి క్యాంపు వద్ద తీసుకునే సమయం, విధానం గురించి వికలాంగులకు, వారి సహాయకులకు ముందే అవగాహన కల్పించాలి.
- అత్యవసర పరిస్థితులైన అగ్ని ప్రమాదం, వైద్య సహాయం ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలి. క్యాంపులో రక్షణ, లైటింగ్, మంచినీరు సౌకర్యం తప్పక కల్పించాలి.
- క్యాంపునకు వచ్చే ప్రతి ఒక్కరు తెల్ల రేషన్‌కార్డు తెచ్చుకొనేలా చూడాలి.

జిల్లాలో జిల్లా కలెక్టరు ఛైర్మన్‌గాను, డి.ఆర్.డి.ఎ.పి.డి. కన్వీనర్ గాను, జిల్లా వైద్యాధికారి, ఆరోగ్య సేవల జిల్లాకో-ఆర్డినేటర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంటు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి, జిల్లా వికలాంగ సంక్షేమ అధికారి, పట్టణ ఇందిరాక్రాంతి పథం పి.డి., రాజీవ్ విద్యా మిషన్ పిడి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సభ్యులుగా ఉన్న జిల్లా స్థాయి కమిటీ క్యాంపుల నిర్వహణ, మెడికల్ సర్టిఫికెట్, ఐ.డి కార్డు జారీ బాధ్యత వహించి భవిష్యత్తులో కూడా ఈ సాఫ్ట్‌వేర్ ద్వారానే సర్టిఫికెట్ జారీ అయ్యేలా చూడాలి. అర్హత గల అందరు వికలాంగులు కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రస్తుతం సర్టిఫికెట్ పొందేలా చూడాలి.

ప్రతి హాబిటేషన్‌కు ప్రత్యేకమైన తేదీలలో క్యాంపు ఉండేలా షెడ్యూలు తయారు చేయాలి. కేటాయించబడిన సమయంలో 50 మందికి మించి వికలాంగులను నిర్ధారణ పరీక్షలకు పిలవకూడదు. .స్క్రీనింగ్ తర్వాత నిర్ధారణ పరీక్ష హాబిటేషన్ వారీ జరగాలి. క్యాంపుల వద్ద ఉన్న వారికి తగు అవగాహన కల్పించి కార్యక్రమం మొదలు పెట్టాలి. పదిమందికి ఒక వాలంటీర్‌ను క్యాంపు వద్ద ఉంచాలి.

జిల్లా కలెక్టరు ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, ప్రతి ఒక్క వికలాంగుడు ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా కొత్త సర్టిఫికెట్, ఐ.డి కార్డు తీసుకునేటట్లు చేసి పాత సర్టిఫికెట్ చెల్లుబాటు కాకుండా ఉండే కట్ - ఆఫ్ డేట్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం G.O.Ms. No.371, PR & RD (RD-III) Department Dt.2-12-2009 ద్వారా మార్గదర్శకాలు, ఆదేశాలు జారీ చేసింది.

శరీర అవయవాలన్నీ సక్రమంగా వున్న వారికి జీవన గమనంలో ఎవరి సాయం అవసరం ఉండకపోవచ్చు. కానీ వికలాంగుల పరిస్థితి అలాకాదు. కళ్ళు లేనివారిని మువ్వల చేతి కర్ర ముందుకు నడిపిస్తే, వినికిడి లోపం ఉన్న వారు వినికిడి మిషన్ మీద ఆధారపడ వలసివస్తుంది.

శారీరక లోపంతో అవస్థ పడేవారు సాధారణ మనుషులలాగే తిరిగేందుకు చక్రాలకుర్చీలు, చేతికర్రలూ ఉపయోగపడ్తాయి. అయితే ఇవన్నీ వైకల్యం తాలూకు ఇబ్బందిని తగ్గించి తమ పని తాము చేసుకోవడంలో కాస్త చేయూతనిస్తాయి. కాని వారి సమస్య అంతటితో తీరదు. వారు కూడా మామూలు మనుషులలాగే బ్రతకాలి. చదువుసంధ్యలు నేర్వాలి. జీవనోపాధిని సంపాదించుకోవాలి. వైకల్యంతో వారు నిరాశ, నిస్పృహలకు లోనుకాకుండా ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలి. వికలాంగుల పట్ల సానుభూతి చూపడం కాకుండా చేయూత అందిద్దాం.

**– ఎ. ప్రశాంతి,** *సీనియర్ ఫ్యాకల్టీ, ఐ.టి.సి. కాళహస్తి*

# మురికి మూర్ఖులు

'సరసి'

వీత్తలుపు తీశాడు జనాభారావు. జనాభారావు అసలు పేరు 'పంకజ నాభ రావు'. ప్రజలు సేవ చెయ్యడం కోసమే వాళ్ల నాన్న గారు జనాభారావని పేరు పెట్టారని ప్రపంచం భ్రమ పడి అందరూ ఆ పేరుతోనే పిలవడం, అతడు పలకడం జరిగిపోతోంది. అతడికి లేని అభ్యంతరం మనకెందుకని అర్థం తెలిసిన పండితులు మాట్లాడకూరుకున్నారు.

తలుపు తియ్యగానే ఎదురుగా ధనుర్ధారి గారు! ''మళ్లీ డ్రైనేజీ బ్లాకయిపోయిందండీ. మీరు కాస్త బుష్కోటూ, పంట్లామూ తొడుక్కురాకూడదూ, అలా తాళ్లబస్తీకి వెళ్లి సుబ్రమణ్యాన్ని పిలుచుకొద్దాం, శుభ్రం చేస్తాడూ'' అన్నాడాయన.

''మొన్ననే కదండీ మొత్తం అంతా క్లీన్ చేశాడూ? పది రోజులు కూడా కాలేదు, అప్పుడేనా?'' అంటూ, బట్టలు మార్చుకుని బయల్దేరాడు జనాభారావు.

* * * * *

**కా**లనీ కొత్తగా వెలిసినపుడు, ముందుగా ఇళ్లు కట్టుకున్న ఓ ఇరవై మంది సొంత డబ్బులు వేసుకుని అండర్ డ్రైనేజీ కట్టుకున్నారు. తర్వాత తర్వాత ఇళ్లు కట్టుకున్న వాళ్లు ఆ డ్రైనేజీకి కనెక్షన్లు ఇచ్చేసుకున్నారు వాళ్ల వాళ్ల ఇళ్లల్లోంచి. ''మేం డబ్బులు వేసుకుని కట్టుకున్నాం మీరు కూడా ఇవ్వాలి'' అని పాతవాళ్లు అడిగితే ఒకళ్లిద్దరిచ్చారు. ఒకళ్లిద్దరు కొద్దిగా ఇచ్చి నమస్కారం చేశారు. ఒకళ్లిద్దరు తర్వాత చూద్దామన్నారు. (తర్వాత ఎప్పటికీ చూడలేదు) ఒకళ్లిద్దరు ఎప్పుడడగడానికి వెళ్లినా 'లైఫ్‌లాంగ్ ఫ్రీ టాక్ టైం' సెల్‌ఫోను తీసి మాట్లాడటం ప్రారంభించడం, అది ఎప్పటికీ అవ్వకపోవడం, వచ్చిన వాళ్లు విసిగి వెళ్లిపోవడం జరిగేది. ఒకళ్లిద్దరు డైరెక్టుగా 'డబ్బులేం ఇవ్వం, కాదంటే డ్రైనేజీని వీధిలోకి వదుల్తాం, మీ ఇష్టం'' అని బెదిరించేరు.

''అంత పని చెయ్యకండి, ఇవ్వకపోయినా ఫరవాలేదు'' అన్నారు పాత వాళ్లు చేతులు జోడించి.

ధనుర్ధారి, జనాభారావు కూర్చుని ఒక సర్క్యులర్ తయారు చేసి, ప్రతి ఇంటికీ వెళ్లి, 'డ్రైనేజీ సమస్యలన్నీ చర్చించుదాం, రేపు మీటింగుకి రండి' అని పెళ్లికి పిలిచినట్టు పిలిచారొకసారి.

అప్పుడు వచ్చిన జవాబుల్లో మచ్చుకి నాలుగు - (1) ''ఈవినింగా?



హాస్య కథల పోటీ విభాగంలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ

మాణింగైతే వచ్చేవాణ్ణండీ!''- (2) ''సెలవునాడు పెట్టండి, అయినా ఉన్న ఒక్క సెలవునాడు కూడా వెధవ డ్రైనేజీ మీటింగులేమిటండీ, ఛండాలంగా?'' (3) ''సారీ! స్టేట్సు నించి మా బావమరిదొచ్చాడు. వాడితో స్పెండ్ చెయ్యకపోతే హి ఫీల్ సంవాట్. . యు నో...'' (4) ''వృకోదరం ఇంట్లోనా? రోడ్డు మీద చాపేసి రమ్మన్నా వస్తాను గానీ, వాడింట్లో మీటింగు పెడితే మాత్రం నేను రాను. కావాలంటే మాయింట్లో పెట్టుకోండి. కాని, వాడు మాత్రం నా గడప తొక్కడానికి వీల్లేదు''.




* * * * *

డ్రైనేజీ బ్లాకు అయిపోతే ముందుగా నీళ్లు ఎగదన్నేది పల్లంలో ఉన్న ధనుర్ధారి గారికే. అంచేత నడుం కట్టుకున్నా, నలుగుర్నీ కూడగట్టుకున్నా ఆయనే చేయాలి. పైగా ఆయనే రిటైరై కాస్తంత తీరిగ్గా వున్నవాడు. మిగిలిన వాళ్లంతా ఉద్యోగస్తులే. పొద్దున్నే పోయి రాత్రికి వచ్చేవాళ్లే. అప్పుడప్పుడు ఆయనకు కాస్తో కూస్తో సహకరించేది జనాభారావొక్కడే.

డ్రైనేజీ క్లీన్ చేయించడానికి మెయింటెనెన్సు కోసం నెలకి ఇంటికి ఇరవై రూపాయల చొప్పున ఇవ్వాలని నిర్ణయించి, ఏడాదికి ఒక్కసారి కట్టేస్తే రెండు వందలని తేల్చారు చివరికి.

''ఏడాదికొక్కసారి కట్టలేం, నెలనెలా ఇస్తాం. నెలనెలా రాలేరా? రాలేకపోతే మానెయ్యండి'' అని కొందరు, ''మేము అద్దె వాళ్లం, మా ఇంటి వోనర్ని అడగండి'' అని కొందరు అన్నారు. ''అదేంటమ్మా, ఇల్లు వాడుకునేది మీరు కాబట్టి, మీరు ఇవ్వాలి కదా; నెలకి ఇరవయ్యేగా అడిగింది; నాలుగు వాటాల వాళ్లున్నారు, నలుగురికీ ఐదేసి రూపాయల చొప్పున పడుతుంది'' అని అంటే - ''ఇరవయ్యా అరవయ్యా అన్నది కాదండీ క్వశ్చను, పోలసీ! పోలసీ గురించి చెబుతున్నాం. మెయింటెనెన్సు కింద మా దగ్గర్నుంచి ప్రతి నెలా వంద వంద గుంజుతున్నాడు మా వోనరు. ఆయనే ఇస్తాడు డ్రైనేజీ కూడా'' అన్నారు అద్దెకున్న వాళ్లంతా ముక్త కంఠంతో.

తర్వాత ఒక్కసారి అలా అద్దెలు వసూలు చేసుకోడానికి వచ్చిన ఒక ఇంటి వోనర్ని పట్టుకున్నాడు ధనుర్ధారి గారు. నాలుగువేల రూపాయల అద్దె వసూలు చేసుకున్న ఆ పెద్దమనిషి, ధనుర్ధారి గారి చేతిలో ఓ ఇరవై పెట్టి, ''వచ్చేనెల మొత్తం ఏడాదికీ కట్టేస్తా, ఒకే?'' అంటూ హడావుడిగా వెళ్లిపోయాడు.

తర్వాతి నెల నించి, అర్థరాత్రి పూట కాలనీ అంతా పడుకున్నాక పిల్లిలాగా వచ్చి, అద్దెలు వసూలు చేసుకుపోవడం ప్రారంభించాడాయన. అది గమనించి ఒక నెల ఫస్టు వీక్ అంతా ధనుర్ధారి, జనాభారావు నల్ల రగ్గులు కప్పుకుని ఆ ఇంటి కాంపౌండువాల్ పక్కన రాత్రంతా జాగారం చేసి, అర్థరాత్రి ఒంటిగంటకు అతడిని పట్టుకున్నారు. మళ్లీ ఓ ఇరవై చేతిలో పెట్టి, ''చిల్లర లేదు. వచ్చే నెల మొత్తం జమ కట్టేస్తాగా'' అంటూ మళ్లీ జారుకున్నాడతడు.

ప్రతి నెలా ఇలా వంతులు వేసుకుని కాపు కాస్తున్నారని తెలిసి, బిచ్చగాడి వేషంలోనో, గోనె సంచితో చిత్తు కాగితాలు ఎత్తుకునేవాడిలాగానో వచ్చి, అద్దెలు వసూలు చేసుకుపోతున్నాడని పుకారు బయల్దేరింది. ''ఛ ఒక్క ఇరవై రూపాయల కోసం ఇన్ని ఏసాలా, ఆయనకి లేకపోతే మీకన్నా వుండొద్దా బుద్ధీ? నేనిస్తా ఆ ఇరవై రూపాయలూ'' అంటూ ఆ ఇంటి పనిమనిషి రొంటిలోంచి తీసి డబ్బులివ్వబోయింది. అద్దెకున్న వాళ్లు సిగ్గుపడలేదు. ''ఇవ్వనీ, అది బాత్రూం వాడుతోందిగా!'' అన్నారు చిన్నగా.

* * * * *

**తా**ళ్ల బస్తీ చేరుకుని, సుబ్రహ్మణ్యం ఇంటికి వెళ్లేరు ధనుర్ధారి, జనాభారావులు.

''లేడండి. పైకెలిపోయాడు'' అంది అతడి పెళ్లాం. ''పైకా? అయ్యో, మొన్నేగా కనిపించాడూ? ఏం జబ్బు?''

''జబ్బేంటయ్యా చెట్టు పైకెల్లాడంటే? అదిగో''అంటూ ఇంటి వెనక తాడి చెట్టు పైనున్న మొగుణ్ణి చూపించింది. ''రెండ్రోజుల్దాకా దిగడు'' అంది తాపీగా మళ్లీ.

''రెండు రోజులే! నీకు దణ్ణం పెడతానమ్మా. ఎంత అడిగితే అంత ఇస్తా. పనుంది కిందికి రమ్మను'' అంటూ ధనుర్ధారి గారు ప్రాధేయపడ్డాడు.

ఆమె నోట్లో తంబాకు తుపుక్కున ఉమ్మి బొడ్లోంచి సెల్‌ఫోను తీసి చెట్టు మీదున్న మొగుడితో మాట్లాడింది. సుబ్రమణ్యం కిందికి దిగేడు.

అతడిని సగౌరవంగా కాలనీకి తీసుకెళ్లి దగ్గరుండి, ఒక్కొక్క డ్రైనేజీ మ్యాన్‌హోల్ మూతనీ తీయించి క్లీన్ చేయించసాగారు ధనుర్ధారి, జనాభారావులు. పైపుల్లోపలికి వెదురు బద్ధలతో పొడిచి, కొన్ని చోట్ల లోపలికి దిగి క్లీన్ చెయ్యసాగేడు సుబ్రమణ్యం. క్లీన్ చేశాక ఆ మ్యాన్‌హోల్‌కు దగ్గర్లో ఉన్న ఇంట్లో వాళ్లని లోపల బాత్‌రూమ్‌లో నీళ్లు పొయ్యమన్నాడు. అలా ప్రతి ఇంటికీ వెళ్లి నీళ్లు పొయ్యమని చెప్పి, ఆ నీళ్లు సాఫీగా బయటకు వస్తున్నట్లు నిర్ధారించుకోసాగేడు.

''మేం కాసేపున్నాక స్నానాలు చేస్తాం. అప్పటిదాకా వుండి, నీళ్లు

బయటకు వస్తున్నాయో లేదో చూచుకోండి నాయనా. ఉట్టినే నీళ్లు వొంపితే ఎవరు తాగినట్టు చెప్పండి'' అంది ఓ ఇంటావిడ కిటికీలోంచి చూస్తూ.

''నీళ్లే పొయ్యాలా?'' అన్నాడొకాయన ఇంకో ఇంట్లోంచి.

మరో ఇంటి దగ్గర మ్యాన్‌హోల్ క్లీన్ చేస్తూ వుండగా ఆ ఇంటి ముందు ఆటో ఆగింది. అందులోంచి చంటి పిల్లనెత్తుకుని ఒకామె సామానుతో సహా దిగింది. ఇంటాయన తలుపు తీశాడు.

''ఏంటమ్మా. తుక్కు వేరేగా పారేసుకోవాలి గానీ, ఇట్టా డ్రైనేజీలో ఏస్తే ఎట్టా'' అంటూ ఓ జుట్టు వెంట్రుకల తుట్టెని ఎత్తి చూపించాడు సుబ్రమణ్యం. ఆటో దిగి లోపలికి వెళ్లబోతున్న ఆ ఇల్లాలు ఒక్కసారి వెనక్కి తిరిగి ''ఏదీ చూపించు'' అంటూ ఆ జుట్టుని విప్పించి చూసింది. ''ఏవండీ ఇలా రండి'' అంటూ, భర్తని పిలిచి, ''నేను పురిటికి వెళ్లి ఆర్నెల్లయ్యింది. మనింట్లోంచి ఇంత పొడువాటి తలవెంట్రుకలు ఎలా వచ్చేయ్? ఎవత్తది? ఎన్నాళ్లమట్టి సాగుతోంది వ్యవహారం. లోపలికి పదండి చెబుతా'' అంటూ భర్తతో సహా లోపలికి వెళ్లి తలుపేసేసింది. తర్వాత కొన్ని హృదయవిదారకమైన ఆర్తనాదాలు బయటకు వినిపించాయి.

మరో ఇంటి గుమ్మంలో న్యూస్‌పేపరు చదువుకుంటూ కూర్చున్నాడొక పెద్దాయన పెద్ద పెద్ద మీసాలతో. ''నీళ్లా? మా ఆవిడ బయటకెళ్లింది, వచ్చేక పోస్తుంది. నేను పోస్తే తిట్టిపోస్తుంది. మీకు తెలుసుగా హి హి'' అంటూ ఓ చేతకాని నవ్వు నవ్వేడు. అతడికి స్వతంత్రం రావాలని ప్రార్థించి ముందుకు నడిచారు ముగ్గురూ.

తర్వాత ఇంకోచోట చూస్తే మ్యాన్‌హోల్ మీద మూతలేదు. నాలుగిళ్ల అవతల ఓ ఇంటి గుమ్మం ముందు మెట్టులాగా సేవలందిస్తున్న ఆ మూత కనిపించింది. ''అయ్యో, ఎవరు వేశారిదీ? రాత్రి లేదే?'' అంటూ ఇంటావిడ ముందే ఆశ్చర్యపడిపోయి, బుగ్గలు నొక్కేసుకుంది, ఎవరూ ఇంకేమీ అనే అవకాశం ఇవ్వకుండా. ''రాత్రిపూట దేవతలు వొచ్చి యేసుంటారమ్మా'' అంటూ సుబ్రమణ్యం ఆ మూతని మోసుకొచ్చి మ్యాన్‌హోల్ మీద కప్పేడు.

''ఇదిగో సార్. మొత్తం అంతా ఇక్కడే అడ్డడిపోయిందీ! ఈ ఇంట్లోంచి ఎంత తుక్కు, కొబ్బరి పీసు, అన్నం మెతుకులూ పడ్డాయో సూడండిందులో!'' అంటూ సుబ్రమణ్యం ఓ ఇంట్లోంచి మ్యాన్‌హోల్‌కి డైరెక్టుగా ఉన్న కనెక్షన్‌ని, అక్కడి తుక్కుని చూపించాడు.

కాలింగ్ బెల్ కొట్టగానే ఆ ఇంట్లోంచి భీకరంగా కుక్క అరుపు వినిపించింది. తర్వాత తలుపు తెరుచుకుంది. గొలుసుతో కుక్కని వెనక్కి లాగుతూ వచ్చాడొకాయన. ''మా వియ్యంకుడూ, వియ్యపురాలూ వున్నారింట్లో. వాళ్ల ముందు ఈ డ్రైనేజీ వ్యవహారాలు, కంపు మాటలూ మాట్లాడను. ముందు వీణ్ణి దూరంగా నిలబడమనండి'' అంటూ వొళ్లంతా నల్లటి మురికితో నిలబడ్డ సుబ్రమణ్యం వంక చీదరగా చూశాడాయన.

ధనుర్ధారి గారికి వొళ్లు మండిపోయింది. ''చూడండి సార్, మేము మాట్లాడటానికి వచ్చింది మీ కంపూ, మీ డ్రైనేజీ గురించే. మెయిన్ డ్రైనేజీకి మీ ఇంట్లోంచి కలుపుకున్నపుడుగానీ గాని, మెయింటెనెన్సుకు గాని ఒక్క పైసా ఇవ్వలేదు తమరు. మనం తెలివిగా తప్పించుకున్నాం అని, అంతా వాళ్లే చూసుకుంటార్లే అని మీరనుకున్నట్టే అందరూ అనుకుంటే? మన కొంపలే కంపుకొడతాయి. అందరూ కలిసి చేయాల్సిన పనుల్లో మీ వంతు కాకపోయినా, మీకు వీలైన సహకారం ఇవ్వకపోతే ఎలా? ఎవరు పూనుకుంటే వాళ్లనెత్తినే బాధ్యతల్ని రుద్దేస్తే ఎవరు ముందుకొస్తారు? ఇంట్లో మురికిని కాదు, మన వొంట్లో మురికిని బయటకి పంపాలి ముందు. మనల్ని మనం బాగుచేసుకుంటే, తర్వాత కాలనీ బాగు పడుతుంది. దరిమిలా దేశం బాగుపడుతుంది'' అన్నాడు ఆవేశంగా.

''బైదిబై, సుబ్రమణ్యాన్ని దూరంగా వుండమంటారా? ఇతడు మీ కోసం, మీ మురికిని శుభ్రం చెయ్యడం కోసం వచ్చాడు. మీరు చేసుకోలేని పనిని ఇతడు చేస్తున్నాడు, ప్రేమించి, ఆదరించాల్సిన మనిషిని అసహ్యించుకుంటే అది కుసంస్కారం అనిపించుకుంటుంది'' అన్నాడు ధనుర్ధారి గారు కటువుగా.

''పోన్లెండి సార్. ఆయన ప్రేమించకపోతే ఏమైందీ, నేను ప్రేమిస్తాగా! మీరు పర్మిషనిస్తే ఒక్కసారి ఆయన్ని గట్టిగా కావులించుకుంటా!'' అంటూ ముందుకు వెళ్లబోయాడు సుబ్రమణ్యం. వొళ్లంతా మురికితో ముందుకొస్తున్న అతగాణ్ణి చూసి ఇంటాయన భయపడిపోయి, లోపలికి దూరి తలుపేసేసుకున్నాడు.

అందరూ గట్టిగా నవ్వేరు. ఆ నవ్వులు పువ్వుల్లా పరిమళించి అంతవరకూ అక్కడ ముసిరిన మురికి వాసననంతా పోగొట్టాయి! ఇంకో ఇంటిని శుభ్రం చెయ్యడానికి ముగ్గురూ మరో అడుగు ముందుకు వేశారు!

☆





# బ్రిటన్ ఎన్నికల కథా... కమామిషు...

**ఎప్పుడైనా ఇండియా, అమెరికా దేశాలకు చెందిన అత్యున్నత స్థాయి నాయకులు కలుసుకున్నప్పుడు "ప్రపంచంలోని రెండు అతిపెద్ద, అతి పురాతనమైన ప్రజాస్వామిక దేశాల" నడుమ ఉన్న సౌభ్రాతృత్వ సంబంధాల గురించి తప్పనిసరిగా మాట్లాడుకుంటుంటారు.**

**అతి పురాతన ప్రజాస్వామిక దేశం అనే బిరుదుకి యునైటెడ్ కింగ్‌డమ్‌కి అర్హత లేకపోవచ్చు, వాస్తవానికి బ్రిటన్‌ని 'అన్ని పార్లమెంటులకు తల్లి'గా అభివర్ణిస్తుంటారు. ఎందుకంటే, బ్రిటన్ పార్లమెంట్‌కి 900 సంవత్సరాల చరిత్ర ఉంది.**

రాజ్యాంగ బద్ధమైన రాజరిక వ్యవస్థ పరిధిలో పార్లమెంటరీ తరహా ప్రజాస్వామ్య విధానాన్ని బ్రిటన్ అనుసరిస్తోంది. రెండవ క్వీన్ ఎలిజబెత్ పాలనలో బ్రిటన్ ప్రస్తుతం ఉంది. ఈ రాణే రాజ్యాధినేత కూడా. బ్రిటన్‌లోని అలిఖిత రాజ్యాంగం ప్రకారం, రాజ్యాధినేతకూడా. బ్రిటన్‌లోని అలిఖిత రాజ్యాంగం ప్రకారం రాజ్యాధినేతగా ఉన్నప్పటికీ రాణికి పరిమితమైన అధికారాలు, పరిధి మాత్రమే ఉన్నాయి. మంత్రి మండలి సలహా ప్రకారం ఆమె వ్యవహరిస్తారు.

ఇటీవలి బ్రిటన్ పార్లమెంట్‌కి జరిగిన ఎన్నికల సందర్భంగా, ఈ రాజరిక వ్యవస్థ ప్రభుత్వం, పార్లమెంట్ తదితర అంశాల పనితీరు గరించి తెలుసుకోవటం ఆసక్తికరంగా ఉంటుంది. ప్రత్యేకించి అక్కడి ఎన్నికల ప్రక్రియ గురించి కూడా తెలుసుకోవాల్సి ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్‌ని మన దేశంలో ఇంగ్లాండ్ అనీ, బ్రిటన్ అనీ, గ్రేట్ బ్రిటన్ అని రకరకాలుగా పిలుస్తుంటారు.



# ఇవి ప్రసిద్ధ చిరునామాలు

ఎప్పుడైనా లండన్‌కు వెళ్లినప్పుడు కొన్ని చిరునామాలకు వెళ్ళకుండా తిరిగి వచ్చినట్లయితే, ఆ సందర్భం అసంపూర్ణమే అని చెప్పాలి. రెండవ క్వీన్ ఎలిజబెత్ నివసించే బకింగ్ హామ్ ప్యాలస్, బ్రిటిష్ పార్లమెంట్ ఉన్న వెస్ట్ మినిస్టర్ ప్యాలస్, ప్రధానమంత్రి అధికార నివాసం అయిన నెంబర్ 10, డౌనింగ్ స్ట్రీట్ మొదలైనవి ఆ ప్రసిద్ధ చిరునామాలు.

10, డౌనింగ్ స్ట్రీట్ ప్రధానమంత్రి అధికారిక నివాసమేకాక, కార్యాలయం కూడా. నగరం నడిబొడ్డున ఈ భవనం ఉంది. పార్లమెంట్ భవనానికి, రాణి ప్యాలస్‌కి సమీపంలో ఉంది.

300 సంవత్సరాల క్రితం నాటి ఈ భవనంలోని మూడవ అంతస్తు ప్రధానమంత్రి నివాసంగా ఉపయోగపడుతుండగా, ఇతర అంతస్తుల్లో ఆయన కార్యాలయాలు ఉన్నాయి. విదేశాల నుంచి వచ్చే ప్రభుత్వాధి నేతలకు, ఇతర ముఖ్యులకు '10'వ నెంబర్ ప్రముఖంగా కనపడే ప్రధాన ద్వారం వద్ద ఆయన ఆహ్వానం పలుకుతారు.






ఇది నగరం నడిబొడ్డున ఉన్నప్పటికీ, తొలుత ఎక్కువమంది ప్రధాన మంత్రులు దీన్ని నివాసంగా చేసుకోలేదు. భవనం పాతదవటంతో, నిర్వహణా ఖర్చులు అధికమవటంతో ఈ భవనాన్ని కూల్చివేయాలని అధికారులు చాలాసార్లు ప్రయత్నించారు. అయితే, ఆ ప్రయత్నాలన్నిటినీ అధిగమించి, ఆ భవనం ఇప్పటికీ నిలిచి ఉంది. గత 100 సంవత్సరాలకు పైబడి అనేక మంది ప్రధాన మంత్రులకు అధికారిక నివాసంగా, కార్యాలయంగా సేవలందింస్తోంది.

కొనసాగుతున్న బ్రిటిష్ సంప్రదాయం ప్రకారం, ప్రధానమంత్రి పదవి నుంచి దిగిపోగానే నూతన ప్రధాన మంత్రి పదవీ స్వీకారం చేసిన వెంటనే, మాజీ ప్రధాని ఈ భవనాన్ని ఖాళీ చేసేస్తారు, 10 సంవత్సరాలపాటు సుదీర్ఘ కాలం ప్రధానమంత్రిగా ఉన్న టోనీ బ్లెయిర్ 2007 జూన్ 27 మధ్యాహ్నం ఒంటి గంటకు తన సిబ్బందికి వీడ్కోలు చెప్పి, 10, డౌనింగ్ స్ట్రీట్ భవనాన్ని ఖాళీ చేసి, ఆ తరువాత బకింగ్‌హామ్ ప్యాలస్‌కు వెళ్లి క్వీన్ ఎలిజబెత్‌కు రాజీనామా సమర్పించారు. అదే మధ్యాహ్నం 2.55 గంటలకు ఆయన వారసుడు గార్డన్ బ్రౌన్ భవనంలోకి అడుగు పెట్టారు.

చరిత్రాత్మకమైన వెస్ట్‌మినిస్టర్ ప్యాలస్ లండన్‌లో మరొక ప్రముఖ చిరునామా. థేమ్స్ నది ఒడ్డున ఉన్న ఈ ప్యాలస్‌లో మొదట్లో ఇంగ్లాండ్ చక్రవర్తులు ఉండేవారు. ఒకసారి ఒక పెద్ద అగ్నిప్రమాదం ఈ ప్యాలస్ సముదాయంలోని ముఖ్య భాగాన్ని దహించి వేయటంతో, అప్పటి నుంచి చక్రవర్తులు అక్కడ ఉండటం లేదు. తరువాత అది పార్లమెంట్ ఉభయ సభలకు ఆశ్రయమిచ్చింది. 19వ శతాబ్దం తొలి భాగంలో మరొక పెద్ద అగ్ని ప్రమాదం జరగటంతో, గోతిక్ నిర్మాణశైలిలో ప్రస్తుతమున్న భవనాన్ని పునర్నిర్మించారు. ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఇదొక గుర్తుగా మారింది. అందువల్లనే మన ప్రజాస్వామ్యాన్ని కూడా వెస్ట్ మినిస్టర్ తరహా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తారు.

యు.కె.లో ఇటీవల సాధారణ ఎన్నికలు జరిగాయి. ఇవి కాక, మరో నాలుగురకాల ఎన్నికలు అక్కడ జరుగుతుంటాయి. యూరోపియన్ యూనియన్‌లో యు.కె. మెంబర్ అవటం వలన యురోపియన్ పార్లమెంట్‌కి కూడా అక్కడ ఎన్నికలు జరుగుతుంటాయి.

యు.కె.లో సాధారణ ఎన్నికలు ప్రతి ఐదేళ్ళకు ఒకసారి జరుగుతుంటాయి. ఐదేళ్ళకు ఒకసారి జరిగే ఈ ఎన్నికలను గురువారం నాడు మాత్రమే నిర్వహించటం ఆనవాయితీ. ఈ సారి కూడా గురువారం నాడు మే 6వ తేదీన యు.కె.ఎన్నికలు జరిగాయి.

18 ఏళ్ళు నిండిన వారు ఓటింగ్‌లో పాల్గొనవచ్చు. అయితే తప్పనిసరి మాత్రం కాదు. యుకె లో చట్టబద్ధంగా నివశిస్తున్న ఏ యు.కె. పౌరుడయినా, ఐర్లాండ్ రిపబ్లిక్ పౌరుడయినా, కామన్ వెల్త్ పౌరుడయినా ఓటింగ్‌లో పాల్గొనవచ్చు. గమ్మత్తేమిటంటే, ప్రభువుల సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) ప్రస్తుత సభ్యులను ఓటింగ్ నుంచి మినహాయించారు. సైద్ధాంతికంగా వీరు ఓటు చేయటానికి అర్హత ఉంది కాని, వారు ఓటు చేయరు.

బ్రిటన్ పార్లమెంట్‌కి 1000 సంవత్సరాలపైగా చరిత్ర ఉంది. ఎవరూ దీన్ని పనిగట్టుకు ఏర్పాటు చేయలేదు. అయితే, మారుతున్న సమాజ అవసరాలకు తగినట్లుగా రూపొందుతూ వచ్చింది. సంపూర్ణ రాజరిక వ్యవస్థ నుంచి ఆధునిక ప్రజాస్వామిక విధానానికి మార్పు చెందుతూ వచ్చింది.

యు.కె.లోని హౌస్ ఆఫ్ కామన్స్‌కు సభ్యులను ప్రజలు నేరుగా ఎన్నుకుంటారు. హౌస్ ఆఫ్ లార్డ్స్ మన రాజ్యసభ మాదిరిగా ఉంటుంది. అనేక శతాబ్దాలుగా థేమ్స్ నది ఒడ్డున ఉన్న అద్భుతమైన వెస్ట్‌మినిస్టర్ ప్యాలస్‌లోనే పార్లమెంటులోని రెండు సభలనూ నిర్వహిస్తున్నారు.

హౌస్ ఆఫ్ కామన్స్ కాల వ్యవధి ఐదు సంవత్సరాలు. ఎన్నికలు నిర్వహించడానికి ఒక నిర్ణీత తేదీ అంటూ ఉండదు. అయితే, అధికారంలో ఉన్న పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్ణయించుకుంటుంది.

ఇక్కడ ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వాధినేత అయిన ప్రధాన మంత్రికి చెందిన పార్టీ మెజారిటీని గెలుచుకోవటంలో విఫలం అయినట్లయితే కూడా ప్రధానమంత్రి తన పదవిని వదిలి పెట్టక్కరలేదు.

## భారతదేశమంటే అభిమానం

కామెరూన్‌కు భారతదేశమంటే ప్రత్యేక అభిమానం. "భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. శరవేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థ. సమర్థమైన వాణిజ్య భాగస్వామి" అని ఆయన గతంలో ఓ వ్యాసంలో రాశారు. ఇప్పుడు ఉన్నదంతా భారతదేశ సమయమేనని, ఈ వాస్తవాన్ని అంగీకరించాల్సిన సమయం ఆసన్నమైందని పాశ్చాత్యులకు తెలిపారు. ప్రపంచ ఆధిపత్యాన్ని భారత్, చైనాలతో పంచుకోవాల్సి ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన కన్సర్వేటివ్స్ కొత్త ఇమ్మిగ్రేషన్ విధానం ప్రకారం ప్రతి యేటా కొత్తగా వచ్చేవారి సంఖ్య మీద కొంత పరిమితి విధించబోతున్నారు.

కొత్త సభ సమావేశమై చర్చలు జరిపి, రాణి ఉపన్యాసంపై ప్రవేశపెట్టే తీర్మానంపై ఓటింగ్ జరిపేంత వరకు ప్రధానమంత్రి తన పదవిలో కొనసాగవచ్చు. రాణి ఉపన్యాసం మన రాష్ట్రపతి పార్లమెంట్ ఉభయసభలను ఉద్దేశించి చేసే ప్రసంగం లాగానే ఉంటుంది.

ఈ తీర్మానాన్ని సభ తిరస్కరించినట్లయితే, ప్రధానిపై సభకు విశ్వాసం

## బ్రిటన్ నూతన ప్రధాని డేవిడ్ కామెరూన్

బ్రిటిష్ చరిత్రలో కొత్త శకం ఆరంభమైంది. కన్సర్వేటివ్ పార్టీ నాయకుడు డేవిడ్ కామెరూన్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. లిబరల్ డెమొక్రాట్లతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు 43 ఏళ్ళ కామెరూన్ ప్రకటించారు. ఆ పార్టీ నాయకుడు నిక్ క్లెగ్‌ను ఉప ప్రధానిగా నియమిస్తున్నట్లు బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది.



అనంతరం కామెరూన్ బాధ్యతలు స్వీకరించారు. క్లిష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందన్న కామెరూన్.. ముందున్నవి మంచి రోజులని చెప్పారు. నలుగురు లిబరల్ డెమొక్రాట్లకు కూడా కేబినెట్ పదవులు ఇచ్చే ఒప్పందంపై సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. దాంతో రెండో ప్రపంచయుద్ధం తర్వాత బ్రిటన్‌లో మొట్టమొదటి సంకీర్ణ ప్రభుత్వం వచ్చినట్లయింది. అంతకుముందు విన్‌స్టన్ చర్చిల్ కూడా సంకీర్ణ ప్రభుత్వానికి నేతృత్వం వహించారు. 1812లో లార్డ్ లివర్‌పూల్ తర్వాత కామెరూనే అత్యంత పిన్నవయస్కుడైన ప్రధానిగా రికార్డు సృష్టించారు. దాంతో 200 సంవత్సరాల తర్వాత బ్రిటన్‌కు యువ ప్రధాని వచ్చినట్లయింది. కామెరూన్‌ను పలు దేశాల అధినేతలు అభినందించారు. ☆





లేదని అర్థం. అప్పుడు ప్రధాన మంత్రి రాజీనామా చేయక తప్పదు.



అటువంటి అత్యవసర పరిస్థితి ఎప్పుడూ ఎదురుకాలేదు. అయితే, 1974లో ఎడ్వర్డ్ హీత్ ప్రధాని పదవిని కొంతకాలం వదిలిపెట్టలేదు. అయితే చివరికి లేబర్ పార్టీకి చెందిన హెరాల్డ్ విల్సన్‌కి దారివ్వాల్సి వచ్చింది.

అధికస్థానాలు తెచ్చుకున్న పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. రెండవ అతి పెద్ద పార్టీ 'గౌరవనీయ రాణికి విధేయ ప్రతిపక్షం'గా అవతరిస్తుంది. అప్పటికే, అధికారంలో ఉన్న పార్టీ ఎన్నికల్లో తిరిగి గెలుపొందినట్లయితే, అదే ప్రభుత్వం అదే రూపంలో కొనసాగుతుంది. మంత్రివర్గం మళ్లీ ప్రమాణస్వీకారం చేయవలసిన అవసరం లేదు. ఒక వేళ అధికారంలో ఉన్న పార్టీ మెజారిటీ స్థానాలు సాధించలేకపోతే, ప్రధానమంత్రి రాజీనామా చేస్తారు. ఇది పూర్తయ్యేవరకు, తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసినందిగా అతి పెద్ద పార్టీ నాయకుడిని రాణి ఆహ్వానించరు.

బ్రిటన్‌లో రెండుపార్టీల వ్యవస్థ ఉంది. కన్సర్వేటివ్ పార్టీ (టోరీలు), లేబర్ పార్టీ అనే రెండు పార్టీలు అనేక దశాబ్దాలుగా మార్చి, మార్చి అధికారాన్ని పంచుకుంటున్నాయి. ఇటీవలి కాలంలో లిబరల్ డెమోక్రాట్స్ పార్టీ గణనీయమైన ఎన్నికల ఫలితాలు సాధించింది కానీ, స్వంతంగా మెజారిటీ వచ్చేంత స్థాయికి చేరుకోలేదు.

ఇంతకుముందు ఈ పార్టీ లిబరల్ పార్టీగా ఉండేది. తరువాత సోషల్ డెమోక్రటిక్ పార్టీతో విలీనమయ్యాక గత ఎన్నికల్లో మొత్తం 646 స్థానాలకు గాను 62 స్థానాలను గెలుచుకుంది. రెండు పార్టీల వ్యవస్థ స్థానంలో లిబరల్ డెమోక్రటిక్ పార్టీతో పాటు ఇతర చిన్న చిన్న పార్టీలు కొంతవరకు చొరబడటాన్ని, 'రెండున్నర పార్టీల వ్యవస్థ'గా కొందరు సరదాగా అభివర్ణిస్తున్నారు.

లండన్‌లో అత్యంత ప్రసిద్ధ చిరునామా నెంబర్ 10, డౌనింగ్ స్ట్రీట్. ఇందులోనే ప్రధాన మంత్రి నివాసం, అధికార కార్యాలయం ఉంటాయి. గత 30 సంవత్సరాలలో ఈ భవనం ముగ్గురు ప్రధానులను మాత్రమే చూసింది. ఆ ముగ్గురు కన్సర్వేటివ్ పార్టీకి చెందిన దివంగత మార్గరెట్ థాచర్, జాన్ మేయర్, లేబర్ పార్టీకి చెందిన టోనీ బ్లెయిర్. మార్గరెట్ థాచర్ 'ఉక్కుమహిళ'గా ప్రసిద్ధికెక్కారు.

1979-1990 సంవత్సరాల మధ్య మార్గరెట్ థాచర్ ప్రధానమంత్రిగా ఉండగా, అదే పార్టీకి చెందిన జాన్ మేయర్ 1990-1997 మధ్యకాలంలో ప్రధానిగా పనిచేశారు. లేబర్ పార్టీకి చెందిన టోనీ బ్లెయిర్ 1997-2007 మధ్యకాలంలో అర్ధాంతరంగా పదవికి రాజీనామా చేయనట్లయితే, సుదీర్ఘ కాలం ప్రధానమంత్రిగా పనిచేసిన రికార్డు సాధించి ఉండేవారు.

అయితే, బ్రిటన్ ప్రధానమంత్రులందరిలో అత్యంత ప్రముఖుడిగా వెలిగిన ప్రధానమంత్రి విన్‌స్టన్ చర్చిల్. 1945లో రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని బ్రిటన్‌ని విజయపథాన నడిపించారు. ఆయన మంచి వక్త. పైగా సాహితీ వేత్త. 1953లో ఆయన రచనకు నోబెల్ బహుమతి వచ్చింది. ఆయన కీర్తి ప్రతిష్ఠలు ఆకాశానికి ఎగిసి ఉన్న స్థితిలో, అదే సంవత్సరం జరిగిన ఎన్నికల్లో ఆయన విచిత్రంగా ఓటమిపాలయ్యారు. యుద్ధ సమయంలో గొప్ప నాయకుడిగా ఉన్న చర్చిల్ శాంతియుత సమయంలో పునర్నిర్మాణ పనులను సమర్థవంతంగా చేపట్టలేరేమోనని బహుశా బ్రిటన్ ప్రజలు భావించి ఉండవచ్చు.

*- డి కేశవరావు*

*(అనువాదం: వై. సరోజ)*

## థాచర్ చెక్కిన శిల్పం

ఉక్కు మహిళగా పేరొందిన మార్గరెట్ థాచర్ చేతిలో రూపొందిన డేవిడ్ కామెరూన్.. 13 సంవత్సరాల సుదీర్ఘ కాలం తర్వాత టోరీలను అధికారంలోకి తీసుకొచ్చారు. సంపన్న కుటుంబ వారసునిగా వచ్చినా.. సామాన్యుల్లో ఒకరిగా కలిసిపోయి రాజకీయ రంగంలో త్వరత్వరగా ఒక్కో మెట్టూ ఎదిగారు. ఇన్నాళ్ళూ బైక్‌పైనే తిరుగుతూ. . తనను డేవ్ అని పిలవాల్సిందిగా సహచరులను కోరేవారు. యువరాజులు విలియం, హేరీ చదివిన ఎటన్ కాలేజిలోనే కామెరూన్ కూడా చదువుకున్నారు. అనంతరం ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చేరి, అక్కడి రౌడీ స్టూడెంట్ డైనింగా సొసైటీగా పేరొందిన బల్లింగ్డన్ క్లబ్‌లో చేరారు.



ప్రస్తుతం లండన్ మేయర్‌గా ఉన్న బోరిస్‌జాన్సన్ కూడా ఆ క్లబ్ సభ్యుడే. డిగ్రీ చేతికొచ్చిన తర్వాత ప్రధాని మార్గరెట్ థాచర్ నేతృత్వంలోని కన్సర్వేటివ్ పార్టీలో చేరి, ఆర్థికమంత్రి నార్మన్ లామంట్‌కు సలహాదారు స్థాయికి ఎదిగారు. తర్వాత రాజకీయాలు వదిలిపెట్టి ఏడేళ్ళ పాటు ఓ మీడియా కంపెనీకి కమ్యూనికేషన్స్ చీఫ్‌గా పనిచేశారు. తర్వాత మళ్లీ 2001లో రాజకీయాల్లోకి వచ్చి ఎంపీగా ఎన్నికయ్యారు. తక్కువకాలం లోనే పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు.




# ఫుట్‌బాల్ ఆటకు ఆ కాలం నిజంగా స్వర్ణయుగం

ఈ మధ్యకాలంలో వార్తా పత్రికలో వచ్చిన ఒక వార్త చాలా ఆనందం కల్గించింది. క్షీణించిన ప్రజాదరణ, ఆంధ్రప్రదేశ్‌లోని క్రీడా నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా గడిచిన అనేక సంవత్సరాలుగా ప్రాభవాన్ని కోల్పోయిన ఫుట్‌బాల్ క్రీడను పునరుద్ధరించి, బలోపేతం చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఈ వార్తలో పేర్కొన్నారు. ఫుట్‌బాల్ క్రీడను అభివృద్ధి చేయటానికి తీసుకోబోయే చర్యల గురించి కూడా అందులో వివరంగా పేర్కొన్నారు.

క్రీడా ప్రియులకు ఇది నిజంగా శుభవార్త. ఫుట్‌బాల్ క్రీడ స్వర్ణయుగాన్ని కళ్లారా చూసిన వారికి కానీ, కనీసం విన్నవారికి కాని ఇది ఎంతో సంతోషించే వార్తే.

స్వర్ణయుగమా? అని ప్రస్తుతపు యువత అపనమ్మకంతో అడగవచ్చు. వీరిని అనుకుని లాభం లేదు. ఎందుకంటే అనేక సంవత్సరాలుగా రాష్ట్రంలోని హైదరాబాద్‌లో కానీ, వేరే ప్రదేశాల్లోకాని ఫుట్‌బాల్ క్రీడకు సంబంధించిన ఎటువంటి కార్యక్రమాలు జరగటం లేదు.

1950ల దశకంలోను, 60ల దశకంలోను రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన స్థానంలో ఉంది. ఒలింపిక్స్ పోటీలకు వరసగా అనేక సంవత్సరాలపాటు భారత జట్టునుంచి గరిష్ట సంఖ్యలో ఫుట్‌బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు.

మనం హైదరాబాద్ ఫుట్‌బాల్ జట్టుగా పిలుచుకున్నా, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టుగా పిలుచుకున్నా, హైదరాబాద్ సిటీ పోలీసు జట్టు అని కానీ, ఆంధ్ర ప్రదేశ్ పోలీసు జట్టు అని కాని అర్థం చేసుకోవాలి. స్థానిక ఫుట్‌బాల్ క్లబ్‌ల నుంచి ప్రతిభావంతులైన ఆటగాళ్లను కూడా ఈ జట్టు చేర్చుకునేవి. దేశంలో జరిగిన అనేక ప్రధాన టోర్నమెంట్లను రాష్ట్ర జట్టు గెలుచుకుంది. బెంగాల్‌లోని అత్యంత బలమైన జట్లు కూడా మన రాష్ట్ర జట్టంటే భయపడేది.

ప్రజలు కూడా ఫుట్‌బాల్ ఆటను ఇష్టపడేవారు. సాధారణమైన లీగ్ మాచ్‌లు చూడటానికి కూడా వారు పెద్ద సంఖ్యలో హాజరయ్యేవారు. చివరికి ఇటీవలి కాలంలో అంటే 80వ దశకంలో కూడా సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జరుగుతున్న ఫుట్‌బాల్ ఆటను చూడటానికే ఎక్కువ మంది హాజరయ్యేవారు. ఆ పక్క మైదానంలో జరుగుతున్న రంజీ క్రికెట్ ట్రోఫీ ఆట దగ్గరికంటే, ఫుట్ బాల్ ఆట దగ్గరే ఎక్కువ మంది కనపడేవారు.

జెంటిల్‌మెన్ ఆట అయిన క్రికెట్ కంటే, ఫుట్‌బాల్ ఆటే ఆమ్ ఆద్మీలను ఎక్కువగా రంజింపచేసేది. ముందు హైదరాబాద్ పోలీసు జట్టు, ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భావం తరువాత ఆంధ్ర ప్రదేశ్ పోలీసు జట్టు

# మన అగ్రశ్రేణి రికార్డులు

## డ్యూరాండ్ కప్

- హైదరాబాద్ సిటీ పోలీసు జట్టుగా 1950,1954,1957 లలో కైవశం.
- ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టుగా 1961లో కైవశం
- 1952, 1956,1963లలో రన్నర్స్ అప్ స్థానం.

## రోవర్స్ కప్

- ఆంధ్రప్రదేశ్ పోలీసు జట్టుగా 1950, 1951, 1952, 1954,1957, 1960లలో కైవశం
- 1962, 1963, లలో తూర్పు బెంగాల్‌తో కలిసి సంయుక్తంగా కైవశం.
- 1943లో రన్నర్స్అప్ స్థానం.

## సంతోష్ ట్రోఫీ

- 1956-57, 1957-58, 1965-66లలో కైవశం.
- 1959-50, 1950-51, 1963-64లలో రన్నర్స్ అప్ స్థానం.

## మన మేటి ఫుట్‌బాల్ క్రీడాకారులు

**ఒలింపిక్ క్రీడాకారులు (మొత్తం 15 మంది)**

| | | |
|---|---|---|
| కె.పి.ధనరాజ్ | - | 1948 |
| ఎస్.కె.అజీజ్ | - | 1952 |
| నూర్ మహమ్మద్ | - | 1956 |
| అహమ్మద్ హుసేన్ | - | 1956 |
| పీటర్ తంగరాజ్ | - | 1956 |
| ఎస్.కె. మొయిన్ | - | 1956 |
| ఎస్.ఎ.సలామ్ | - | 1956 |
| టి.బలరామ్ | - | 1956 |
| యూసుఫ్ ఖాన్ | - | 1956 |
| జుల్ఫికర్ | - | 1956 |
| ఎస్.ఎ.రహీమ్ | - | 1956 (కోచ్) |
| డి.కన్నన్ | - | 1960 |
| స్క్వాడ్రన్ లీడర్ ఎస్.ఎస్.హకీమ్ | - | 1960 |
| ఎస్.ఎస్.హమీద్ | - | 1960 |
| ఎస్.ఎస్.సమద్ | - | 1956 |
| ఎం.ఎ.సయీద్ | - | 1956 |



## ఫిఫా రిఫరీలు

జి.ఎం.పెంటయ్య

మహమ్మద్ అజామ్

స్క్వాడ్రన్‌లీడర్ ఎస్.ఎస్. హకీమ్

## అర్జున అవార్డు గ్రహీతలు

టి.బలరామ్ - 1962

యూసుఫ్ ఖాన్ - 1966

## అంతర్జాతీయ కోచ్‌లు

| | |
|---|---|
| ఎస్.ఎ.రహీమ్ | డి.ఎం.కె. అఫ్జల్ |
| జి.ఎం.పెంటయ్య | జాన్ విక్టర్ |
| స్క్వాడ్రన్‌లీడర్ ఎస్.ఎస్. హకీమ్ | షబ్బీర్ అలీ |
| సయ్యద్ నయీముద్దీన్ | |
| మహమ్మద్ హబీబ్ | |

దేశంలో జరిగిన అనేక ప్రధాన టోర్నమెంట్లను గెలుపొందింది.

రోవర్స్ కప్, డ్యురాండ్ కప్, సంతోష్ ట్రోఫీ వంటి టోర్నమెంట్లను ఒకసారి కాదు, అనేకసార్లు మన రాష్ట్ర జట్టు గెలుచుకుంది. ఉదాహరణకు, 1950-54 మధ్యకాలంలో రోవర్స్ కప్‌ను వరుసగా ఐదుసార్లు గెలుచుకుంది. అటువంటి సందర్భాల్లో, విజయం సాధించి తిరిగి వచ్చిన రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఘనస్వాగతం లభించేది. రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నిలబడి, తమ అభిమాన క్రీడాకారులకు చప్పట్లతో, జయ జయ నినాదాలతో స్వాగతం పలికేవారు. అందంగా అలంకరించిన ట్రక్కులలో ఆటగాళ్ళను ట్రోఫీలతో సహా నిలబెట్టి, ఊరేగింపుగా తీసుకెళ్లేవారు.

1952లో హెల్సింకిలో, 1956లో మెల్‌బోర్న్‌లో, 1960లో రోమ్‌లో వరుసగా జరిగిన మూడు ఒలింపిక్స్ క్రీడల్లో భారత జట్టులో ప్రధాన పాత్ర వహించినది మన రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడాకారులే. వీరి కోచ్ అత్యంత ప్రతిభా వంతుడైన సయ్యద్ అబ్దుల్ రహీమ్.

1952లో హెల్సింకి ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్న భారత ఫుట్‌బాల్ జట్టులో ముగ్గురు హైదరాబాద్ క్రీడాకారులుండగా, 1956 మెల్‌బోర్న్ ఒలింపిక్స్ క్రీడల్లో భారత జట్టులో ఎనిమిది మంది, 1960 రోమ్ ఒలింపిక్స్‌లో ఆరుగురు పాల్గొనటం విశేషం.

వీరిలో మరింత అగ్రశ్రేణి క్రీడాకారులనదగ్గవారు అజీజుద్దీన్, నూర్ అహమ్మద్, ఎస్ కె మొయినుద్దీన్, యూసుఫ్ ఖాన్, పీటర్ తంగరాజ్, కన్నన్, బలరామ్‌లు.

ఇటీవల హైకోర్టులో దాఖలయిన ఒక పిటిషన్‌లోని సమాచారం ప్రకారం, జింఖానా మైదానం 15 మంది ఒలింపియాడ్ క్రీడాకారులను, 8 మంది అంతర్జాతీయ స్థాయి కోచ్‌లను, ముగ్గురు అంతర్జాతీయ రిఫరీలను, నలుగురు అర్జున అవార్డు గ్రహీతలను, ఒక





ద్రోణాచార్య అవార్డు గ్రహీతను, 10 మంది సీనియర్, మరో 10 మంది జూనియర్ అంతర్జాతీయ క్రీడాకారులను ఫుట్‌బాల్ క్రీడారంగంలో తయారుచేసింది.

మన ఫుట్‌బాల్ జట్టు రోవర్స్ కప్‌ను 9 సార్లు, డ్యురాండ్ కప్‌ను 4 సార్లు, సంతోష్ ట్రోఫీని (నేషనల్ ఛాంపియన్ షిప్) మూడుసార్లు గెలుచుకుంది. ఇవన్నీ 50ల దశకంలోను, 60ల దశకంలోనూ జరిగాయి. అజీజ్‌నూర్, మెయిన్, యూసుఫ్, తంగరాజ్, బలరామ్, ప్రతిభావంతుడైన కోచ్ ఎస్.ఎ.రహీమ్, నయీముద్దీన్ మొదలైన వారు నేటి డేవిడ్ బెకామ్, వేన్‌రూనీ, లయనెల్ మెస్సి, రోనాల్డో వంటి మేటి క్రీడాకారులతో సమానంగా ప్రజాదరణను, క్రీడాకారుల అభిమానాన్ని పొందారు.

బొల్లారంలో జన్మించిన పీటర్ తంగరాజ్ ఎక్కువగా కోల్‌కతా జట్టుకు ఆడేవారు. దేశంలోనే ఆయన అత్యంత ఉత్తమ గోల్‌కీపర్‌గా పేరు తెచ్చుకున్నారు. 1958లో ఆయనను ఆసియా ఉత్తమ గోల్ కీపర్ అవార్డు వరించింది. 1967లో అర్జున అవార్డును ఆయనకు బహుకరించారు.

హైదరాబాద్‌నుంచి ఎక్కువ మంది ఉత్తమశ్రేణి ఫుట్‌బాల్ క్రీడాకారులు పేరుతెచ్చుకోగా, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు కూడా ఈ విషయంలో ముందే ఉన్నాయి. ఉదాహరణకు వరహాలు, అప్పలరాజు కూడా మంచి క్రీడాకారులుగా వెలిగారు.

హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియం (మాజీ పోలీసు ఐజి శివకుమార్ లాల్ పేరును ఈ స్టేడియంకి పెట్టారు), సిటీ కాలేజి, ఫతేమైదాన్, జింఖానా మైదానం ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు ప్రసిద్ధ వేదికలుగా ఉండేవి. పోలీసు శాఖ నుంచే కాక, సిటీ కాలేజి ఓల్డ్ బాయ్స్, హంటర్స్, నేషనల్ స్పోర్టింగ్ వంటి ఫుట్‌బాల్ క్లబ్‌లు ఉత్తమ క్రీడాకారులను తయారు చేశాయి. వీరిలో కొందరు ఒలింపియన్స్ అయ్యారు కూడా.

హైదరాబాద్ ఫుట్‌బాల్ జట్టు అనుభవించిన స్వర్ణయుగం 70ల దశకం మధ్యభాగం నాటికి విషాదాంతమైంది. ఆ తరువాత దశాబ్దాల్లో మరింత వేగంగా పతనమైంది. గతంలోని ఘనకీర్తి జ్ఞాపకాలు మాత్రం మిగిలాయి. ఎంత ఘోరమైన విషయమంటే 2008లో శ్రీనగర్‌లో జరిగిన జాతీయ టోర్నమెంట్‌లో రాష్ట్రం నుంచి ఫుట్‌బాల్ జట్టు కనీసం పాల్గొనలేక పోయింది. ఒకప్పటి ప్రముఖ క్లబ్‌లు నిద్రాణ స్థితిలోకి వెళ్లిపోయాయి. ప్రతిష్ఠాత్మకమైన నిజామ్ గోల్డ్ కప్ టోర్నమెంట్‌లాంటివి చూసిన ఆరోజులు మళ్ళీ కనపడలేదు. ఈ ఏడాది ఆసియా గోల్డ్‌కప్ పోటీల్లో పాల్గొన్న భారత జట్టులో హైదరాబాద్ నుంచి ఒక్క ఆటగాడు కూడా లేకపోవటాన్ని ఆనాటి క్రీడాభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎందుకిలా జరిగింది? అధికార యంత్రాంగం నుంచి సరైన ఆదరణ లేకపోవటం, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గంలో అధికార తగాదాలు, క్రికెట్‌పై పెరుగుతున్న క్రీడాకారుల అభిమానం వంటివి ఇందుకు కారణాలని భావిస్తున్నారు. క్రీడాకారులు మంచి అవకాశాల కోసం కోల్‌కతాకు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళారు.

ఫుట్‌బాల్ క్రీడారంగం బాధలు ఇంతటితో ముగియలేదు. క్రీడా మైదానాలు కుదించుకుని పోతున్నాయి. జింఖానా మైదానంలో ఫుట్‌బాల్ ఆడే క్రీడాకారులు ఈ విషయంపై ఆందోళన చెంది, అటువంటి మరికొందరు క్రీడాకారులతో కలిసి 'అసోసియేషన్ ఫర్ ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్'గా ఏర్పడ్డారు. యువతలో ఫుట్‌బాల్ క్రీడపట్ల ఆసక్తి కలగజేయటం, ఫుట్‌బాల్ క్రీడను అభివృద్ధి చేయటం ఈ అసోసియేషన్ లక్ష్యాలు.

ఈ అసోసియేషన్ ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకి ఒక విజ్ఞాపన పత్రం ఇచ్చింది. జింఖానా ఫుట్‌బాల్ మైదానంలో క్రికెట్ స్టేడియం నిర్మించడానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రయత్నిస్తున్నదని, జంటనగరాల్లో ఉన్న ఈ ఏకైక ఫుట్‌బాల్ మైదానం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్వాధీనంలోకి వెళ్ళకుండా కాపాడాలని అందులో కోరింది. తద్వారా ఫుట్‌బాల్ క్రీడా ప్రయోజనాలను, క్రీడాకారులను, అభిమానులను రక్షించాలని కూడా అందులో కోరింది. తన వాదనకు మద్దతుగా జింఖానా మైదానం గత వైభవాన్ని, అది తయారు చేసిన ఉత్తమ క్రీడాకారులను, వారు దేశానికి, రాష్ట్రానికి సాధించి పెట్టిన విజయాలను వివరించింది.

బాధాకరమైన విషయాలు ఏమున్నప్పటికీ, వార్తాపత్రిక ప్రచురించిన ఈ వార్త చదివాక, ఫుట్‌వాల్ క్రీడకు మళ్లీ గత వైభవం చేకూరుతుందనే ఆశ కలిగింది. దీనికి అనుబంధంగా ఉన్న మరొక శుభవార్త ఏమిటంటే, ఫుట్‌బాల్ క్రీడను పునరుద్ధరించడానికి ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్- ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ రివైవల్ కమిటీ పేరిట ఒక సంస్థ ఏర్పాటైంది.

ఈ సంస్థ హైదరాబాద్‌లో జూన్ నెలలో ఫుట్‌బాల్ లీగ్‌ను నిర్వహిస్తోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, సిటీ కాలేజి ఓల్డ్ బాయ్స్, ఎజివోఆర్‌సి, హైదరాబాద్ స్పోర్టింగ్ , బిడిఎల్, ఇఎంఇ, ఎవోసి, ఎపిఎస్ఆర్‌టిసి మొదలైన జట్లు పాల్గొంటున్నాయి.

రాష్ట్రం గతంలో చూసిన ఫుట్‌బాల్ స్వర్ణయుగం రెండవ దశ తిరిగి ఆరంభమవుతుందని ఆశిద్దాం.

**- డి కేశవరావు**

*(అనువాదం: వై.ఎస్.)*

Printed & Published by: Dr. Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Dr. Phani Kumar**




పంచాయితీ రాజ్ సంస్థల ప్రతినిధుల సామర్థ్యాల పై వర్క్‌షాప్,
మే 13-14, 2010, ఎ.ఎమ్.ఆర్. అపార్డు



వర్క్‌షాప్ వివరాలు 25వ పేజీలో

Sthanika Palana
RNI No. APTEL / 2009/27888

# 2010

# జీవ వైవిధ్య సంవత్సరం



## జీవ రాశులు ఎన్నో... భూమి ఒక్కటే... భవిష్యత్తు ఒక్కటే...



## జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం

Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.